ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 4-8-2017 | పేజీలు: 14 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 110 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 6.52 తదుపరి త్రయోదశి; నక్షత్రం: మూల రా. 9.02 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: రా. 7.15-9.02; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.23; మ. 12.47-1.38; అమృతఘడియలు: మ. 1.58-3.41; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.44 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

పేదకు నజరానా

100 గజాల్లోపు ఆక్రమణలు ఉచితంగా క్రమబద్ధీకరణ

- దారిద్ర్యరేఖకు ఎగువనున్న వారికీ చాన్స్
- బేసిక్ విలువలో 7.5 నుంచి 30% వసూలు
- రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మందికి లబ్ధి
- అభ్యంతరాలు లేని ఆక్రమణలకే అవకాశం
- ప్రత్యామ్నాయ పంటలు వేస్తే ప్రోత్సాహకాలు
- రూ.53 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటన
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు



గురువారం కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న పేదలకు వాటిని క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దారిద్ర్య రేఖకు దిగువన, ఎగువన ఉన్న కుటుంబాలకు కూడా క్రమబద్ధీకరణ వర్తించనుంది. ఈ నిర్ణయంతో సుమారు 20 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. గురువారం వెలగపూడి సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. భేటీ అనంతరం మంత్రులు కళా వెంకట్రావు, ప్రత్తిపాటి పుల్లారావులు విలేకరుల సమావేశంలో కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. దీని ప్రకారం... రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న పేదలకు 100 చదరపు గజాలలోపు స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరించనున్నారు. దారిద్ర్య రేఖకు ఎగువనున్న కుటుంబాలకు 100 గజాల్లోపు స్థలాన్ని క్రమబద్ధీకరించేందుకు బేసిక్ విలువలో 7.5 శాతం వసూలు చేస్తారు. 101 నుంచి 250 గజాల వరకు బేసిక్ విలువలో 15 శాతం, 251 నుంచి 500 గజాల్లోపు బేసిక్ విలువలో 30 శాతం రుసుము వసూలు చేస్తారు. 500 గజాలకు మించి ఆక్రమణలు ఉంటే వాటిని తొలగిస్తారు. 2013 సంవత్సరంలో ఉన్న రిజిస్ట్రేషన్ విలువను బేసిక్ విలువగా తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాత ధరను పరిగణనలోకి తీసుకోవడం వల్ల ప్రజలకు

మిగతా 5వ పేజీలో...

నెల రోజుల్లో బీసీ కమిషన్ నివేదిక

- కాపు రిజర్వేషన్లపై కసరత్తు కొనసాగుతోంది
- మంత్రులు 4 నెలల పనితీరు నివేదికలివ్వాలి
- 24 ప్రాజెక్టుల నుంచి త్వరలో నీరు: సీఎం
- 1 నుంచి ఇంటింటికీ టీడీపీ పాదయాత్ర

5

ఉద్యోగులకు డీఏ వరం

రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల

ఇసుకపై ఎందుకీ అసంతృప్తి?

- 52% మంది అయిష్టానికి కారణమేంటి?
- టీడీపీ సమన్వయ సమావేశంలో సీఎం ప్రశ్న
- రవాణా చార్జీలు వెంటనే ఖరారు చేయాలి
- అన్నదమ్ములు పక్కా ఇళ్లు కలిపి కట్టుకోవచ్చు
- అర్థం లేని నిబంధనలతో వేధించడమెందుకు?
- గర్భిణులకు ఇంటికే 'అన్న అమృతహస్తం'
- ఎమ్మెల్యేకో పాలసీ ఉండదు!
- బెల్టు షాపులన్నీ తొలగించాల్సిందే: సీఎం

5



కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన ఉప ఎన్నిక ప్రచార సభలో ప్రసంగిస్తున్న జగన్. పక్కన శిల్పా సోదరులు

చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా

తప్పులేదు!

- అవినీతి పాలనకు గుణపాఠం చెప్పాలి
- 'ఏకగ్రీవం' అయితే నిధులు ఇచ్చేవారా?
- 2019 'కురుక్షేత్రం'లో విజయం మాదే
- జిల్లాల సంఖ్యను 25కు పెంచుతాం
- నంద్యాల బహిరంగ సభలో జగన్
- సీఎంనే కాల్చాలంటే.. ప్రజల పరిస్థితేంటి?
- తాత తండ్రుల నుంచి అదే వారసత్వం
- నంద్యాల సభలో పిచ్చెక్కి మాట్లాడారు
- విపక్ష నేత జగన్‌పై ధ్వజమెత్తిన మంత్రులు

(నంద్యాల నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

"నంద్యాల ఉప ఎన్నికల్లో సానుభూతి కోసం కుయుక్తులు, కుతంత్రాలు పన్నుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పులేదు" అని వైసీపీ అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు. "2019లో జరగబోయే కురుక్షేత్ర యుద్ధానికి నంద్యాల ఉప ఎన్నిక నాంది. అప్పుడు అధికారంలోకి వస్తాం. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రాన్ని జిల్లాగా చేస్తాం. జిల్లాల సంఖ్యను 25కు పెంచుతాం" అని కొత్తగా మరో ఎన్నికల హామీ ఇచ్చారు. గురువారం కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల ప్రచార సభలో జగన్ పాల్గొన్నారు. సీఎం చంద్రబాబుపై తీవ్ర పదజాలంతో విమర్శలు గుప్పించారు. "ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న ఈ ఎన్నికలో చంద్రబాబు ప్రభుత్వానికి

మిగతా 2వ పేజీలో...

ఉద్దానంపై గ్రాండ్ చాలెంజ్

- పరిశోధన సంస్థల మధ్య పోటీ
- నివేదిక ఆధారంగా సంస్థ ఎంపిక

5

బెట్టింగ్ కింగ్ కటకటాల్లోకి

- కృష్ణ సింగ్, 114 మంది బుకీలు, పంటర్లు అరెస్టు
- రూ.44 లక్షల నగదు, భారీగా బంగారం స్వాధీనం

14

'కొండవీటి'కి కొత్త కళ!

అంతర్జాతీయ స్థాయి జల రవాణా మార్గంగా వాగుకు సరికొత్త రూపు

- రాజధానికి ముంపు బెడద నుంచి విముక్తి
- ఏడీసీ ప్రణాళికకు సీఎం చంద్రబాబు ఆమోదం
- ప్రపంచ బ్యాంకు నిధులతో ప్రాజెక్టు అమలు

నవ్యాంధ్ర రాజధాని ప్రాంతాన్ని తరచూ వరదతో ముంచెత్తే కొండవీటి వాగు కొద్ది నెలల్లో వరదాయనిగా మారనుంది. కొండవీటి వాగు అంతర్జాతీయ స్థాయి జలరవాణా మార్గంగా రూపు మార్చుకోబోతోంది. తద్వారా అమరావతికి అద్భుతమైన పర్యాటక ఆకర్షణగా నిలవబోతోంది.

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజధానికి కొండవీటి వాగు ముప్పును శాశ్వతంగా తొలగించే దిశగా తొలి అడుగు పడింది. వాగును అభివృద్ధి చేసేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ప్రఖ్యాత కన్సల్టెంట్లతో కలిసి ఓ సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. ఓపక్క వరద

మిగతా 11వ పేజీలో...



సరుకు రవాణా, జల విహారానికీ ఉపయోగపడేలా కొండవీటి వాగు (ఊహా చిత్రం)



అసంపూర్తిగా విజయవాడ - గుండుగొలను రోడ్డు పనులు

'గామన్' గ్రహణం!

11

- పట్టాలెక్కని బెజవాడ-గుండుగొలను ప్రాజెక్టు
- మూడో విడత గడువూ ముగిసింది
- ఐదేళ్లుగా అడుగు ముందుకు పడని వైనం
- విజయవాడ ట్రాఫిక్ కష్టాలకు లభించని పరిష్కారం

ఏపీ నుంచీ దిగ్విజయ్ ఔట్

- ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా
- కొత్త ఇన్‌చార్జిగా బీకే హరిప్రసాద్?
- పీసీసీ అధ్యక్షుడి మార్పూ ఖాయం!



హరిప్రసాద్, దిగ్విజయ్

16

శ్రావణంలో గ్రీష్మతాపం

2



విజయకృష్ణన్‌ను అభినందిస్తున్న కలెక్టర్ కార్తికేయ మిశ్రా

భేష్.. మీ ఆదర్శం!

- సబ్ కలెక్టర్ దంపతులకు 'తూర్పు' కలెక్టర్ ప్రశంస

రంపచోడవరం, ఆగస్టు 3: అధికారులయి ఉండి..సామాన్యుల ఆస్పత్రిలో ప్రసవం చేయించుకున్న రాజమండ్రి సబ్ కలెక్టర్ విజయ కృష్ణన్, ఆమె భర్త, ఐటీడీఏ పీవో దినేశ్‌కుమార్‌లకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో బుధవారం విజయ కృష్ణన్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. గురువారం జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఆస్పత్రిలో దంపతులను కలుసుకొన్నారు. ఏజెన్సీలో వైద్య సేవల పట్ల ఆదివాసీల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించడం కోసం ఉదాత్తమైన పనిచేసి.. అందరికీ ఆదర్శంగా నిలిచారంటూ వారిని అభినందించారు. జనన ధ్రువపత్రం, జననీ శిశు సురక్షా చెక్కుని అందించారు.

వెంకయ్యకు తెలుగు ఎంపీల సత్కారం



వెంకయ్యను కలిసిన మంత్రులు దత్తాత్రేయ, అశోక్, ఇతర ఎంపీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడితో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు గురువారం ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు సంఘీభావం తెలిపినందుకు వెంకయ్యనాయుడు వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగుదేశం, టీఆర్ఎస్, వైసీపీ, బీజేపీకి చెందిన తెలుగు ఎంపీలు వెంకయ్యను గజమాలతో సన్మానించారు. తెలుగు వ్యక్తి ఉపరాష్ట్రపతి కావడం సంతోషంగా ఉందని, తమ ఓట్లన్నీ వెంకయ్యకే వేస్తామని ఎంపీలు తెలిపారు. తనను కలిసిన ఎంపీలతో సుమారు గంటపాటు గడిపిన వెంకయ్య కొద్దిసేపు ఎన్నికల ప్రక్రియను వారికి వివరించారు.

ప్రచారం ముమ్మరం

వెంకయ్యనాయుడు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తనకు ఓటేయాలని ఎంపీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. బుధవారం తనకు మద్దతివ్వాలని అన్ని పార్టీల ఎంపీలకు వెంకయ్య లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రతీ రోజు పార్లమెంటు సెంట్రల్ హాల్‌కు వచ్చి ఎంపీలతో మాట్లాడుతున్నారు. కేవలం ఎన్డీయే మిత్రపక్ష పార్టీల ఎంపీలతోనే కాకుండా యూపీఏ, తటస్థ పార్టీల ఎంపీలను పలకరిస్తూ తనకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. కాగా, "అవకాశం ఉంటే నాకు ఓటేయండి" అంటూ యూపీఏలో ఉన్న తనకు సన్నిహితంగా ఉండే ఎంపీలతో వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు, ప్రతిపక్షాలు బలపర్చిన అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీ కూడా ప్రచారం చేస్తున్నారు. పార్టీల వారీగా ఎంపీలతో సమావేశమై తనకు ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు.

సందర్శక వీసాలతో వచ్చి ఉద్యోగాలు



- ఏజెంట్ల మోసం.. దుబాయ్‌లో భారతీయుల అవస్థలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన జింక గుర్నాథం, చిత్తూరు జిల్లాకు చెందిన హర్షిత ఓ ఏజెంట్ ద్వారా దుబాయ్‌లో అడుగుపెట్టారు. అక్కడ ఉద్యోగాల కోసం కాళ్లరిగేలా తిరిగారు. ఇద్దరిలో ఒకరు స్వదేశానికి వెళ్లిపోగా.. మరొకరు తిరిగి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరిని సందర్శకుల వీసాలతో ఏజెంటు ఇక్కడకు రప్పించడమే ఇందుకు కారణం. వీరి మాదిరే సందర్శకుల వీసాతో చాలామంది ఉద్యోగాల కోసం వస్తున్నారు. ఇలా మోసపోతున్న కేసుల్లో భారతీయులే ఎక్కువగా ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం కీలక ప్రకటన చేసింది. సందర్శకుల వీసా మాటున ఉద్యోగాల కోసం దుబాయ్‌కి రావొద్దని స్పష్టం చేసింది. ఉపాధి అవకాశాల తాలూకు పత్రాలు, పూర్తి వీసా అనుమతి పత్రాలతోనే రావాలని సూచించింది. ఇటీవల సందర్శకుల వీసాతో ఉద్యోగాల కోసం దుబాయ్‌కి వెళ్లి పట్టుబడుతున్న కేసులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. మోసాల గురించి తమకు అందుతున్న ఫిర్యాదుల్లో అధిక భాగం సందర్శక వీసాలపై వచ్చి ఉద్యోగాలు చేస్తున్నవారు, ఉద్యోగాల కోసం అన్వేషిస్తూ దగాపడుతున్న వారు ఉంటున్నారని భారత రాయబార కార్యాలయ అధికారి విపుల్ పేర్కొన్నారు. కొంత మంది మహిళలను కూడా సందర్శక వీసాలపై తీసుకొవచ్చి ఇళ్లలో పనులు చేయిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. యాజమానుల నుంచి బాధితుల అసలు పాస్ పోర్టులను తీసుకొని స్వదేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. సందర్శక వీసాలపై వచ్చి ఉద్యోగాలు చేయడం సరికాదని, ఇలా వచ్చిన వారెంత మంది అనే విషయంలో తమ వద్ద పూర్తి సమాచారం లేదని తెలిపారు. అనేక కేసుల్లో ఏజెంట్లు... విమానాశ్రయాల్లో ఫోర్జరీ ఉపాధి వీసా చూపించి, అ తర్వాత దుబాయ్‌లో దిగినప్పుడు సందర్శక వీసాను అభ్యర్థుల చేతికి అందిస్తున్నట్లుగా తమకు తెలిసిందని ఆయన చెప్పారు.

శ్రావణంలో గ్రీష్మతాపం!

- హిమలయాల చెంతకు రుతుపవనద్రోణి
- తెలుగు రాష్ట్రాలపై కమ్ముతున్న వర్షాభావం

విశాఖపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శ్రావణ, భాద్రపద మాసాలను కలిపి వర్ష రుతువుగా పిలుస్తారు. ముసురు వర్షాలుంటాయని శ్రావణంలో రైతుల ఇళ్లల్లో సాధారణంగా పెళ్లిళ్ల చేయరు. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. శ్రావణమాసంలో గ్రీష్మరుతువు కొనసాగుతోంది. మేఘాల జాడ కనుచూపుమేరలో లేదని వాతావరణ నిపుణుడు ఆర్.మురళీకృష్ణ చెప్పారు. అందుకు తగినట్టుగానే తెలుగు రాష్ట్రాలను వర్షాభావం వెంటాడుతున్నది. ఉదయం నుంచే ఎండలు అదరగొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. వర్షాలు లేకపోవడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంటలు ఎండుతున్నాయి. స్థానికంగా ఏర్పడిన క్యుములోనింబస్ మేఘాలతో అడపాదడపా వర్షాలు కురవడం తప్ప, రెండు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే పరిస్థితులు లేవు. సాధారణంగా ఈ సీజన్‌లో రుతుపవనాలు చురుగ్గా మారి, విస్తారంగా వర్షాలు కురవాలంటే రెండు అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. ఒకటి రుతు పవనద్రోణి, రెండోది అల్పపీడనం. గడచిన రెండు వారాల నుంచి ఉత్తరాదిలో తిష్టవేసిన రుతు పవనద్రోణి ఈ సీజన్‌లో తొలిసారి గురువారం హిమాలయాల చెంతకు వెళ్లింది. అంటే వర్షాలు కురిసే వాతావరణం యావత్తూ హిమాలయాల పరిసరాల్లోని రాష్ట్రాలకే పరిమితమయిందన్న మాట! దీంతో దేశంలో మిగిలినచోట్ల వర్షాలు గణనీయంగా తగ్గుతాయి. అయితే తమిళనాడు, దానికి ఆనుకొని రాయలసీమలో వర్షాలు పెరుగుతాయి. రుతుపవన ద్రోణి తిరిగి సాధారణస్థితికి చేరితే తప్ప దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు పెరిగే అవకాశంలేదని వాతావరణ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా ఈనెల రెండో వారం నుంచి తెలుగు రాష్ట్రాల్లో రుతుపవనాలు తిరిగి పుంజుకుంటాయని అటు వాతావరణ శాఖ, ఇటు ఇస్రో అంచనా వేస్తున్నాయి. ఈలోగా రుతుపవనద్రోణి దక్షిణాదివైపుగా రావడం, బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నెల తొలి పక్షంలో సాధారణం కంటే తక్కువగా, రెండో పక్షంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని విశ్లేషించారు. గత నెల రెండో పక్షం నుంచి వర్షాలు తగ్గడంతో రాయలసీమలో తీవ్ర వర్షాభావం నెలకొందని, కోస్తాలో సాధారణ వర్షపాతం నమోదైందని వాతావరణ అధికారి తెలిపారు. అయితే కోస్తాలో కూడా వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నందున రెండో వారం కల్లా సాధారణంకంటే తక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. కోస్తాలో విజయనగరంలో ఇప్పటికే లోటు వర్షపాతం నమోదైందని గుర్తు చేశారు. కాగా, రానున్న 24 గంటల్లో రెండు రాష్ట్రాల్లో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం ఉదయంతో ముగిసిన 24 గంటల్లో నెల్లిమర్లలో 12, పూసపాటిరేగలో ఆరు, పెద్దాపురం, ధవళేశ్వరం, తిరువూరులో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

తిరుమలలో రూ.1.7 కోట్ల భారీ ఎల్ఈడీ స్క్రీన్



టీటీడీకి విరాళమిచ్చిన యాక్ట్ సంస్థ

తిరుమల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఉత్సవాలు, సేవలను ఆలయం వద్ద వేచి ఉండే భక్తులు తిలకించేందుకు వీలుగా భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. రూ.1.7 కోట్ల విలువైన ఈ ఎల్ఈడీ స్క్రీన్‌ను హైదరాబాద్‌కు చెందిన యాక్ట్ (ఏసీటీ) సంస్థ టీటీడీకి విరాళంగా ఇచ్చింది. ఆలయం ఎదురుగా సహస్ర దీపాలంకరణ మండపం పక్కన ఏర్పాటు చేసిన దీనిని గురువారం రాత్రి ఈవో ఏకే సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు ప్రారంభించారు.



నంద్యాల ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న జగన్

చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పులేదు!

(మొదటి పేజీ తరువాయి)

గుణపాఠం చెప్పాలి. భగవద్గీత, ఖురాన్, బైబిల్ గ్రంథాలు ధర్మం, న్యాయం గొప్పదని చెబుతున్నాయి. చౌకబారు రాజకీయాలు తాత్కాలికంగా గెలిచినా అంతిమంగా సత్యమే గెలుస్తుంది. సీతమ్మను రావణాసురుడు ఎత్తుకెళ్తే రాక్షసుడు అన్నారు. దొంగతనం చేస్తే దొంగా అంటారు. మరి... 21మంది వైసీపీ ఎమ్మెల్యేలను ఎత్తుకెళ్లిన చంద్రబాబును ముఖ్యమంత్రి అనాలా, దొంగ అని అనాలా" అని ప్రశ్నించారు. నంద్యాల అభివృద్ధి అంటూ అబద్ధాలు, మోసపూరిత జీవోలు విడుదల చేస్తున్నారని విమర్శించారు. "నంద్యాల ఉపఎన్నిక ఏకగ్రీవానికి అంగీకరించి... పోటీ పెట్టకపోయి ఉంటే ఒక్క రూపాయి ఇచ్చేవారా? మూడున్నరేళ్లల్లో రూ.3.50 లక్షల కోట్లు దోచుకున్నారు. మోసపూరిత, అసమర్థత, అవినీతి పాలనలకు ఓటుతో గుణపాఠం చెప్పాలి" అని పిలుపు నిచ్చారు. "ఎన్నికలు వస్తేనే ముస్లింలు గుర్తుకు వస్తారు. హిందూపురంలో బావమరిది బాలకృష్ణ కోసం ఎమ్మెల్యే అబ్దుల్ గనికి అన్యాయం చేశారు. ఆనాడు వైఎస్ ముస్లింలకు 4%రిజర్వేషన్ ఇవ్వడంవల్ల లక్ష ఉద్యోగాలు వచ్చాయి. 2014లో చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి పెట్టిన తొలి పది సంతకాలకే దిక్కులేదు. కాపులను బీసీల్లో చేరుస్తామని చెప్పి.. అదే విషయాన్ని అడిగితే కేసులు పెడతారు" అని విమర్శించారు. 2019లో అధికారంలోకి వస్తామని, 'నవరత్నాల'తో పేదల సంక్షేమం కోసం పాటుపడతామని జగన్ భరోసా ఇచ్చారు. "నంద్యాలలో 13 వేల ఇళ్లు నిర్మించి పేదలకు ఉచితంగానే ఇస్తాం. రోడ్ల విస్తరణలో ఆస్తులు కోల్పోయిన బాధితులకు అండగా ఉంటాం" అని తెలిపారు.

సాయిబులు, శెట్టిగారు మావైపే!

- జగన్ చెప్పగానే రాజీనామా చేశా: శిల్పా చక్రపాణి రెడ్డి



రాజీనామా పత్రంపై సంతకం చేస్తున్న చక్రపాణి

నంద్యాల, ఆగస్టు 3: "శెట్టిగారు చాలా తెలివైన వారు. వాళ్లు మాకే ఓట్లు వేస్తారు. సాయిబులు ఎవరి వైపు ఉంటారో అందరికీ తెలుసు! ఎమ్మెల్సీ ఫరూక్‌కు చాలెంజ్ చేస్తున్నా! ఆయన ఎంపీగా పోటీ చేసినప్పుడు ముస్లింల ఓట్లు ఎవరికి ఎన్ని వచ్చాయో అందరికీ తెలుసు! వారి ఓట్లు కూడా మాకే" అని వైసీపీ తీర్థం పుచ్చుకున్న టీడీపీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. గురువారం నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. "అన్నా! వైసీపీ నైతిక విలువలు కలిగిన పార్టీ.. టీడీపీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిరా' అని జగన్ అనగానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని చెప్పారు. "శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి సవాల్.. దమ్ముంటే రాజీనామా చేసిరా తేల్చుకుందాం. ఇక ఏ ఆటకైనా రెడీ!ఆనాడు భూమా, బుడ్డా కావాలని జగనన్న దొంగలను చేర్చుకున్నారు. వారు నిలువునా ముంచారు" అని వ్యాఖ్యానించారు. పెద్దాయన వైఎస్ రాజశేఖర్ రెడ్డి తమను బాగా చూసుకున్నప్పటికీ... చిన్నాయన చూసుకోలేదని వేదికపైనే జగన్‌ను ఉద్దేశించి అన్నారు. ఇక... తాను టీడీపీలో ఉండగా నంద్యాల అభివృద్ధి, రోడ్ల విస్తరణకు నిధులు కావాలని అడిగితే సీఎం ఇవ్వలేదని వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి ఆరోపించారు. "అమ్మా నాన్నలు లేని అనాథలమని వచ్చి ఏడుస్తున్నారు. కానీ... భూమా నాగిరెడ్డి ఎందరినో అనాథలను చేశారు. వారికి ఏం సమాధానం చెబుతారు?" అంటూ మంత్రి అఖిలప్రియ, టీడీపీ అభ్యర్థి బ్రహ్మానంద రెడ్డిని శిల్పా ప్రశ్నించారు.

అవినీతికి ఓటేసినట్లే: రోజా

నంద్యాలలో అధికార పార్టీకి ఓటు వేస్తే చంద్రబాబు అవినీతికి, బెల్ట్ షాపులకు ఓటేసినట్లేనని ఎమ్మెల్యే రోజా అన్నారు. 'నంద్యాల దెబ్బ.. చంద్రబాబుకు అబ్బా' అనిపించాలంటూ సినిమా ఫక్కీలో పలు వ్యాఖ్యలు చేశారు. శిల్పా చక్రపాణిరెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరారని, ఆయనను చూసి పార్టీలు మారిన ఎమ్మెల్యేలు సిగ్గు తెచ్చుకోవాలని అన్నారు.

ఎమ్మెల్సీకి శిల్పా రాజీనామా.. మండలి కార్యదర్శికి ఈ-మెయిల్

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని బహిరంగ సభ వేదికపై శిల్పా చక్రపాణి రెడ్డి ప్రకటించారు. ఆ పత్రాన్ని జగన్‌కు అందించారు. ఆ తర్వాత దీనిని శాసనమండలి కార్యదర్శికి ఈ-మెయిల్‌లో పంపించారు. మరోవైపు... ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాకే పార్టీలో చేరాలని జగన్ తేల్చి చెప్పడంతో చక్రపాణి రెడ్డి తొలుత డైలమాలో పడినట్లు తెలిసింది. సన్నిహితులతో చర్చించిన అనంతరం... తప్పని పరిస్థితుల్లో రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

సీఎంనే కాల్చాలంటే.. ఇక ప్రజల పరిస్థితేంటి?

- తాత తండ్రుల నుంచి అదే వారసత్వం
- నంద్యాలలో పిచ్చెక్కి మాట్లాడారు
- నువ్వొచ్చి కూర్చున్నా గెలవలేరు
- చినరాజప్ప, అచ్చెన్నా, సోమిరెడ్డి ఫైర్
- రౌడీ మాటలవి: ఆదినారాయణరెడ్డి



అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపాలన్న వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై రాష్ట్ర మంత్రులు విరుచుకుపడ్డారు. భవిష్యత్తులో పొరపాటున ఆయన అధికారంలోకి వస్తే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తంచేశారు. జగన్ తాత, తండ్రులకు హింస అలవాటేనని.. అది ఆ కుటుంబ నైజమేనని ఉపముఖ్యమంత్రి చినరాజప్ప, మంత్రులు అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సీహెచ్ ఆదినారాయణరెడ్డి గురువారం రాత్రి సచివాలయంలో ధ్వజమెత్తారు. సాక్షాత్తూ సీఎంనే లక్ష్యంగా చేసుకున్నారంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటనేది ప్రజలే ఆలోచించాలన్నారు. 'మా నాయకుడు చంద్రబాబు పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నారు. ఆ సమయంలో జగన్ తండ్రి, ఇతరులు అవమానించినా ఎన్నడూ సహనం కోల్పోలేదు. ప్రజల్లో ఉంటూ ప్రజాస్వామ్యయుతంగా సీఎంగా ఎన్నికయ్యారు. కానీ నంద్యాల సభలో జగన్ పిచ్చెక్కి మాట్లాడారు. ప్రజలను భయపెట్టి అధికారంలోకి రావాలనే ఆయన నైజాన్ని చెబుతున్నాయి. ఇలాంటి వ్యక్తులను నంద్యాల ప్రజలు రోడ్లపై నడవనివ్వకూడదు. నంద్యాల పట్టణంలో ప్రభుత్వం 13వేల మందికి ఇళ్లు కట్టిస్తోంది. అందులో లోకేశ్ అవినీతికి పాల్పడి అధిక ధరకు కాంట్రాక్టులు అప్పగించారని అనడం దారుణం. బహిరంగ టెండర్లలో ఆరు సంస్థలు బిడ్లు వేశాయి. జగన్ తన తండ్రి వైఎస్ హయాంలో నంద్యాలలో పేదల ఇళ్ల కోసం కేటాయించిన 50 ఎకరాలను కమీషన్‌కు ఆశపడి ఒక ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు' అని అచ్చెన్నాయుడు విరుచుకుపడ్డారు. 'ఏపీలో కాకుండా ఎక్కడో ఉంటున్న జగన్...రాష్ట్రానికి ఎప్పుడొచ్చినా అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా వస్తున్నారు. రాజధానిని అడ్డుకోవడానికి వచ్చారు. పోలవరం, పట్టిసీమలను అడ్డుకోవడానికి వచ్చారు. విశాఖలో పెట్టుబడుల సదస్సును అడ్డుకోవడానికి వచ్చారు. ఇప్పుడు నంద్యాలలో అభివృద్ధిని అడ్డుకోవడానికి వచ్చారు. హింసను ప్రేరేపించాలని చూస్తున్నారు. అది ఆయన కుటుంబంలో మొదట్నుంచీ భాగమే. కుల హింసను కూడా ప్రేరేపిస్తున్నారు' అని చినరాజప్ప మండిపడ్డారు. సీఎంను నడిరోడ్డుపై కాల్చాలన్న వ్యాఖ్యలపై కేసు పెడతారా? అని ప్రశ్నించగా.. నంద్యాలలో ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నాయని, ఈసీనే ఆ వ్యవహారం చూసుకుంటుందన్నారు. అవినీతి కేసుల్లో నిందితుడా ధర్మ యుద్ధం గురించి మాట్లాడేదని జగన్‌పై సోమిరెడ్డి మండిపడ్డారు. ఆయనకు ఇంకా ఫ్యాక్షన్ లక్షణాలు పోలేదని.. ముఖ్యమంత్రిని కాల్చమనే ప్రతిపక్ష నేతను ఎక్కడా చూడలేదని విమర్శించారు. 23 తేదీన ఎన్నికల్లో బ్యాలెట్ల రూపంలో ఓటర్లు వైసీపీనే చంపుతారని, ఎమ్మెల్యే రోజా ముందు భాష మార్చుకోవాలని హితవు పలికారు.

జగన్ పత్రిక రోజూ తప్పుడు రాతలు రాస్తూ విషప్రచారం చేస్తోందని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయబోతున్నామని చెప్పారు. జగన్ వచ్చి నంద్యాల్లో కూర్చున్నా గెలవడం వైసీపీ తరం కాదన్నారు. చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చాలని జగన్ ఓ వీధి రౌడీలా మాట్లాడారని ఆదినారాయణరెడ్డి దుయ్యబట్టారు. తండ్రి వయసున్న చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చిచంపాలనడం దుర్మార్గమన్నారు. క్రూరుడు కూడా ఇలాంటి మాటలు మాట్లాడడని చెప్పారు. కాల్చడాలు.. చంపడాలు జగన్ ఇంటి సంప్రదాయమని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. 'చెన్నారెడ్డిని సీఎం పదవి నుంచి దించడానికి హైదరాబాద్‌లో మత కల్లోలాలు సృష్టించి వందల మందిని చంపించిన ఘనత ఆయన తండ్రిది. తాత, తండ్రి ఫ్యాక్షన్ రాజకీయాలతో కడప జిల్లాలో ఎందరిని పొట్టన పెట్టుకున్నారో అందరికీ తెలుసు. రోశయ్యను దించేయడానికి జగన్ ఎన్ని కుట్రలు చేశారో కూడా తెలుసు' అని అన్నారు.

జగన్‌వి అర్థంలేని మాటలు: ఫరూక్

'చంద్రబాబుకు ముస్లింలపై ఎంత ప్రేమ ఉందో ఫరూక్‌ను అడిగితే చెబుతారు. ఈ ఉప ఎన్నికలు వచ్చేదాకా ఫరూక్‌కు అప్పాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ పోటీ పెట్టగానే ఆయనను ఎమ్మెల్సీని చేశారు' అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను ఫరూక్ ఖండించారు. అవి అర్థంపర్థంలేని మాటలని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి 2014 వరకు తనకు టీడీపీలో అవకాశాలు దక్కుతున్నాయన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ తనకు మంత్రి పదవి దక్కిందన్నారు. ఈ మూడేళ్లలో తనకు పదవులు రాకుండా అడ్డుకున్నది శిల్పా సోదరులేనని చెప్పారు.

లోకం తీరు



6వ తరగతిలో 6 మార్కులు, 7వ తరగతిలో 7 మార్కులు వచ్చినప్పుడేమీ అనలేదు ఇప్పుడు కోప్పడితే ఎలా..

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అనంతపురం	23.5	35.4
హైదరాబాద్	23.8	33.5
శ్రీకాకుళం	26.0	34.0
గుంటూరు	26.0	36.0
నెల్లూరు	26.0	35.9
కడప	27.0	38.0
చిత్తూరు	27.3	36.7
విజయవాడ	27.4	35.5
విశాఖపట్నం	27.4	34.8



రుణ ఎగవేతదారులు టెర్రరిస్టుల కన్నా హీనం

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఎగవేసే వారు టెర్రరిస్టుల కంటే హీనం. వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టకూడదు. మొండి బకాయిల వసూలుపై గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు, రైతుల మొండి బకాయిల కన్నా కార్పొరేట్ కంపెనీల మొండి బకాయిలేఅత్యధికంగా ఉన్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని.. కావాలనే ఎగవేసే పెద్ద చేపల్ని ప్రభుత్వం పట్టుకోవాలి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- లోక్‌సభలో టీడీపీ ఎంపీ అవంతి శ్రీనివాస్

శ్రీవారికి తలనీలాల ఆదాయం 5.93కోట్లు

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారికి భక్తులు మొక్కులుగా సమర్పించిన తలనీలాల విక్రయాలతో రూ.5.93కోట్ల ఆదాయం సమకూరింది. ప్రతి నెలా మొదటి గురువారం టీటీడీ ఈ-వేలంలో తలనీలాలను విక్రయిస్తుంది. జేఈవో శ్రీనివాసరాజు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ-వేలంలో 7,100 కిలోల వెంట్రుకలు అమ్మడం ద్వారా పై మొత్తం లభించినట్లు అధికారులు ప్రకటించారు.



కీళ్లవాతం ఔషధంతో రక్తకేన్సర్‌కు చికిత్స

లండన్, ఆగస్టు 3: రక్తకేన్సర్‌తో బాధపడే రోగులకు కీళ్లవాతానికి ఉపయోగించే ఔషధంతో చికిత్స చేయొచ్చని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్ పరిశోధకులు తెలిపారు. కీళ్లనొప్పులు నివారించేందుకు వాడే మెథోట్రెక్సేట్(ఎమ్‌టీఎక్స్)పై ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా పాలీసైథేమియా వెరా(పీవీ) రక్త కేన్సర్‌కు చికిత్స అందించే ఆశాజనక ఫలితాలు వచ్చాయని వివరించారు. కాగా, అలర్జీ నివారణకు వాడే ఔషధాలతో కాళ్లలో రక్తం గడ్డకట్టడాన్ని సమర్థవంతంగా తగ్గించవచ్చని తాజా అధ్యయనం తేల్చింది. శస్త్రచికిత్స తర్వాత గానీ, లేక ఎక్కువ దూరం విమానాల్లో ప్రయాణించడం వల్ల వచ్చే డీప్ వీన్ థ్రాంబోసిస్(డీవీటీ) రాకుండా ఉండడానికి అలర్జీ మందులు బాగా పనిచేసినట్లు తాము ఎలుకలపై చేసిన పరిశోధనల్లో వెల్లడైందని యూకేకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్ పరిశోధకులు పేర్కొన్నారు.

సోలార్ కళ్లజోడు



బెర్లిన్: సౌరశక్తిని ఉత్పత్తి చేసే స్మార్ట్ సోలార్ కళ్లజోడును జర్మనీలోని కార్ల్‌స్రుహర్ ఇనిస్టిట్యూట్ ఫర్ టెక్నాలజీ(కిట్) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రంగురంగులతో, సగం పారదర్శకత, తేలికగా ఉండే ఆర్గానిక్ సోలార్ సెల్స్‌ను కలిగి ఉండే ఈ కళ్లజోడు కరెంట్‌ను ఉత్పత్తి చేసి వినికిడి పరికరాలు, స్టెప్ కౌంటర్లు పనిచేయడానికి ఉపయోగపడతాయట.



పోలవరం ప్రాజెక్టు వద్ద సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

వేగంగా పోలవరం పనులు!

- రాష్ట్ర ప్రజల కల నెరవేరుతోంది: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పోలవరం, ఆగస్టు 3: పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజల శతాబ్దాల కల నెరవేరనుందని హర్షం వ్యక్తం చేశారు. గురువారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని నారాయణ పరిశీలించారు. ప్రాజెక్టు ఎస్ఈ రమేశ్‌బాబు ఆయనకు ప్రాజెక్టు నమునా ద్వారా పనులు జరుగుతున్న తీరును వివరించారు. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రభుత్వం 2018కి పోలవరం పూర్తి చేయాలని చూస్తోందని, తాము మాత్రం ప్రజల బాగుకోసం వీలైనంత త్వరగా పూర్తికావాలని కోరుకుంటున్నామన్నారు. కేంద్రం, రాష్ట్రంలో పంచ మాఫియాల పాలన సాగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. మైనింగ్, భూమి, ఇసుక, మద్యం, డ్రగ్స్ మాఫియాలు ప్రభుత్వాలను శాసిస్తున్నాయని అన్నారు. ఈ మాఫియాల పాలనతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలవరం పటిష్టతపై అపోహలు వద్దు: జేపీ



పోలవరం పనులను పరిశీలిస్తున్న జేపీ

పోలవరం, ఆగస్టు 3: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పక్కాగా జరుగుతున్నాయని, ప్రాజెక్టు పటిష్ఠతపై ఎలాంటి అపోహలు అవసరం లేదని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు నమునా, వ్యూపాయింట్ నుంచి పూర్తి వివరాలను ప్రాజెక్టు ఎస్ఈ రమేష్‌బాబు వివరించారు. అనంతరం స్పిల్‌వే, డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతాలను జేపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలవరం నిర్మాణం వేగంగా జరుగుతోందని అన్నారు. కేవలం 9 నెలల్లో 70 శాతం మట్టి పని పూర్తి చేయడం దేశంలో గతంలో ఎక్కడా జరగలేదని అన్నారు. గ్రావెటీ ద్వారా నీరు ఇవ్వడానికి ఎగువ, దిగువ నిర్మించే కాఫర్ డ్యాంలను 45 మీటర్ల ఎత్తులో నిర్మించాలన్నారు. సమగ్ర జల రవాణా కోసం రాజకీయ సంకల్పం ముఖ్యమన్నారు. గతంలో పోలవరం నిర్మాణలో జాప్యం జరిగినా, ప్రస్తుతం పనులు వేగం పుంజుకోవడం సంతృప్తి కలిగిస్తోందన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే పోలవరం పనులను వేగవంతం చేసి ఉంటే, ప్రస్తుత ప్రాజెక్టు పూర్తయి ఉండేదని, పట్టిసీమ ఎత్తిపోతల అవసరమే ఉండేది కాదన్నారు.



తిరుమలలో పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి రోజు గురువారం ఉదయం సంపంగి ప్రాకారానికి ఉత్సవర్లు వేంచేయగా.. 7-9 గంటల మధ్య పవిత్ర హోమాన్ని వైదికులు ఆగమోక్తంగా నిర్వహించారు. 9-11 గంటల మధ్య ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుంగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం (స్నపన తిరుమంజనం) చేశారు. సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

పాదయాత్ర చేసి తీరతా!

- అనుమతి కోసం సీఎం కాళ్లు కడగాలా?
- అడ్డుకుంటే మరునాడే ప్రారంభిస్తా: ముద్రగడ
- పాదయాత్రను అడ్డుకొన్న పోలీసులు

కాకినాడ/కిర్లంపూడి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాపుల రిజర్వేషన్ కోసం చలో అమరావతి పాదయాత్ర చేసి తీరతానని కాపు నేత ముద్రగడ పద్మనాభం పునరుద్ఘాటించారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో గురువారం ఉదయం 9 గంటలకు ముద్రగడ తన ఇంటి నుంచి పాదయాత్రకు బయలుదేరారు. 'అనుమతి లేకుండా పాదయాత్ర ఎలా నిర్వహిస్తారు?' అంటూ గేటు వద్దే పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు. 2009 సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అనుమతిలేని పాదయాత్ర కుదరదంటూ ఓఎస్డీ రవిశంకరరెడ్డి నిబంధనల కాపీని ముద్రగడకు ఇవ్వడానికి ప్రయత్నించారు. ముద్రగడ వాటిని తీసుకొనేందుకు నిరాకరించారు. దీంతో వాటిని ఇంటి మెయిన్‌గేటుకు అతికించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర చేసి తీరుతానని ముద్రగడ స్పష్టం చేశారు. ప్రతి రోజూ బయటకు వచ్చి పాదయాత్ర మొదలుపెడతానని, పోలీసులు అడ్డచెబితే వెనక్కి వెళ్లి మళ్లీ మర్నాడు తిరిగి యాత్ర ప్రారంభిస్తానని ముద్రగడ తేల్చి చెప్పారు. 'రెండు నెలలు ముందుగానే సీఎంకు పాదయాత్ర రూట్ మ్యాప్ పంపించాను. అంతకన్నా ఏం చేయాలి. ఆయన కాళ్లు కడగాలా? సీఎం అనుచరులు కొందరు ముద్రగడ పాదయాత్ర చేయలేనని అంటున్నారు. ఒకసారి వదిలిచూడండి పాదయాత్ర చేస్తానో లేదో తెలుస్తుంది' అన్నారు.



పోలీసు అధికారులతో ముద్రగడ వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందసూర్య

బ్రాహ్మణుల చెంతకు సంక్షేమ పథకాలు

- చైర్మన్ వేమూరి ఆనందసూర్య

విజయవాడ(గొల్లపూడి), (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో బ్రాహ్మణుల చెంతకు సంక్షేమ పథకాలు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనందసూర్య తెలిపారు. గురువారం విజయవాడ గొల్లపూడిలోని బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయం లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క బ్రాహ్మణుడూ వినియోగించుకోవాలన్నారు. దేశంలోనే ప్రథమంగా బ్రాహ్మణుల సంక్షేమానికి కార్పొరేషన్‌ను స్థాపించి, రూ.210 కోట్ల నిధులు విడుదల చేసిన ఘనత.. ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని, బ్రాహ్మణులంతా ఆయనకు రుణపడి ఉంటారని తెలిపారు. సంక్షేమ పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అర్హులైన లబ్ధిదారుల ఖాతాలో నగదు చేరుతుందన్నారు. దీనికోసం జిల్లా నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు విస్తృత ప్రచారం చేస్తున్నారని, ఇప్పటి వరకు 18 వేలమంది సభ్యులుగా చేరారన్నారు. కొంత మంది పనిగట్టుకొని కార్పొరేషన్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, వాటిని పట్టించుకోనవసరం లేదని ఆనందసూర్య స్పష్టంచేశారు. ఇప్పటి వరకు పేద బ్రాహ్మణులకు రూ.90 కోట్లు అందించామన్నారు.

కాంగ్రెస్ విలవిల!

భారతీయ జనతాపార్టీకి అవకాశాలు తన్నుకొస్తుంటే, కాంగ్రెస్‌కు క్రమంగా చేజారిపోతున్నాయి. అష్టకష్టాల్లో ఉన్న కాంగ్రెస్ తనను చివరకు సుప్రీంకోర్టయినా ఆదుకోపోతుందా అని ఎంతగానో ఆశ పడింది. 'నోటా'కు న్యాయస్థానం నో చెబుతుందని ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ ఎదురుదెబ్బతిన్నది. బ్యాలెట్‌పేపరుమీద ఉన్న అభ్యర్థులెవరికీ ఓటేసేది లేదనే హక్కు ప్రత్యక్ష ఎన్నికల్లోనే తప్ప, రాజ్యసభ ఎన్నికల్లో ఉండదన్న ఆ పార్టీ వాదనను సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించడంతో ఎన్నికల సంఘం నిర్ణయమే అంతిమంగా నిలిచింది. 'నోటా' ప్రభావం గుజరాత్ రాజ్యసభ ఎన్నికలపైన, ప్రధానంగా అహ్మద్‌పటేల్ భవితవ్యంపైన తీవ్రంగా ఉండబోతున్నది. బీజేపీ తన్నుకుపోగా మిగిలిన ఎమ్మెల్యేలను కర్ణాటకలోని ఓ రిసార్టులో దాచుకుని, పటేల్ ఎన్నికకు ఇక ఢోకా లేదని ఊపిరిపీల్చుకున్న కాంగ్రెస్‌ను ఇలా వరుస సమస్యలు వెంటాడుతున్నాయి. బీజేపీ దాడినీ, దూకుడును తట్టుకోలేక అది విలవిల్లాడుతోంది.

అధికారిక లెక్కల ప్రకారం దేశంలో రెండవ ధనిక రాజకీయవేత్త అయిన కర్ణాటక కాంగ్రెస్ మంత్రి శివకుమార్‌పైన ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు సకాలంలో విరుచుకుపడి ఓ ఇరవైకోట్ల రూపాయల నగదూనగ్రా పట్టుకున్నారు. ఆయనకు సంబంధించిన ఇతరత్రా 40 ఆస్తిపాస్తులను గాలించారు. ఈగల్టన్ రిసార్టులో బసచేసివున్న గుజరాత్ ఎమ్మెల్యేల జోలికి అధికారులు పోనేలేదని జైట్లీతో సహా బీజేపీ పెద్దలంతా వాదిస్తుంటే, అధికారులతో పాటు పారామిలటరీ సిబ్బంది కూడా లోపల ఎలా కదం తొక్కారో తెలియచెప్పే వీడియోను ఒక ఎమ్మెల్యే పోస్టు చేశారు. బిల్లు ఎవరుకడుతున్నారో, ఎంత కట్టారో అడుగుతూ అందరినీ తిరిగి గుజరాత్ పంపేయమని కౌంటర్ దగ్గర అధికారులు వీరంగం వేశారంటూ కొందరు ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. అక్కడున్న ఎమ్మెల్యేలతో మాకేం పని, పైగా ఇదేమైనా కొత్త కేసా? అంటూ అధికారులు సమర్థించుకుంటున్నారు. రిసార్టుమీద దాడి ఎమ్మెల్యేలను బెదిరించడానికేనన్న కాంగ్రెస్ విమర్శలో వాస్తవం లేదన్నప్పుడు ఆ దాడి ఇప్పుడే ఎంచుకొని జరపాల్సిన అవసరం ఏమాత్రం లేదు. ఎదుటిపక్షం ఎమ్మెల్యేలను ఎత్తుకుపోకుండా మూకుమ్మడిగా ఒక రాష్ట్రంనుంచి మరొక రాష్ట్రానికి తరలించడం, రహస్యంగా దాచడం, వారిని ఎవరితోనూ మాట్లాడనివ్వకపోవడం, ఫోన్లు లాక్కోవడం వంటివే నిజానికి వెగటు కలిగించే చర్యలు. ప్రజాస్వామ్య వాసనలు ఏమాత్రం లేని ఈ పోకడలను ఇంతకాలమూ భరిస్తూ వచ్చిన ప్రజలకు, ఇప్పుడు దాచివుంచిన ఎమ్మెల్యేలున్న చోటకు ప్రభుత్వాధికారులే నేరుగా ఏదో పనిగట్టుకొని పోయిన దృశ్యం మరింత ఆశ్చర్యం కలిగిస్తున్నది. అధికార విపక్షాల ఈ వికృత క్రీడ ప్రజాస్వామ్య విలువలు ఎంతగా పతనమైపోయాయో తెలియచెబుతున్నది.

గుజరాత్‌లో కాంగ్రెస్‌కు 57 మంది ఎమ్మెల్యేలున్నందున నిజానికి సోనియా రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ విజయం నల్లేరుమీద నడక. కానీ, మోదీ బద్ధశత్రువు, విపక్ష కాంగ్రెస్ నాయకుడు శంకర్‌సిన్హ్ వాఘేలా ఈ ఎన్నికల ముందే పార్టీనుంచి బయటకు రావడం, ఆ తరువాత ఓ ఆరుగురు ఎమ్మెల్యేలు ఫిరాయించడం, మరో ఐదారుగురిని బీజేపీ అప్పటికే దారిలో పెట్టడంతో కాంగ్రెస్ విజయావకాశాలు ఒక్కసారిగా తారుమారైనాయి. అహ్మద్ పటేల్ ఓడిపోయిన పక్షంలో అది వ్యక్తిగతంగా సోనియాకు పెద్ద దెబ్బ. యావత్ కాంగ్రెస్ పార్టీని ఆమె మనసెరిగి నడిపిస్తున్న విశ్వాసపాత్రుడు ఆయన. అటువంటి వ్యక్తి ఓడిపోతే, తన మనిషినే గెలిపించుకోలేని దుస్థితిలోకి ఆమె జారిపోయిందన్న సందేశంతో పార్టీ అదుపు తప్పుతుంది. వాఘేలా దెబ్బకు ఓ ఇరవై మంది కాంగ్రెస్‌కు బై చెబుతారన్న భయం ఉన్న నేపథ్యంలో, రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేల ఓట్లు గంపగుత్తగా పడటం, అహ్మద్‌పటేల్ సునాయాసంగా నెగ్గడం అత్యంత ముఖ్యం. పటేల్ నెగ్గడమంటే సోనియా గెలవడమే. ఈ విజయం ప్రభావం ఈ ఏడాది చివర్లో గుజరాత్‌లో జరిగే శాసనసభ ఎన్నికలపై కచ్చితంగా ఉంటుంది. రిజర్వేషన్ వివాదంతో పాటీదార్లు, ఊనా ఘాతుకంతో దళితులు, జీఎస్టీతో వ్యాపారులు దూరమైపోయినందున శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం చాలా కష్టమని విశ్లేషకులు అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో మరింత ఊపిరి పోసుకున్న కాంగ్రెస్, ఈ నాలుగు నెలల కాలంలో పార్టీని యుద్ధానికి సిద్ధం చేసి బీజేపీని బలంగా ఢీకొట్టడానికి సిద్ధపడుతున్నది. ఇంతలోగా కాంగ్రెస్ జవసత్వాలు తీసేయాలంటే రాజ్యసభ ఎన్నికల్లోనే పెద్ద దెబ్బ పడాలన్నది బీజేపీ భావన. పటేల్ ఓటమి, అమిత్‌షా విజయంతో రాష్ట్రంలో తాను బలం పుంజుకొని, కాంగ్రెస్ ఉసురు తీసేయాలన్నది లక్ష్యం. ఇందుకు బీజేపీ కనీవినీ ఎరగని రీతిలో అడ్డదారులన్నీ తొక్కుతుంటే కాంగ్రెస్‌కు కాళ్ళూచేతులూ ఆడటం లేదు. పార్టీలను చీల్చడంలో, ఫిరాయింపులు ప్రోత్సహించడంలో కాంగ్రెస్‌కు సాటిలేదని ప్రజాస్వామ్యప్రియులు దానిని ఆడిపోసుకొనేవారు. మోదీ–షా ద్వయం రాకతో ఈ విషయంలో కాంగ్రెస్ వెలవెలబోతున్నది. కమలం ధాటికి కాంగ్రెస్ విలవిల్లాడుతోంది. దాని దుస్థితిపట్ల సానుభూతి కలిగినా, అది నీతిసూత్రాలు వల్లిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. గోవా, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, తమిళనాడు, ఇప్పుడు గుజరాత్‌లో బీజేపీ నెరపుతున్న రాజకీయాన్ని చూసినప్పుడు అధికారం కోసం అది సర్వవ్యవస్థలను భ్రష్టుపట్టించడానికీ, ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేయడానికీ ఏమాత్రం వెనకడుగువేయబోదని అర్థమవుతోంది. పంజరంలో చిలక అంటూ సీబీఐని గతంలో సుప్రీంకోర్టు ఘాటుగా విమర్శించింది. మోదీ పాలనలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, ఇన్‌కమ్ టాక్స్ ఇత్యాది సంస్థలనేకం దానికి తోడైనాయి. బీజేపీ వికృత క్రీడను రాజకీయంగా తీసిపారేయడం దేశానికీ, ప్రజాస్వామ్యానికీ ఏమాత్రం మంచిది కాదు. పౌర సమాజం నుంచి బలమైన ప్రతిఘటన లేనిదే దీనికి ముగింపు ఉండదు.

శాస్త్రవేత్తలకో దిక్సూచి

భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విద్యార్థుల్లో చైతన్యాన్ని రగిలించే ఉపన్యాసాలు చేసినపుడు ఉన్నతమైన కలలు కనండి, అందుకు మార్గం సుగమం చేసుకోండి, వాటిని వాస్తవ రూపం దాల్చేందుకు కృషి చేయండి అని చెప్పేవారు. దాంతో పాటు ఆయన చేసిన సూచన ఒక్కటే ప్రశ్నించండి... అనుమానం వచ్చిన అంశంపై ప్రశ్నించినపుడే మీకు గోప్యంగా ఉన్న అర్థంకాని అంశాలపై మీరు దృష్టిసారించేలా అదో మార్గదర్శనం అవుతుంది అని చెప్పేవారు. ప్రపంచంలో గొప్పవారిగా ఖ్యాతి గడించిన వారంతా చెప్పేది... 'ప్రశ్నించండి... అది మిమ్మల్ని పరిశోధనల వైపు మళ్లిస్తుంది' అని. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రస్తుత విద్యారంగం నీరుగారుస్తోంది. గొప్పవాళ్లయిన ప్రతి ఒక్కరూ తమ ఉపన్యాసాల్లో చెప్పే అంశం ప్రశ్నించడం.



సీసీఎంబీ వ్యవస్థాపక శాస్త్రవేత్త పుష్పమిత్ర భార్గవ కూడా అదే రీతిన ఎదిగిన వ్యక్తి. ఆయన శాస్త్రవేత్తలకే శాస్త్రవేత్త. అనేక సమస్యలకు పరిష్కారాలు సూచించిన సామాజిక వేత్త. విజ్ఞాన శాస్త్రాన్ని, సామాజిక శాస్త్రాన్ని, హేతువాద దృక్పథాన్ని మేళవించి మార్గదర్శకంగా నిలిచారు. మూఢనమ్మకాలను వ్యతిరేకించారు. ఎవరూ అశాస్త్రీయంగా అద్భుతాలు సృష్టించలేరని, ప్రతిదానికీ శాస్త్రీయ ఆధారం, పునాది అవసరమని పదే పదే చెప్పేవారు. నిరంతరం అధ్యయనం చేసేవారికి ఆయనో దిక్సూచి. మాలిక్యులర్ బయాలజీని ఈ దేశానికి అంకితం చేసి, జెనిటిక్ ఇంజనీరింగ్‌కూ జీవం పోసిన వ్యక్తి పి.ఎం. భార్గవ. ఆయన ఉద్యమాలు కొంత మందికి అర్థం కాకపోవచ్చు. కానీ దానికీ సకారణాలు ఎన్నో ఉన్నాయని తరచి చూస్తే అర్థం అవుతుంది. ఆయన చేసిన అలాంటి ఉద్యమాల్లో ఒకటి అద్దెగర్భాల హక్కు. సామాజిక సమస్యలు, విజ్ఞానశాస్త్ర సమస్యలపై ఆయన గొంతెత్తిన సైనికుడు.

■ చుక్కా రామయ్య

ప్రజాక్షేమం అవిభాజ్యం

■ రాజ్‌దీప్ సర్దేశాయి



దీపశిఖ

'నరేంద్ర మోదీ– అమిత్ షా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లను ఓడించి లౌకిక వాదాన్ని పరిరక్షించడానికై మేము సమైక్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని' లాలూ ప్రసాద్ యాదవ్ ప్రకటించారు. 2015 సెప్టెంబర్‌లో, బిహార్ శాసనసభా ఎన్నికలు సమీపించిన సందర్భంలో నాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని తన విలక్షణ శబ్దాడంబరంతో ఘోషించారు. 'మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న శక్తులను ఓడించడం మా ముందున్న అతి పెద్ద సవాల్' అని నితీశ్‌కుమార్ తీవ్రంగా వాదించారు. 2015 శరత్కాలంలో సమరరంగం సిద్ధమయింది. లౌకికవాద కోటను కాషాయ సేనల దండయాత్ర నుంచి పరిరక్షించడానికి లాలూ, నితీశ్‌లు సమైక్యంగా ప్రజల ముంగిటకు వెళ్ళారు.

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. గంగా నదిలో చాలా నీరు ప్రవహించింది. బిహార్‌లో రాజకీయం మారిపోయింది. కొత్త చాణక్యం అమల్లోకి వచ్చింది. పోరాడి సంరక్షించుకోవల్సిన ఆదర్శంగా లౌకికవాదం ఇంకెంత మాత్రం కన్పించడం లేదు. ఎందుకని? అవినీతిపై యుద్ధానికే ఇప్పుడు అందరూ ప్రాధాన్యమిస్తున్నారు. అవినీతిని ఇంకెంతమాత్రం సహించమని, ఆ దుష్టశక్తిని నిర్మూలించడంలో రాజీపడే ప్రసక్తేలేదని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ విస్పష్టంగా అన్నారు మరి.

ఒక అంతిమ పోరాటంలో ఉన్న వ్యతిరేక శక్తులుగా అవినీతి, మతతత్వంను ఇప్పుడు చిత్రీకరిస్తున్నారు. దీనికి సంబంధించిన రాజకీయ కథనాన్ని చాలా నైపుణ్యంతో అల్లారు. ఎంత నైపుణ్యంతో అంటే అవినీతిపై పోరు, మతతత్వం నిర్మూలనలో మీరు ఏదో ఒక దాన్ని మాత్రమే చాలా జాగ్రత్తగా ఎంచుకోవల్సి వుంటుంది. మీరు ఆ రెండు లక్ష్యాల పరిపూర్తికి అంకితమై, సుస్థిర రాజకీయ మనుగడతో వర్ధిల్లగలగడం ఇంకెంత మాత్రం సాధ్యంకాదు సుమా! ఈ క్రమంలో మన నేతల నైతిక దివాళాకోరుతనం నగ్నంగా బయట పడింది. శంకర్షన్ ఠాకూర్ (లాలూ, నితీశ్‌ల జీవితచరిత్రకారుడు) ఇటీవల ఒక వ్యాసంలో ఇలా వ్యాఖ్యానించారు: 'అవినీతిపై పోరు లేదా మతతత్వ నిర్మూలన అనేవి ఇంకెంత మాత్రం అంతరాత్మ ప్రేరణలు కావు, అవసరార్థ ప్రతిస్పందనలు'.

అవును, ఇప్పుడు 'లౌకికవాదం', 'అవినీతి వ్యతిరేకత' అనేవి ఆకర్షణీయమైన నినాదాలు. రాజకీయ కపటత్వానికి అందమైన ముసుగులు. ఉదాహరణకు నితీశ్‌కుమార్ వ్యవహారాన్నే చూద్దాం. మోదీ వ్యతిరేక 'మహాగట్‌బంధన్'లో భాగస్వామిగా ఉన్నప్పుడు 'లౌకికవాది' అయి, ఇప్పుడు మోదీతో చేతులు కలిపిన దృష్ట్యా 'మతతత్వ వాది' అవుతాడా? మోదీత్వ వ్యతిరేకత అనేది లౌకికవాదంను నిర్వచించే ఏకైక అంశమా? లేక, రాజ్యవ్యవస్థ అధిక సంఖ్యాకులకు మాత్రమే అధిక ప్రాధాన్యమిచ్చేదిగా వుండాలన్న వాదనకు మద్దతునిచ్చే వారితో ఎలాంటి రాజీకి అంగీకరించని బహుళత్వ దార్శనికతకు ప్రగాఢ నిబద్ధతా?

భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో నితీశ్‌కుమార్ 17 సంవత్సరాల పాటు ఒక ప్రధాన భాగస్వామిగా ఉన్నారు. వాజపేయి ప్రభుత్వంలో నితీశ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలోనే 2002 గుజరాత్ మారణకాండ సంభవించింది. అయితే ఆ దారుణాన్ని ఖండిస్తూ ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేదు! 2013 జూన్‌లో బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోదీని ఖరారు చేసినప్పుడు మాత్రమే ఆరెస్సెస్ హిందూత్వ భావజాలం నితీశ్‌కు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానిదయిందా?

'అవినీతి' కళంకితులయిన లాలూప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యుల పక్షాన తాను ఉన్నట్టు ప్రజలు అనుకోకూడదని నితీశ్ ఇప్పుడు భావిస్తున్నారా?



నిజంగా ఆయన అలా విశ్వసిస్తున్నట్లయితే ముందుగా తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, రాష్ట్ర శాసనసభను రద్దు చేయించి, బిహార్ ప్రజల తాజాతీర్పును కోరడం సముచితంగా వుంటుంది. అలా వ్యవహరించడం విలువలతో కూడిన రాజకీయమవుతుంది. తాను మతతత్వ వాదిని కానని, చట్టం ప్రకారం నడుచుకొనే పాలనాదక్షుడినని ప్రజలచేత అన్పించుకోవాలని నితీశ్ ప్రగాఢంగా కోరుకొంటున్నారు. మరి అటువంటప్పుడు బీజేపీ, రాష్ట్రీయ జనతాదళ్ రెండిటికీ దూరంగా వుంటూ తన సొంత రాజకీయవేదికతో ప్రజారంగంలో ఎందుకు పనిచేయకూడదు? ఒక నాయకుడుగా తన సొంత పరిమితుల గురించి ఆయన ఎట్టకేలకు తెలుసుకున్నారా? నైతిక నిష్ఠ వున్న నాయకుడుగా ప్రజల్లో నితీశ్‌కు గుర్తింపు వుండవచ్చు గానీ ఎన్నికలలో స్వతంత్రంగా పోటీచేసేందుకు అవసరమైన ప్రజా మద్దతు కొరవడిన నాయకుడు.

స్వీయ విశ్వాసాల కంటే పరిస్థితుల అనివార్యతకు ప్రాధాన్యమివ్వాల్సిన పరిస్థితి నాయకులకు ఎదురవుతుంటుంది. ఇప్పుడు నితీశ్ ఇటువంటి పరిస్థితిలో వున్నారు. ఆయనకొక్కరికే ఆ పరిస్థితి ఏర్పడలేదన్న వాస్తవాన్ని మనం గుర్తించాలి. ముంబై కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ నిరుపమ్ శివసేన ఎంపీగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1992–93లో, అయోధ్య ఘటన అనంతరం ముంబైలో అల్లర్లు, హింసాకాండను రెచ్చగొట్టిన శివసేన పత్రిక ఒకదానికి ఆయన ఎడిటర్‌గా కూడా వున్నారు. మరిప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న దృష్ట్యా సంజయ్ నిరుపమ్ నిఖార్సైన లౌకికవాద పరిరక్షకుడు అవుతారా? ఇక శంకర్ సింహ్ వాఘేలా విషయం చూద్దాం. ఆయన తన రాజకీయ జీవితంలో అత్యధిక భాగం సంఘ్ పరివార్ సభ్యుడుగా వున్నారు. ఆరెస్సెస్ సిద్ధాంతాలకు పూర్తిగా అంకితమైన కార్యకర్త. అయితే గత పదిహేనేళ్ళుగా గుజరాత్‌లో భారత జాతీయ కాంగ్రెస్ ముఖం వాఘేలా మహాశయుడే! ఇప్పుడు ఆయన కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి మోదీ మహాశక్తితో రాజీ పడిన దృష్ట్యా తన 'లౌకికవాది' గుర్తింపును కోల్పోయారా? విచారకరమైన విషయమేమిటంటే లౌకికవాదం మద్దతుదారులుగా పరిగణన పొందుతున్న వారందరూ తమ సంకుచిత రాజకీయాల కారణంగా నైతిక భ్రష్టులయ్యారు.

సరే, అవినీతిపై యుద్ధం కూడా ఇదే విధంగా బలహీనపడింది. రాజకీయంగా ఇబ్బందులు ఏర్పడతాయనుకున్నప్పుడు అవినీతిని ఉద్దేశపూర్వకంగా ఉపేక్షించడం వల్లే ఇటువంటి దుస్థితి ఏర్పడింది. 2015లో లాలూప్రసాద్ యాదవ్ పశుగ్రాసం కుంభకోణంలో దోషిగా నిర్ధారితుడైవున్నాడు. అయితే మోదీ వ్యతిరేక కూటమిలో ఒక ప్రధాన నాయకుడుగా ఉన్నాడు. ఎందుకంటే ఆయన వెనుక ఒక కీలక ఓటు బ్యాంకు వున్నది. మోదీపై విజయం సాధించడానికి ఆ ఓటు బ్యాంకు మద్దతు తప్పనిసరి. తత్కారణంగానే లాలూ 'జంగిల్‌రాజ్'ను ఉద్దేశపూర్వకంగా మరచిపోయారు. ఎందుకంటే లౌకిక విలువలు ప్రమాదంలో పడ్డాయి. ఆ ప్రమాదాన్ని అధిగమించాలంటే ఎన్నికలలో విధిగా విజయం సాధించవలసి వున్నది. మరి ఇప్పుడు ఆ లాలూ మహాశయుడిని నితీశ్ ఉన్న పాటున పక్కన పెట్టేశారు. మోదీ పక్షాన చేరారు. మరి నిన్నటివరకు మోదీని హిట్లర్ తరహా నియంత అని బిహార్ ముఖ్యమంత్రి, ఆయన మద్దతుదారులు అనునిత్యం విమర్శిస్తుండేవారు. ఇంతలో ఎంత మార్పు!

అవినీతి, మతతత్వం రెండిటినీ రాజీ లేకుండా, పక్షపాతరహితంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఆ హానికర శక్తులలో ఏ ఒక్కదాన్ని ఉపేక్షించినా ప్రజలకు నిజమైన శ్రేయస్సు సమకూరదు.

akbar

ఇక కాంగ్రెస్ 'యువరాజు' రాహుల్ గాంధీ విషయానికి వద్దాం. లాలూ ప్రసాద్‌ను అవినీతి కేసుల నుంచి గట్టెక్కించడానికై 2013 అక్టోబర్‌లో అప్పటి రెండవ యూపీఏ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది. కాంగ్రెస్ 'యువరాజు' గారు ఆ ఆర్డినెన్స్‌ను తిరస్కరించారు. మరి రెండేళ్ళు తిరగక ముందే లాలూ మహాశయుడితో రాహుల్ పొత్తు కుదుర్చుకున్నారు! రాజకీయ నైతికతా కారణాలతో ఒకసారి తిరస్కరించిన వ్యక్తితో, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పొత్తుపెట్టుకోవడం ఎలా సమర్థనీయం?

ఇటువంటి రాజకీయ కాపట్యానికి ఏ ఒక్క పార్టీ కూడా మినహాయింపు కాదు. రాజకీయ అవినీతికి అంతిమ చిహ్నంగా లాలూను లక్ష్యంగా చేసుకొంటోన్న బీజేపీ, కర్ణాటకలో అవినీతిపరులైన రెడ్డి సోదరుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఎలా నడిపింది? ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన వారితో ఎలా రాజీ పడింది? ఆ ఫిరాయింపుదారులు కాంగ్రెస్ పక్షాన ఉన్నప్పుడు అంతు లేని అవినీతిపరులని శాసనసభలోను, వెలుపల వారిపై బీజేపీ నాయకులు ఎడతెగని విమర్శలు చేయలేదా? బీజేపీ రాజకీయ ప్రత్యర్థులపై కేసుల దర్యాప్తు వేగవంతంగా జరుగుతుండగా బీజేపీ పాలిత మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో భారీ కుంభకోణాలపై దర్యాప్తు నత్తనడక ఎలా నడుస్తోంది? ఈ వైరుధ్యాలను ఎలా అర్థం చేసుకోవాలి?

నిజమేమిటంటే అవినీతి, మతతత్వం రెండిటినీ రాజీలేకుండా, పక్షపాతరహితంగా ప్రతిఘటించవలసిన అవసరం ఎంతైనా వున్నది. ఆ రెండిటిలో ఒక దానికి ప్రాధాన్యమిచ్చి రెండోదాన్ని ఉపేక్షించిన పక్షంలో విపత్కర పరిస్థితులేర్పడుతాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి యోగి ఆదిత్యనాథ్ ఎంపికే ఇందుకొక నిదర్శనంగా చెప్పక తప్పదు. మత విద్వేషాన్ని నిస్సిగ్గుగా రెచ్చగొట్టిన చరిత్ర వున్న నాయకుడు యోగి ఆదిత్యనాథ్. అటువంటి నేత రాష్ట్రంలో నేరాలను అవినీతిని, సంపూర్ణంగా నిర్మూలిస్తానని హామీ ఇస్తే విశ్వసించడమేనా? తనను తాను అవినీతికి వ్యతిరేకంగా పోరాడే యోధుడినని ప్రకటించుకోగానే అభ్యంతరకరమైన అతని గతాన్ని మరచిపోవడమేమిటి?

తాజా కలం: గత వారం బీజేపీ ఇంటర్నెట్ సైనికులు, నితీశ్ మద్దతుదారులు గత నాలుగేళ్ళుగా సామాజిక మాధ్యమాలలో పరస్పరం చేసుకున్న వ్యాఖ్యలను తొలగించడంలో నిమగ్నమైపోయారు. ఆ వ్యాఖ్యలను తీసివేయడం కంటే పరస్పర విమర్శలకు విరామం పాటించడం మంచిదని నేను సూచించదలిచాను. ఎందుకంటే రాజకీయ పవనాలలో తదుపరి మార్పు ఎప్పుడు సంభవిస్తుందో ఎవరికి తెలుసు?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

అరుదైన ఆదర్శ నేత

ఆయన గాంధీతత్వాన్ని దోసిళ్ళకొద్దీ తనివితీరా తాగి, ఆ ఆదర్శాలను జీవితాంతం పాటించిన మహావ్యక్తి. రాజకీయాల్లోకి అడుగిడిన చిరుప్రాయంలోనే పూలదండల సంప్రదాయాన్ని త్యజించిన నిరాడంబర నాయకుడు. సామాన్య ప్రజలతో మమేకమై, ఆర్టీసీ బస్సులలో ప్రయాణించిన మంత్రివర్యుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా త్యజించ పూనుకున్న కర్మయోగి. అనాథలు, దీనుల ఆత్మబంధువు. ప్రపంచ తెలుగు మహాసభల స్రష్ట, ద్రష్ట. ఉప్పెన తుఫాను తాకిడిలో సర్వం కోల్పోయిన అభాగ్యులకు అండగా నిలిచి చిరస్మరణీయుడుగా మిగిలిపోయిన సేవాతత్పరుడు. కవులు, పండితులు, కళాకారులను సమాదరించడంలో శ్రీకృష్ణదేవరాయలను తలపించిన తెలుగు భాషాసంస్కృతుల అభిమాని. ఆయనే రెండు దశాబ్దాల క్రిందటి వరకు మన మధ్య నడయాడిన మహామనీషి మండలి వెంకట కృష్ణారావు. ఈరోజు ఆయన జయంతి సందర్భంగా, ఆయనను స్మరించుకోవడం ప్రతి తెలుగువాడి కనీస కర్తవ్యం.

మండలి వెంకట కృష్ణారావు గారు స్వాతంత్ర్యానంతర రాజకీయాలలో కృష్ణాజిల్లాను భూమికగా చేసుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్నంతటినీ ప్రభావితం చేసిన మహావ్యక్తి. కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, జిల్లాలో ఏమాత్రం బలంలేని కాంగ్రెస్ పార్టీని 1956 ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలిపించడమే కాకుండా, అతి చిన్న ప్రాయంలోనే లోక్‌సభ సభ్యులుగా ఎన్నికై, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, అనంతశయనం అయ్యంగార్ వంటి మహామహుల సహచర్యాన్ని పొందారు.



ఆస్తుల వివరాలు ప్రకటించాలని ఉన్న నిబంధనను రాజకీయ నాయకులెవ్వరూ పాటించకపోయినా, దేశంలో ప్రప్రథమంగా తన ఆస్తుల వివరాలను ప్రకటించిన రాజకీయవేత్త మండలి వెంకట కృష్ణారావు. ఆయన నిస్వార్థ, నిష్కళంక, నిరాడంబర రాజకీయ జీవితం ఈనాటి రాజకీయ నేతలందరికీ ఆదర్శప్రాయమైనది.

అవనిగడ్డ సమితి అధ్యక్షులుగా, కృష్ణాజిల్లా పరిషత్ ఉపాధ్యక్షులుగా అవనిగడ్డ సమితిలో మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు వేయించి ప్రజల సౌకర్యాలను మెరుగుపరిచారు. ముఖ్యమంత్రిగా పి.వి. నరసింహారావు బాధ్యతలు చేపట్టి, ఏ మంత్రి పదవి కావాలని కోరగా, ఎవరూ కోరని సాంఘిక సంక్షేమ శాఖను ఏరికోరి చేపట్టి, సాంఘిక సంక్షేమంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. రాష్ట్రంలోని అన్ని హైస్కూళ్లలో విద్యార్థి వసతిగృహాలను ఏర్పరిచారు. మత్స్యకారుల జీవనపరిస్థితులను మెరుగుపరచడానికి అనేక చర్యలను చేపట్టారు. ముంబాయి వెళ్ళి మహారాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలు అధ్యయనంచేసి, రాష్ట్రంలోని మత్స్యకారులకు ఉచితంగా వలలు, రాయితీ ధరకు డీజిల్ ఇప్పించే ఏర్పాటు చేశారు.

1970–71లో ఉవ్వెత్తున ఎగసిపడిన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమానికి ఎదురొడ్డి నిలిచి, తన రాజకీయ జీవితాన్ని పణంగాపెట్టిన సమైక్యవాది మండలి వెంకట కృష్ణారావు గారు. ఉద్యమ తీవ్రత తగ్గిన తరువాత, జలగం వెంగళరావుగారి మంత్రివర్గంలో విద్యా, సాంస్కృతిక మంత్రిగా పనిచేసి 1974 ఉగాది నుంచి వారం రోజుల పాటు అఖిల భారత సాంస్కృతికోత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలు ప్రత్యేకోద్యమాల మూలంగా గాయపడిన తెలుగువారి మనసులకు సాంత్వన చేకూర్చడానికి ఉపకరించాయి. ఈ ఉత్సవాలకు వచ్చిన స్పందన చూసి 1975, ఏప్రిల్ 12 ఉగాది నుంచి ఏప్రిల్ 18 వరకు వారం రోజుల పాటు హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో ప్రపంచ తెలుగు మహాసభలను ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలలో రాష్ట్రంలోని, దేశంలోని ప్రముఖ వ్యక్తులు, కవులు, కళాకారులు మాత్రమే కాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహాసభల మూలంగా తెలుగువారిలో భావ సమైక్యత వెల్లువెత్తింది. ఈ ఉత్సాహాన్ని కొనసాగించడానికి, ఇతర రాష్ట్రాలలోను, ఇతర దేశాలలోను నివసిస్తున్న తెలుగువారి విద్యా, సాంస్కృతిక అవసరాలను తీర్చడానికి అంతర్జాతీయ తెలుగు సంస్థను ఏర్పాటు చేశారు. తరతరాల తెలుగుజాతి మ్యూజియం భవన నిర్మాణానికి అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ చేతుల మీదుగా 13.9.1975న హైదరాబాద్, పబ్లిక్ గార్డెన్స్‌లో శంకుస్థాపన చేయించారు. ప్రవాసాంధ్రుల ఆత్మబంధువుగా దేశ విదేశాల తెలుగు ప్రజల మన్ననలు పొందారు.

1977, నవంబరు 19వ తేదీన దివిసీమపై కనీ, వినీ ఎరుగని రీతిలో విరుచుకుపడిన తుఫాను, ఉప్పెన తాకిడికి పదివేల మంది మరణించారు. లక్షలాది పశువులు అశువులు బాసాయి. ఊళ్లకు ఊళ్లు నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకు పోయాయి. ఈ పరిస్థితి చూసి గుండెలవిసి ఆవేదనకు గురైన కృష్ణారావుగారు తమ పూర్తి సమయాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించేందుకు వీలుగా మంత్రి పదవికి చేసిన రాజీనామాను ముఖ్యమంత్రి వెంగళరావుగారు తిరస్కరించి, సహాయ పునరావాస శాఖను కూడా ఆయనకే అప్పగించారు. ఈ సందర్భంగా కృష్ణారావుగారు చేసిన సేవ చిరస్మరణీయమైనది. జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థలను ఏకత్రాటిపైకి తెచ్చి, అభివృద్ధి కార్యక్రమాలను వెల్లువలా చేపట్టి ఆ ప్రాంత రూపురేఖలను మార్చివేశారు. దివిసీమ తుఫాను, ఉప్పెన సందర్భంలో మండలి వెంకట కృష్ణారావుగారు నిర్వహించిన సేవా కార్యక్రమాలు, సహాయ పునరావాస కార్యక్రమాలకే ఒక కొలబద్దగా చిరస్మరణీయంగా చరిత్రలో నిలిచిపోయాయి.

స్వాతంత్ర్య సమరయోధుడుగా ప్రభుత్వం తనకిచ్చిన అయిదెకరాల పొలాన్ని పదిమంది నిరుపేద దళితులకు ఒక్కొక్కరికి అర ఎకరం చొప్పున పంచి ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఈ పొలం తీసుకున్న కారణంగా, రెండు ప్రయోజనాలు పొందరాదనే నియమంతో స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్‌కు ఆయన దరఖాస్తు చేసుకోలేదు. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యేగా ప్రభుత్వం ఇచ్చిన వసతిని పొందుతున్న కారణంతో బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వం కేటాయించిన 500 చదరపు గజాల ఇంటి స్థలాన్ని తీసుకోవడానికి నిరాకరించారు. ఇదే కారణంతో మొహంజాహి మార్కెట్ ఎదురుగా ఏపీ హౌసింగ్ బోర్డు కేటాయించిన ఫ్లాటును కూడా వదులుకున్నారు. హైదరాబాద్‌లో కనీసం గృహవసతి లేని మాజీమంత్రి ఈయన ఒకరేనేమో!

ఆస్తుల వివరాలు ప్రకటించాలని ఉన్న నిబంధనను రాజకీయ నాయకులెవ్వరూ పాటించకపోయినా, దేశంలో ప్రప్రథమంగా తన ఆస్తుల వివరాలను ప్రకటించిన రాజకీయవేత్త కూడా మండలి వెంకట కృష్ణారావుగారే.

వెంకట కృష్ణారావు నిస్వార్థ, నిష్కళంక, నిరాడంబర రాజకీయ జీవితం ఈనాటి రాజకీయనేతలందరికీ ఆదర్శప్రాయమైనది.

■ డాక్టర్ గంధం సుబ్బారావు

(నేడు మండలి వెంకట కృష్ణారావు జయంతి)

ఉద్యోగాదాయంపై పన్ను ఎందుకు?

ఆదాయం పన్ను నిర్వచనం చాలా విచిత్రమైంది. స్పష్టంకానిది, సందిగ్ధమైందీనూ. ఏది ఏమైనా శ్రమనే పెట్టుబడిగా పెట్టి జీతం రాళ్లు సంపాదించుకునేవాళ్లు ఈ ఆదాయం పన్ను కోరల్లోంచి మన దేశంలో బయటపడలేకపోతున్నారు. మార్చి నెల వచ్చిందంటే చాలు అప్పు చేసైనా ఆదాయం పన్ను చెల్లించే ఉద్యోగులు మన దేశంలో కోకొల్లలు. నిజానికి ఆదాయం పన్ను కట్టే వర్గాల్లో అతి నిజాయితీపరులు ఉద్యోగులే. జీతం సంపాదించే ఉద్యోగుల జుట్టు



జీతాలు చెల్లించేవారి చేతుల్లోనే ఉంటుంది కనుక అష్టకష్టాలు పడి ఉద్యోగులు ఈ పన్ను కడతారు.

ఐదేళ్ల క్రితం వరకు ఆదాయం పన్ను లెక్కలు ఒక చిదంబర రహస్యం. అయిదేళ్ళ నుంచి ఇష్టమైనప్పుడల్లా కేంద్ర ఆదాయం పన్ను విభాగం పన్నుల గణాంకాలు ప్రచురిస్తున్నది. వాటిలోను కొన్ని లొసుగులు లేకపోలేదు. కానీ, 2014–15 సంవత్సరానికి 2016 అక్టోబరుల్లో ప్రచురించిన లెక్కలు చూస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అసలు పన్ను కడితే ఎంత! కట్టకపోతే ఎంత అన్నది తెలుతుంది.

దేశంలో ఆదాయం పన్ను రిటర్ను దాఖలు చేసిన వారు సుమారుగా 3.91 కోట్లమంది. వారిలో వ్యక్తులు 3.65 కోట్లు కాగా, హిందూ అవిభాజ్య కుటుంబాలు 9.40 లక్షలు, వ్యాపార సంస్థలు 9.18 లక్షలు, కంపెనీలు 7.01 లక్షలు. కానీ నిజానికి కనీసం ఓ రూపాయి అయినా పన్నుకట్టని వారు ఇందులో 2.21 కోట్లు. చివరకు పన్ను కట్టిన వారు కేవలం 99.07 లక్షలే. అంటే దేశ జనాభాలో ఒక శాతం కన్నా తక్కువ అన్నమాట. వీరందరి ఆదాయం 26,93,032 కోట్లు రూపాయలు. దీని మీద కట్టిన పన్ను 4,46,719 రూపాయలు. వ్యక్తిగత పన్ను కట్టిన వారిలో చిన్నా చితక వ్యాపారులు, స్వయం ఉపాధి ద్వారా ఆదాయం సంపాదించే వారిని మినహాయిస్తే కేవలం ఉద్యోగం ద్వారా, జీతభత్యాల ద్వారా వచ్చిన ఆదాయం మీద కట్టిన పన్ను అరవై వేల కోట్ల రూపాయలు దాటలేదు.

పన్ను కట్టక పోవడం మహా పాపమన్నట్టూ, కట్టని వారికి పంచ మహాపాతకాలు చుట్టు కుంటాయన్నట్టు, లేకపోతే పట్టుకు జైల్లో పారేస్తామని బెదరింపు ప్రకటనలు ప్రచురించి ఆదాయం పన్ను శాఖ జనానికి నిద్ర కరవు చేసి, ఉద్యోగుల నుంచి మాత్రం ముక్కు పిండి వసూలు చేసేది మాత్రం మొత్తం పన్ను వసూళ్ళలో కేవలం 11 నుంచి 12 శాతం దాటదు.

అదే 2014–15 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో పన్నుల రూపేణా వసూళ్లు చూద్దాం. ఆదాయం పన్నుతో పాటు అనేక ఇతర రకాల పన్నుల ద్వారా వసూలైంది 9.08 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో ఉద్యోగుల నుంచి సేకరించింది కేవలం ఆరు శాతానికి మించదు. ఏనుగు పంటి కింద జిలకర పోచ అన్న సామెత ఇక్కడ వర్తిస్తుందేమో. కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం, మంత్రులూ వగైరా వసూలు చేయాల్సిన అవసరం ఉండదు. ఉద్యోగుల నుంచి పన్ను వసూలు చేయకుండా మనలేమా అన్న ప్రశ్నకు మన ప్రపంచం నుంచే జవాబులు దొరుకుతాయి. మన చుట్టూనే దాఖలాలున్నాయి.

ఉద్యోగులు శారీరక, మానసిన శ్రమలనే పెట్టుబడిగా పెట్టి జీతాలు సంపాదిస్తారు తప్ప, డబ్బులు పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించరన్న నిర్వచనంతోనైనా ఉద్యోగులను ఆదాయం పన్ను నుంచి మినహాయించవచ్చు. దేశం ఖర్చుల్లో ఆరు శాతం తగ్గితే పెద్దగా వచ్చేదీలేదూ, పోయేదీ లేదు. పైపెచ్చు ప్రస్తుత పరిపాలనా విధానాలను ప్రక్షాళనం చేసి దుబారా తగ్గిస్తే ఈ ఉద్యోగాదాయ పన్ను అవసరం అసలే ఉండదు.

వ్యక్తిగత పన్ను అసలే లేని దేశాల్లో బహమాస్, బహ్రెయిన్, బెర్ముడా, బ్రుయోనీ, కేమాన్ ఐలాండ్స్, కువైటు, ఖతార్, ఓమన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లాంటి దేశాలున్నాయి. బోస్నియా, బల్గేరియా, కజికిస్థాన్, కొసావో, లిబియా, మెసెడోనియా, మంగోలియా, గాటెమోలా వంటి దేశాలు ఏడు నుంచి పది శాతం వ్యక్తిగత పన్నులు వసూలు చేసి మన కన్నా ఓ మోస్తరుగానే పరిపాలన సాగిస్తూ ప్రజావసరాలు తీరుస్తున్నాయి.

మన దేశంలో ఆదాయం పన్ను కట్టేవారందరూ ఇష్టపూర్వకంగా కట్టరు. కష్టపడి సంపాదించుకున్న ఆదాయం మీద పన్నెందుకన్నది వారి వాదనయితే, పన్నుల్లేకుండా ప్రభుత్వం ఎలా నడుస్తుందని కొందరి వాదన. కానీ, ఉద్యోగాలు చేసే మధ్యతరగతి వారు పన్నులు కట్టుకున్నా ప్రభుత్వాన్ని నడిపించవచ్చని లెక్కలు చెబుతున్నాయి. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన గత బడ్జెట్ ఉపన్యాసం వింటే విషయం ఇంకా స్పష్టమవుతుంది.

ఇంత పెద్ద దేశంలో కేవలం 42,800 మంది మాత్రమే తమ ఆదాయం సంవత్సరానికి కోటి రూపాయలకు పైగా ఉంటుందని ప్రకటించారట. వారంతా ఉద్యోగులు కారు కేవలం నాలుగు లక్షల మంది ఆదాయం సంవత్సరానికి ఇరవై లక్షల రూపాయలు దాటదు. ఇలా పన్ను కట్టే వారిలో వీరి శాతం ఒకటికి మించదు. ఈ లెక్కన ఎక్కడైతే జీతం ఇస్తూనే పన్ను కోసుకునే వీలుందో వారి వద్ద నుంచే పన్ను వసూళ్ళు వీలవుతుందని ఆర్థిక మంత్రి చెప్పకనే చెప్పారు.

ఉద్యోగులు కట్టే పన్ను చాలా తక్కువే కాబట్టి, అంటే మొత్తం దేశం బడ్జెట్ రెవెన్యూలో ఆరు శాతానికి మించట్లేదు. కాబట్టి అది కట్టినా ఒకటే కట్టకున్నా ఒకటే. ఈ విషయాన్ని మన ప్రభుత్వం వీలయినంత తొందరగా గ్రహించాలి. అంతే కాకుండా, ఆదాయం పన్ను రిటర్నులు దాఖలు చేసేవారిలో, 2.21 కోట్ల మంది నుంచి 'సున్నా' పన్ను వస్తున్నందువల్ల, ఆ రిటర్నులు సేకరించడం, భద్రపరచడం, నోటీసులివ్వడం లాంటి వాటి కయ్యే దుబారా ఖర్చులు తగ్గించుకోవచ్చు. జీతభత్యాల మీద పన్నుర్ఘు పూర్తిగా తీసేస్తే, టాక్సు అధికారులూ, కార్యాలయాలూ, ఇతరత్రా, దుబారా ఖర్చులు తగ్గడమే కాకుండా 'టాక్సు లీకేజీ'లు అంటే ఎక్కడ నుంచో వచ్చే పన్ను పక్కదారి పడుతుందో దాన్ని సరైన దారిలో పెట్టవచ్చు. .

ఆర్థిక వేత్తలూ, ప్రభుత్వం ఉద్యోగ సంఘాలూ గ్రహించాల్సిన ఇంకో విషయం 'డబుల్ టాక్సు'. మన దేశంలో ఉద్యోగులు మాత్రమే రెండుసార్లు పన్ను కడుతున్నారు. మిగతా వాళ్ల దాదాపు కట్టరు. ఉద్యోగులు ఆదాయం సంపాదించనప్పుడూ కడతారు, మిగిలిన ఆదాయాన్ని ఖర్చు చేసినప్పుడూ కడతారు. దీనివల్ల ఉద్యోగుల జీతాలు పెరిగినా వెంటనే వచ్చే జవాబు 'ఏం లాభం పన్ను కట్టాలి' అనేది. ఈ ఒక్క నిస్పృహ చాలు పన్ను సంస్కరణలు చేపట్టడానికి.

ఇవేకాక ఉద్యోగుల మీద పన్ను విధించడంలో మరో కోణం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులయితే, అదీ 2004కు ముందు ప్రభుత్వంలో చేరిన వారయితే, పదవీ విరమణ తర్వాత వారి ఉద్యోగ కాలాన్ని బట్టి దాదాపు సగం జీతం పింఛనుగా రావచ్చు. కానీ ప్రైవేటు ఉద్యోగులకు ఆ అవకాశంలేదు. పని చేసినన్నాళ్లు లక్షల ఆదాయం పన్ను కట్టినా, పదవీ విరమణ తర్వాత పైసా రాదు.

ప్రావిడెంటు ఫండు చట్టం కింద ఉద్యోగులు పింఛను పథకంలో చేరినా 30 ఏళ్ల సర్వీసుంటే మూడున్నర వేలకు పింఛనుకు దాటదు. ఉద్యోగంలో ఉన్నంత కాలం వచ్చే జీతం రాళ్ళలో ఖర్చులు తగ్గించుకుని, అప్పులు చేసే ఆదాయం పన్న కట్టినా, పదవీ విరమణ తరువాత అదే అదాయం పన్ను శాఖ పైసా పించను ఇవ్వదు. పై పెచ్చు పింఛనర్ల దగ్గర నుంచి కూడా జబర్దస్తీగా పన్ను వసూలు చేస్తోంది.

ఉద్యోగులు శారీరక, మానసిక శ్రమలనే పెట్టుబడిగా పెట్టి జీతాలు సంపాదిస్తారే తప్ప, డబ్బులు పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించరన్న నిర్వచనంతోనైనా ఉద్యోగులను ఆదాయం పన్ను నుంచి మినహాయించవచ్చు. దేశం ఖర్చుల్లో ఆరు శాతం తగ్గితే పెద్దగా నష్టం వచ్చేదీ లేదూ, పోయేదీ లేదు. పైపెచ్చు ప్రస్తుత పరిపాలనా విధానాలను ప్రక్షాళనం చేసి దుబారా తగ్గిస్తే ఈ ఉద్యోగాదాయ పన్ను అవసరం అసలే ఉండదు.

■ డాక్టర్ పి. మాధవరావు

ఐక్యరాజ్య సమితి మాజీ సీనియర్ సలహాదారు



కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన సీఎస్ దినేష్ కుమార్, మంత్రులు

పేదకు నజరానా

(మొదటి పేజీ తరువాయి)

మరింత లబ్ధి చేకూరుతుంది. ఎలాంటి అభ్యంతరాలు లేని ఆక్రమణలనే క్రమబద్ధీకరించాలని కేబినెట్ నిర్ణయించింది.

ప్రత్యామ్నాయానికి ప్రోత్సాహం

వర్షాభావ ప్రాంతాల్లో పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతులకు పలు ప్రోత్సాహకాలను ప్రకటించారు. తేలికపాటి భూముల్లో పత్తికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకొనే రైతులకు రూ.53.5 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని మంత్రి మండలి నిర్ణయించింది. ప్రత్యామ్నాయ పంట వేస్తే 75 శాతం రాయితీపై విత్తనాలు ఇస్తారు. కలుపు తీయటానికి హెక్టారుకు రూ.500 రాయితీ ఇస్తారు. పంటలను రక్షించుకునేందుకు సస్యరక్షణకు హెక్టారుకు రూ.500 చొప్పున రెండు సార్లు రాయితీ ఇస్తారు. పత్తికి బదులు పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, వంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే రైతులకు కనీస మద్దతు ధరగా క్వింటాకు రూ.200 బోనస్ అందిస్తారు.

బైరెటీస్ విక్రయాలకు నూతన విధానం..

శాస్త్రీయ విధానంలో విక్రయ ధరను నిర్ణయించేలా ఏపీఎండీసీ రూపొందించిన బైరెటీస్ నూతన సమగ్ర విక్రయ విధానాన్ని మంత్రి మండలి ఆమోదించింది. 2014లో జరిగిన మొదటి విడత ఎర్రచందనం వేలంలో ఈ-టెండర్, ఈ- ఆక్షన్ ద్వారా పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ సంస్థ కొనుగోలు చేసిన సరుకును తీసుకువెళ్లేందుకు కాల వ్యవధిని పొడిగించింది.

పలు పోస్టులు మంజూరు

తిరుపతిలోని ఏపీ హెచ్ఆర్‌డీఐ రీజనల్ సెంటర్ పరిధిలోని శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రం కోసం 6 పోస్టులను మంజూరు చేస్తూ కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మత్స్యకారుల కుటుంబాల్లోని చిన్నారుల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన బీసీ గురుకుల పాఠశాలల్లో 13 టీచింగ్ పోస్టులను మంజూరు చేశారు. అదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 10 రెవెన్యూ డివిజన్లలోని సబ్ ట్రెజరీ ఆఫీసులను అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసులుగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. విశాఖ, తిరుపతి, విజయవాడలో ఆంధ్రప్రదేశ్ భూసేకరణ, పునరావాసం, రీసెటిల్‌మెంట్ అథారిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ కార్యాలయాలలో ఒక్కొక్క యూనిట్‌లో 13 పోస్టుల చొప్పున 39 పోస్టులను ర్యాటిఫై చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

తిరుపతి సైన్స్ మ్యూజియంకు భూమి

కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతో తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న సైన్స్ మ్యూజియం కోసం టీటీడీకి చెందిన సర్వే నెంబరు 589లోని 19.15 ఎకరాలు, సర్వే నెంబరు 588/ఏలోని 50.96 ఎకరాల భూమిని టీటీడీ నిబంధనలు, షరతుల మేరకు లీజుకు ఇవ్వాలన్న ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరం ఏడీఏలోని మెస్సెర్స్ అనూప్ ల్యాబొరేటరీ లిమిటెడ్‌ను కొనుగోలు చేసిన హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన ఆంధ్ర ఆర్గానిక్స్ లిమిటెడ్‌కు రూ.1.22 కోట్ల మేర ఉన్న స్టాంప్ డ్యూటీ బకాయికి మినహాయింపు ఇస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు ముందుకొచ్చిన విజయవాడ మౌంట్ డియోస్ ఎడ్యుకేషనల్ సొసైటీకి, సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంతో జరిగే లీజు డీడ్ నిమిత్తం రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించారు. ఏపీ ఫార్మర్స్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ (ఏపీఎఫ్ఎంఐఎస్) చట్టం 1997కు తెచ్చిన సవరణ ఆర్డినెన్స్ స్థానంలో బిల్లు ప్రవేశ పెట్టడానికి కేబినెట్ అంగీకరించింది. నీటి వినియోగ సంఘాలను బలోపేతం చేయడమే ఈ బిల్లు ఉద్దేశం. విశాఖ జిల్లా రాంబిల్లి మండలం పూడి గ్రామంలోని 248, 266, 293 సర్వేనెంబర్లలో 21.89 ఎకరాలను సెజ్ విస్తరణకుగాను ఏపీఐఐసీకి ఉచితంగా బదలాయించాలన్న ప్రతిపాదనను మంత్రి వర్గం ఆమోదించింది. విశాఖ జిల్లా పద్మనాభం మండలం పెంట గ్రామంలో సర్వే నెంబర్ 201లో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి ఉచితంగా 200 ఎకరాల భూమిని బదలాయించేందుకు నిర్ణయించింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నాయుడు పేట మండలం ఎల్ఏ సాగరం గ్రామంలో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటరు ఏర్పాటుకు వెలవల రాజేష్ అనే యువకుడికి 15 సెంట్ల భూమిని చదరపు గజం రూ.వెయ్యి వంతున ఖరీదు కట్టి షరతులతో భూమి కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఉద్యోగులకు 'ఒక డీఏ'

- జీపీఎఫ్ ఖాతాల్లోకి 2వేల కోట్లు
- సెప్టెంబరు నుంచి జీతంతో కలిపి డీఏ

డీఏ బకాయిల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు సర్కారు తీపి కబురు వినిపించింది. ఒక విడత డీఏ మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. 2016 జనవరి నుంచి 2017 ఆగస్టు వరకు 20 నెలలకు కలిపి రూ.2 వేల కోట్ల డీఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్‌లో జమ చేయాలని నిర్ణయించారు. వచ్చేనెల నుంచి... అంటే సెప్టెంబరు నుంచి డీఏను ఉద్యోగుల జీతాలతో కలిపి ఇవ్వనున్నారు.

లెక్కలు కాదు.. పని కావాలి!

- ఆరోగ్యశాఖపై సీఎం అసంతృప్తి
- అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తనకు కావల్సింది లెక్కలు కాదని, క్షేత్ర స్థాయిలో పని జరగాలని సీఎం చంద్రబాబు వైద్య, ఆరోగ్యశాఖకు స్పష్టం చేశారు. గురువారం నాటి కేబినెట్ భేటీలో.. విష జ్వరాలు, సీజనల్ వ్యాధుల విషయంలో వైద్య ఆరోగ్య శాఖ పనితీరు పట్ల సీఎం మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేబినెట్ భేటీలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మన్యంలో తాజా పరిస్థితిని నివేదించినప్పుడు.. 'మీరేవో లెక్కలు చెబుతున్నారు కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం పని జరగడం లేదు. క్షేత్రస్థాయిలో తరచూ పర్యటించండి.' అని సీఎం వ్యాఖ్యానించారు. సీజనల్ వ్యాధులపై రోజువారీగా పర్యవేక్షణ జరగాలన్నారు. అగ్రిగోల్డ్, సంబంధిత కేసుల్లో వాయిదాల పర్వం వల్ల బాధితులకు న్యాయం జరగడంలో జాప్యం జరుగుతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలు కపిల్ సిబల్ వంటి పెద్ద అడ్వకేట్లను నియమించుకొని వాయిదాలు పడేలా చూసుకుంటున్నాయని అధికారులు నివేదించారు. దీనికి సీఎం స్పందిస్తూ.. కేసులు విచారిస్తున్న న్యాయమూర్తులను వ్యక్తిగతంగా కలసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సహకరించాలని కోరితే బాగుంటుందని సూచించారు. ఎక్కువ వాయిదాలు లేకుండా విచారణ జరిగేలా చూడాలని అడ్వకేట్ జనరల్‌కు సీఎం సూచించారు. ఈ కేసులను సీరియస్‌గా తీసుకోవాలని అధికారులకూ స్పష్టం చేశారు.

డబ్బు కట్టినవారికి శిక్ష ఎందుకులే!

మూడేళ్ల క్రితమే ఎర్ర చందనం కొనుగోలు చేసిన పతంజలి సంస్థ ఇంకా సరుకును తీసుకెళ్లకపోవడంపై మంత్రివర్గం చర్చించింది. నిర్దేశించిన గడువు లోపల సరుకును తీసుకెళ్లనందున వారానికి ఒక శాతం చొప్పున జరిమానా విధించాలని అధికారులు ప్రతిపాదించగా సీఎం వారించారు. ఎర్ర చందనం వేలంలో పలికిన ధరమేరకు రూ.207 కోట్లను పతంజలి సంస్థ చెల్లించిన విషయాన్ని గుర్తు చేస్తూ.. 'డబ్బు కట్టినవారికి శిక్ష వేయడం ఎందుకులే!' అని వ్యాఖ్యానించారు.

క్రమబద్ధీకరణ రేట్లు తగ్గించిన సీఎం

పేదలకు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం అధికారులు తెచ్చిన ప్రతిపాదనలో సీఎం చంద్రబాబు కొన్ని సవరణలు చేశారు. 100 గజాలకు పైబడిన ఆక్రమణల క్రమబద్ధీకరణకు 2013 బేసిక్ వేల్యూను ప్రామాణికంగా తీసుకోవాలని సీఎం సూచించారు. 101 నుంచి 200 గజాల వరకు ఆక్రమణలకు బేసిక్ వేల్యూలో 15 శాతం వసూలు చేయాలని అధికారులు ప్రతిపాదించగా, సీఎం దాన్ని 7.5 శాతానికి తగ్గించారు. అదే విధంగా పేదలకు సంబంధించి 150 గజాలు ఉంటే ఆ మొత్తానికీ ఒకే ధర అమలు చేయకుండా తొలి 100 గజాలు ఉచితంగా... మిగిలిన 50 గజాలకు మాత్రమే 7.5 శాతం వసూలు చేస్తారు. దేవాలయ భూములకు సంబంధించిన వివాదం కోర్టులో ఉండటంతో ఆ భూములు మినహా మిగిలిన స్థలాల్లో ఆక్రమణలు క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు.

వచ్చే నెల నుంచి స్కూళ్లలో బయో మెట్రిక్

రాష్ట్రంలోని పాఠశాలల్లో సెప్టెంబరు 1వ తేదీ నుంచి బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ అమలవుతుందని అధికారులు మంత్రిమండలికి నివేదించారు. బయోమెట్రిక్ హాజరు విధానం పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చేవరకు మంత్రివర్గానికి స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. నంద్యాల ఎన్నికల హడావుడిలో ఉండటం వల్ల డిప్యూటీ సీఎం కె.ఇ. కృష్ణమూర్తి, మంత్రి అఖిల ప్రియ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు కేబినెట్ భేటీకి హాజరు కాలేదు. హాజరైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమావేశం ముగియక ముందే వెళ్లిపోయారు. మంత్రి కామినేని శ్రీనివాస్ ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసమని ఢిల్లీ వెళ్లడం కోసం ముందే వెళ్లిపోయారు.

ఎమ్మెల్యేకో విధానం ఉండదు!

- ప్రజలకు ఇబ్బంది ఉంటేనే మార్చండి
- బెల్టులన్నీ తీయాల్సిందే: సీఎం

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): 'ఒక్కో ఎమ్మెల్యేకు ఒక్కో విధానం ఉండదు. విధానం అన్నాక రాష్ట్రం అంతా... అందరికీ ఒకటే అమలవుతుంది. ప్రజలకు ఇబ్బంది ఉంటే పరిగణనలోకి తీసుకోవాలి' ...మద్యం షాపులు, బార్ల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కేబినెట్ భేటీలో చేసిన వ్యాఖ్యలివి. తన నియోజకవర్గంలో మద్యం షాపులు, బార్లు ఉండేందుకు వీల్లేదని, తొలగించాలని బీజేపీ (విశాఖ-ఉత్తర) ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఎక్సైజ్ అధికారులకు లేఖ రాసిన విషయాన్ని ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనరసింహం గురువారం మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించారు. విధానపరమైన నిర్ణయం కాబట్టి ఇది తన పరిధిలోది కాదని, ప్రభుత్వానికి నివేదిస్తానని బదులిచ్చానని తెలిపారు. సీఎం దీనికి స్పందిస్తూ.. ఒక్కో ఎమ్మెల్యే ఒక్కో విధంగా కోరితే మార్చడం సాధ్యపడదని తేల్చిచెప్పారు. ఎమ్మెల్యే లేఖపై ఇక్కడ చర్చించాల్సిన అవసరం లేదన్నారు. 'ఇప్పుడు ఒకరు ఒకటి చెబితే.. రేపు మరో ఎమ్మెల్యే ఇంకోటి చెబుతారు. మనిషి మనిషికీ ఎలా మార్చగలం. దేవాలయాలు, చర్చిలు, మసీదులు, విద్యాలయాల విషయంలో కొన్ని మార్గదర్శకాలు పాటిస్తున్నాం. అలాంటి విషయాల్లో అభ్యంతరాలుంటే ఎవరైనా చెప్పొచ్చు. వాటిని పరిగణనలోకి తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఉంటే మార్చాలి. అంతిమంగా ప్రజలకు ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ విధానంలోని ముఖ్య ఉద్దేశం' అని వివరించారు. మద్యం బెల్టు షాపుల మూసివేత విషయంలో సర్వే ఫలితాలను రియల్ టైం గవర్నెన్స్ సీఈవో ఎ.బాబు వెల్లడించారు. ఇప్పటివరకు ఎక్కడెక్కడ ఎన్ని బెల్టు షాపులు మూసివేసిందీ... అధికారులు చెప్పారు. బెల్టు షాపులను పూర్తిగా తొలగించాలని సీఎం స్పష్టం చేశారు. సర్వేలో ప్రజల స్పందన చాలా సానుకూలంగా ఉందని, ఇదే ఒరవడి కొనసాగాలన్నారు. మండల జనాభా ఆధారంగా ఎన్ని షాపులు ఉండాలో నిర్ణయిస్తే.. కొన్నిచోట్ల అవన్నీ ఒకే ఊళ్లో పెడుతున్నారని, ముఖ్యంగా మండల కేంద్రాల్లోనే ఎక్కువగా ఏర్పాటవుతున్నాయని మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఒకే ఊర్లో ఏర్పాటును అడ్డుకోవాలని, నిర్దేశించిన చోటే ఏర్పాటయ్యేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

గ్రాండ్ చాలెంజ్!

- ఉద్దానంపై పరిశోధన సంస్థల మధ్య పోటీ

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం కిడ్నీ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనుంది. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు వీలైనంత త్వరగా ఉపశమనం కలిగించేందుకు అంతర్జాతీయ స్థాయి పరిశోధన సంస్థతో కిడ్నీ సమస్యలపై అధ్యయనం చేయించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. పరిశోధన బాధ్యతలు చేపట్టే సంస్థ ఎంపిక ప్రక్రియను 'గ్రాండ్ చాలెంజ్' పేరుతో నిర్వహిస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. ఉద్దానం కిడ్నీ సమస్యలపై పరిశోధనలు చేసేందుకు భారతీయ వైద్య పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రంలో మూడేళ్లపాటు పరిశోధనలు జరగనున్నాయి. దీనికి ప్రతి ఏటా రూ.10 కోట్ల చొప్పున అవసరమని అంచనా వేశారు. మొత్తం రూ.30 కోట్లను పరిశోధనలకు ఖర్చు చేస్తారు. ఈ మొత్తాన్ని ఐసీఎంఆర్, రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం భరిస్తాయి. ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పరిశోధన కేంద్రంలో పరిశోధనలకు ప్రభుత్వం ఓ సంస్థను ఎంపిక చేస్తుంది. ఆ సంస్థ మూడేళ్ల పాటు కిడ్నీ సమస్యలపై పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. ఉద్దానంలో కిడ్నీ సమస్యలు ఎలా ఉత్పన్నం అయ్యాయి? దానిని ఏ విధంగా నివారించవచ్చు? అన్న అంశాలపై పూర్తిస్థాయిలో పరిశోధనలు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తుంది. ఉద్దానం కిడ్నీ సమస్యలపై పరిశోధన చేసే సంస్థ ఎంపికను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇందుకుగాను అంతర్జాతీయ స్థాయిలో బిడ్స్‌ను ఆహ్వానిస్తారు. పరిశోధనలకు ఎంపికైన సంస్థ మూడేళ్లలో పరిశోధనలు పూర్తి చేసి తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలి.ఉద్దానం కిడ్నీ సమస్యలపై పరిశోధనకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ వినతి మేరకు ఏపీకి వచ్చిన హార్వర్డ్ వర్సిటీ కూడా 'గ్రాండ్ చాలెంజ్'లో పాల్గొని నిర్ణీత సమయంలో నివేదికను సమర్పించాల్సి ఉంటుంది.

విశాఖలో పరిశోధన కేంద్రం!

ఐసీఎంఆర్ సహకారంతో ఏర్పాటు చేయనున్న పరిశోధన కేంద్రాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారు. నెల రోజుల క్రితం ఇచ్చిన జీవోలో శ్రీకాకుళం రిమ్స్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఉద్దానానికి విశాఖ నుంచి 2 గంటల్లో చేరుకొనే వెసులుబాటు ఉండటం, విశాఖ మెడికల్ కాలేజీల్లో అన్ని సౌకర్యాలతో కూడిన లేబొరేటరీలు ఉండడంతో ఇక్కడ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఏపీ నిట్‌కు పెరిగిన ఆదరణ

- స్పెషల్ రౌండ్ సీట్లు 480, అడ్మిషన్లు 431

తాడేపల్లిగూడెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఏపీ నిట్)లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగింది. రెగ్యులర్ కౌన్సెలింగ్‌లో 380 సీట్లు కేటాయించగా 348 మంది విద్యార్థులు చేరారు. స్పెషల్ రౌండ్‌లో అడ్మిషన్లు పొందేవారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఏపీ నిట్‌కు 480 సీట్లను స్పెషల్ రౌండ్‌లో కేటాయించారు. ఇక్కడ రిపోర్టు చేసిన విద్యార్థుల్లో 57మంది మరో విద్యాసంస్థను ఎంపిక చేసుకోగా, ఇతర విద్యాసంస్థల నుంచి 67 మంది ఇక్కడ చేరారు. కొత్తగా చేరినవారితో కలిపి ఈ ఏడాది సీట్ల భర్తీ 431కి చేరుకుంది. విద్యార్థులు రిపోర్టు చేసేందుకు ఇంకా ఒకరోజు గడువు మిగిలి ఉంది. పూర్తిస్థాయిలో సీట్ల భర్తీకి మరో 49 మంది విద్యార్థులు చేరాల్సి ఉంది. శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు రిపోర్టు చేసేవారికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు. స్పెషల్ రౌండ్ ఫలితంగా ఈసారి విద్యార్థుల సంఖ్య పెరిగింది. గత రెండేళ్లలో గరిష్టంగా 420 మంది మాత్రమే ఏపీ నిట్‌లో అడ్మిషన్లు తీసుకున్నారు.

ఉచిత ఇసుకపై

ఎందుకింత అసంతృప్తి?

- ఉచిత ఇసుకకు 48 శాతమే మద్దతు
- 52% మంది అయిష్టానికి కారణమేంటి?
- టీడీపీ సమన్వయ సమావేశంలో సీఎం ప్రశ్న

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): 'మద్యం బెల్టు షాపులు తొలగించాలని, ఇసుక మరింత చౌకగా ప్రజలకు లభ్యమయ్యేలా చూడాలని ఒకే రోజు నిర్ణయాలు తీసుకుని ఆదేశాలు జారీ చేశాం. బెల్టు షాపుల తొలగింపు బాగా అమలైంది. దానిపై ప్రజల్లో తొంభై శాతానికి పైగా సంతృప్తి వ్యక్తమవుతోంది. ఇసుకపై సంతృప్తి 48 శాతమే వస్తోంది. 52 శాతం మంది ప్రజలు ఇంకా సంతృప్తిగా లేరని సర్వేల్లో వస్తోంది. ఎందుకీ తేడా? ఇసుకలో మన నిర్ణయం పూర్తిగా ఎందుకు అమలు కావడం లేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించినట్లు తెలిసింది. గురువారమిక్కడ మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతల సమన్వయ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా ఉచిత ఇసుక ప్రస్తావనకు వచ్చింది. జిల్లా స్థాయిలో నలుగురు, రాష్ట్ర స్థాయిలో నలుగురు అధికారులతో కమిటీ వేసి ఇసుక లోడింగ్, రవాణా చార్జీలు అమలు చేయాలని ఆదేశించానని, ఈ కమిటీలు ఏర్పాటైనా ధరల నిర్ణయంలో ఇంకా జాప్యం జరుగుతోందని ఆక్షేపించారు. క్యూబిక్ మీటర్ల చొప్పున లోడింగ్ చార్జీలు, కిలోమీటర్ల చొప్పున రవాణా చార్జీలను త్వరగా ఖరారు చేయాలని, ఒకసారి ఈ రేట్లు నిర్ణయించాక అంతకుమించి వసూలు చేయకుండా నిఘా పెట్టాలని ఆదేశించారు. ప్రస్తుత జన్మభూమి కమిటీలను రద్దు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ నెలాఖరులోపు కొత్త కమిటీలను వేయాలని, ఇన్‌చార్జి మంత్రులు వాటిపై తుది ఆమోద ముద్ర వేయాలని సూచించారు. పక్కా గృహాల నిర్మాణంలో అన్నదమ్ములు కలిపి ఇల్లు కట్టుకుంటామంటే.. నిబంధనలు ఒప్పుకోవంటూ అధికారులు అభ్యంతరపెడుతున్నారని గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. 'మధ్యలో ఒక గోడ అడ్డుగా పెట్టుకుని అన్నదమ్ములు కలిపి కట్టుకుంటే వారికి ఖర్చు కలిసి వస్తుంది. దీనికి అభ్యంతరం దేనికి? అర్థం లేని నిబంధనలతో అధికారులు వేధించడం సరికాదు. కలిపి కట్టుకోవడానికి అనుమతి ఇస్తున్నాం' అని సీఎం ప్రకటించారు. గ్రామాల్లో లింక్ రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని జిల్లా అధ్యక్షులు కోరగా సమ్మతించారు.



అన్న అమృతహస్తాన్ని 83% ఉపయోగించుకుంటున్నారు

పేద గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అన్న అమృత హస్తం' పేరుతో ఆహారం ఇస్తున్న విధానాన్ని మార్చడంపై సమావేశంలో చర్చ జరిగింది. 67 శాతం మంది గర్భిణులు ఇంటికే రేషన్ ఇవ్వాలని కోరుకుంటున్నట్లు సర్వేలో తేలిందని ముఖ్యమంత్రి తెలిపారు. భోజన నాణ్యత బాగుందని 69 శాతం, అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని 83 శాతం మంది తెలిపారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగి ఇప్పటికి నాలుగు నెలలైందని, ఈ కాలంలో తమ శాఖలో ఏం చేశారో మంత్రులు నివేదిక ఇవ్వాలని సీఎం కోరారు. ఇన్‌చార్జి మంత్రులు తమకు కేటాయించిన పార్లమెంటు నియోజకవర్గాల్లో పార్టీ బలాలు... బలహీనతలపై కూడా నివేదిక ఇవ్వాలని చెప్పారు. 24 సాగునీటి ప్రాజెక్టులను నాలుగు నెలల్లో పూర్తి చేయడానికి ముమ్మరంగా పనులు చేయిస్తున్నామని చెప్పారు. గరగపర్రు వివాదం పరిష్కారానికి మంత్రులు బాగా కృషి చేశారని సీఎం ప్రశంసించారు. దేవరపల్లి వివాదాన్ని కూడా పరిష్కరించాలని సూచించారు.

ఏం.. నాకు పనుల్లేవా?

జిల్లా అధ్యక్షుల గైర్హాజరుపై బాబు ఆగ్రహం

సమన్వయ సమావేశానికి కొందరు జిల్లా అధ్యక్షులు హాజరు కాకపోవడంపై చంద్రబాబు మండిపడ్డారు. విశాఖ రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేశ్ బాబు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్ గైర్హాజరయ్యారు. 'వాళ్లకేనా పనులు? నాకు లేవా? ఎందుకీ సమావేశాలు పెడుతున్నాను? ఇక నుంచి అందరూ కచ్చితంగా హాజరు కావలసిందే. సాకులు చెప్పొద్దు' అని హెచ్చరిక స్వరంతో చెప్పారు. పార్టీ సమావేశాలకు నేతల హాజరుపై వివరాలివ్వాలని రాష్ట్ర కార్యాలయ బాధ్యులను ఆదేశించారు.

నెలరోజుల్లో బీసీ కమిషన్ నివేదిక వస్తుంది

కాపు రిజర్వేషన్ల అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. జస్టిస్ మంజునాథ నేతృత్వంలోని బీసీ కమిషన్ నివేదిక నెల రోజుల్లో వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. 'తమకు రాజకీయ రిజర్వేషన్లు అక్కర్లేదని.. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ కార్యక్రమాల్లో ఇస్తే చాలని కాపు నేతలు కోరుతున్నారు. ఇందుకు ఏ విధానం అనుసరించాలో ఆలోచిస్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

ముద్రగడ వెనుక జనం లేరు: రాజప్ప

కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని త్వరలో సీఎం చంద్రబాబును అడుగుతామని ఉపముఖ్యమంత్రి చినరాజప్ప పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం వెనక జనం లేరని, అందుకే తూర్పు గోదావరి జిల్లాలో విధించిన 144వ సెక్షన్‌ను కూడా ఎత్తేస్తున్నామని సచివాలయంలో చెప్పారు. త్వరలోనే కాపు నేతలు, సంఘాలు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కాపు నాయకులతో సీఎంను కలిసి రిజర్వేషన్లు అడుగుతామన్నారు. జగన్ ప్రభావంలో పడి ముద్రగడ పద్మనాభం ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని కాపులు గమనిస్తున్నారన్నారు. ఉద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని మంత్రి స్పష్టం చేశారు.

ఏం చేస్తున్నామో చెబుదాం

- పథకాలు అమలు తీరు తెలుసుకుందాం
- 1 నుంచి ఇంటింటికీ టీడీపీ పాదయాత్ర
- ఉద్యోగులు 8 గంటలకు పైనే పనిచేస్తున్నారు
- వారివల్లే 90 శాతానికిపైగా సంతృప్తి: బాబు

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చాటిచెప్పేందుకు పెద్దఎత్తున ప్రజల్లోకి వెళ్లాలని తెలుగుదేశం పార్టీ సంకల్పించింది. సెప్టెంబరు 1 నుంచి ఇంటింటికీ పాదయాత్ర పేరుతో భారీ కార్యక్రమం చేపట్టాలని పార్టీ సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రతి ఇంటికీ పాదయాత్ర చేసి ప్రభుత్వం ఏం చేస్తోందో ప్రజలకు వివరించాలని, ప్రభుత్వ పథకాల అమలుపై వారి మనోగతాన్ని తెలుసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల నుంచి వినతుల స్వీకరణ.. వాటి పరిష్కారం.. ప్రజల్లో సంతృప్తిని ప్రజాప్రతినిధులు క్రమం తప్పకుండా అధ్యయనం చేయాలని, దీనిని ఫీడ్‌బ్యాక్‌గా తీసుకోవాలని చెప్పారు. 'ప్రజల్లో అసంతృప్తి ఉంటే వారికి ఏవైనా పనులుగాక అసంతృప్తిగా ఉన్నారా.. రాజకీయ భేదాభిప్రాయాలతో అసంతృప్తిగా ఉన్నారా అన్నది అధ్యయనం చేయాలి. బాగా పనిచేయడం ద్వారా మొదటి అసంతృప్తిని దూరం చేయవచ్చు. రాజకీయ పునరేకీకరణ ద్వారా రెండో అసంతృప్తిని దూరం చేయవచ్చు. అవి అలాగే ఉంటాయని వదిలేసి ఊరుకోవద్దు' అని స్పష్టం చేశారు. పేదలకు సంబంధించి ఇళ్ల పట్టాల పంపిణీ, పక్కా ఇళ్ల మంజూరు వంటి వాటిపై ప్రతి నెలా విశ్లేషించుకోవాలని, ఇంకా ఎంత మందికి ఈ ప్రయోజనాలు అందాల్సి ఉందో లెక్క వేసుకుని.. దాని కోసం పనిచేయాలని పార్టీ నేతలను ఆదేశించారు. 'సంక్షేమ కార్యక్రమాలపై ప్రతి పదిహేను రోజులకోసారి ప్రజల నుంచి సమాచారం సేకరిస్తున్నాం. అనేక పథకాలపై ప్రజల నుంచి తొంభై శాతం వరకూ సంతృప్తి వ్యక్తం అవుతోందంటే ఉద్యోగులు బాగా పనిచేయడం వల్లే. ఉద్యోగులు టెక్నాలజీని అందిపుచ్చుకొని పనిచేస్తున్నారు. అనేక మంది రోజుకు ఎనిమిది గంటలకు పైనే పనిచేస్తున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చాక ఎవరు ఎన్నెన్ని ఫైళ్లు క్లియర్ చేస్తున్నారో తెలిసిపోతోంది. వారి పనితీరు వల్లే అనేక పథకాలు క్షేత్ర స్థాయిలో బాగా అమలవుతున్నాయి. ఇంకొంత శ్రద్ధ పెట్టి పనిచేస్తే ప్రజల్లో నూటికి నూరు శాతం సంతృప్తి తెచ్చుకోవడం కూడా సాధ్యమే. ఇంత బాగా పనిచేస్తున్న ఉద్యోగులపై మనకేదో ద్వేషం ఉందని కొన్ని వర్గాలు ప్రచారం చేస్తున్నాయి దానిని తిప్పికొట్టాలి. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులివ్వకుండా నిర్వీర్యం చేసిన వర్గాలే ఇప్పుడు మనపై దుష్ప్రచారం చేస్తున్నాయి' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. 'అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ మనల్ని జాగ్రత్తగా చూస్తుంటారు. మన ప్రవర్తన, మాట తీరు అహంకారంగా కనిపించకూడదు. వినమ్రతతో ఉండాలి. ఎవరూ వేలెత్తి చూపేలా ఉండకూడదు. త్వరగా స్పందించాలి' అని సూచించారు.

పదవులొచ్చినవారు పనిచేయాల్సిందే

పదవులు పొందినవారు వాటికి న్యాయం చేయాలి. పదవులు కావాలి.. పని చేయం అంటే సహించేది లేదు. వారి వల్ల నాలుగు ఓట్లు రావాలి. పోగొట్టేలా ఉంటే వారినే పక్కన పెట్టేస్తాం' అని హెచ్చరించారు. మండల, జిల్లా కమిటీలు ప్రతి నెలా వాటి సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించి మినిట్స్ నమోదు చేసి రాష్ట్ర కార్యాలయానికి పంపాలని, అవి ఎంతవరకూ పరిష్కారమయ్యాయో విశ్లేషించాలని ఆయన కోరారు. నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ గెలుపు ఇప్పటికే ఖాయమైందని, భారీ మెజారిటీ సాధించేందుకు పార్టీ యంత్రాంగం గట్టిగా ప్రయత్నించాలని పిలుపిచ్చారు.

• ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాష్ట్రంలోని అన్ని జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఈనెల 16 వరకు పొడిగించారు. దీనిపై ఇంటర్ బోర్డు సెక్రటరీ బి.ఉదయలక్ష్మి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆర్సీ. 217/2017 తేది :29-07-2017

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్ (భూ.సే) తెలుగుగంగ ప్రాజెక్ట్ నెల్లూరు. ప్రస్తుతము: శ్రీమతి పి. ప్రశాంతి, M.A

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం.VI (ఎ)

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావలి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా ఎ.6.83 సెంట్లు భూములకు నెల్లూరుజిల్లా, మర్రిపాడు మండలం చుంచులూరు గ్రామము నందు ప్రజాహిత ఉపయోగార్థం అనగా గ్రావిటీ కెనాల్-III A నిర్మాణము కొరకు ఆనం సంజీవరెడ్డి హైలెవల్ లిఫ్ట్ కెనాల్ పరిధిలో భూమి కావలయునని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ప్రతిపాదిత భూసేకరణలో ఎలాంటి నిర్వాసిత కుటుంబములు లేవు.

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్.నెల్లూరు వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్/12 (3బి) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ) తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు / ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్ నెల్లూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం / కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురింపబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా శ్రీ ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్.నెల్లూరు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారి యెదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు మండలము : మర్రిపాడు గ్రామము : చుంచులూరు

క్రమ సంఖ్య	సర్వే నెం./ సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం (ఎ.సెం.)	భూసేకరణ క్రింద విస్తీర్ణము ఎ.సెం	తరగతి	సంబంధిత ఆసామి పేరు-చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు పంట వివరములు
1.	230-2	1.42	0.70	పట్టా మెట్ట	ముప్పాళ్ళ రామరాజు తండ్రి కదిరిరాజు	469	232	231	229	సాగు
2.	233	16.48	2.35	పట్టా మెట్ట	దేవళ్ళ పెంచలమ్మ భర్త వెంకటయ్య	232, 471	488	493	333, 335	బీడు
3.	250/1	12.65	0.01	పట్టా మెట్ట	అరిమళ్ళ ప్రసన్నకుమార్ తండ్రి శ్రీనివాసులు	251, 252	240	242, 249	493	సాగు
4.	493	10.02	3.77	పట్టా మెట్ట	కొండూరు వెంకటరాజు తండ్రి గంగరాజు కొండూరు రామరాజు తండ్రి ఓబులరాజు	472	492	250, 251	233	సాగు
		మొత్తం	6.83							

సం/- శ్రీమతి పి.ప్రశాంతి ., ఎం.ఏ , ప్రత్యేక కలెక్టరు, తెలుగు గంగప్రాజెక్టు, నెల్లూరు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

O/o స్పెషల్ కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి.నెం: C1/175/17 తేది : 02.08.2017

ఫారం నెం.VII

(2013వ సంవత్సరం 30వ చట్టము వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్-19 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్‌రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనముల్కై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం పశ్చిమగోదావరి జిల్లా, కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామమునకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2017-18నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013 వ సంవత్సరం 30వ చట్టంలోని 19 (1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూ.సే) , పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19 (1) విభాగం ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.8.03 సెంట్లులను ప్రజా ప్రయోజనముల్కై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : పశ్చిమగోదావరి మండలం : కామవరపుకోట గ్రామం : తడికలపూడి

క్రమ సంఖ్య	సర్వే నెం/ స.డి. నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం	భూమి తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు తూర్పు	దక్షిణం	పడమర	ఉత్తరం	చెట్లు మరియు కట్టడములు వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	923/2	10.00	1.13	పుంజ	గూడూరి శ్రీదేవి భర్త వెంకట శివ రామప్రసాద్	923/3	947	923/1	924	కొబ్బరి, కోకో, అరటి, డ్రిప్, నిమ్మ, పైప్‌లైన్
2	924/2	5.24	0.57	పుంజ	ఆనందం సత్తిబాబు తండ్రి శ్రీరాములు	924/3	923	924/1	925	కొబ్బరి, నిమ్మ
3	925/2	4.76	0.37	పుంజ	ఆనందం సత్తిబాబు తండ్రి శ్రీరాములు	925/3	924	925/1	928	నిమ్మ, టేకు, కొబ్బరి
4	928/2బి	13.50	0.68	పుంజ	పూదోట బాల మాత్యా రవికుమార్ తండ్రి ఇన్నయ్య; నాగోతు వేలాంగిణి సంతోషమ్మ భర్త బాల మాత్యా రవికుమార్	928/2సి	928/4	928/2ఎ	928/5బి	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, కోకో, జామ-2
5	928/5బి	4.95	0.56	పుంజ	పూదోట ఇన్నయ్య తండ్రి సొరయ్య	928/5సి	928/2బి	928/5ఎ	930	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్,
6	936/6బి	3.75	0.33	పుంజ	దావులూరి లక్ష్మీ కుమారి భర్త హనుమంతరావు	937	936/6ఎ	936/6ఎ	936/1	నిమ్మ, పైప్‌లైన్, డ్రిప్, కొబ్బరి-9
7	937/1	6.42	0.48	పుంజ	చమట మనోహరిణి భర్త రాజేంద్ర ప్రసాదు (0.12); ఈదుపుగంటి శివరామకృష్ణ తండ్రి నాగేశ్వరరావు (0.36)	937/2	1049	936	936	అరటి, పైప్‌లైన్, డ్రిప్, కొబ్బరి-8, వేప-1; నిమ్మ, బత్తాయి, కొబ్బరి
8	939/1బి	1.67	0.23	పుంజ	కోరుకొండ లీలా రాజేంద్ర ప్రసాదు	939/1సి	939/2బి	939/1ఎ	944	నిమ్మ, కొబ్బరి, పైప్‌లైన్, ఫెన్సింగు
9	939/2బి	2.40	0.35	పుంజ	కోరుకొండ నాగ సునీత భర్త లీలా రాజేంద్ర ప్రసాదు (0.06); ఈదుపుగంటి నాగరత్నం భర్త దశరధ రామయ్య (0.29)	939/2సి	936	940	939/1బి	నిమ్మ, పైప్‌లైన్, ఫెన్సింగు; పామాయిల్, నిమ్మ, బోరు, పైప్‌లైన్, డ్రిప్, బోరు షెడ్డు
10	940/2బి	4.18	0.11	పుంజ	దావులూరి అనుపమ భర్త కృష్ణ	939	936	940/2ఎ	940/2ఎ	అరటి, పైప్‌లైన్, డ్రిప్, టేకు, కొబ్బరి-6
11	943/1బి	3.00	0.39	పుంజ	ఈదుపుగంటి లక్ష్మీనారాయణ తండ్రి సీతయ్య	943/1సి	944	943/1ఎ	947	నిమ్మ, పైప్‌లైన్, డ్రిప్
12	944/1బి	1.98	0.27	పుంజ	ఈదుపుగంటి లక్ష్మీనారాయణ తండ్రి సీతయ్య	944/1సి	944/4బి	944/1ఎ	943	నిమ్మ, పైప్‌లైన్, డ్రిప్, కొబ్బరి
13	944/4బి	0.37	0.07	పుంజ	కోరుకొండ నాగ సునీత భర్త లీలా రాజేంద్ర ప్రసాదు	944/4సి	939	944/4ఎ	944/1బి	నిమ్మ, పైప్‌లైన్, కొబ్బరి, ఫెన్సింగ్
14	1037/1	5.10	0.21	పుంజ	కొమ్మినేని జయప్రద భర్త బాల చంద్రమౌళేశ్వరరావు	1037/2	1030	1051	1037/2	సాగుభూమి, పైప్‌లైన్, డ్రిప్
15	1048/1ఎ	4.40	0.59	పుంజ	ఈదుపుగంటి శివరామకృష్ణ తండ్రి నాగేశ్వరరావు	1048/1బి	1045	1049	937	పామాయిల్, కొబ్బరి-41, పైప్‌లైన్, డ్రిప్, తాడి-7, వేప-4, కుంకుడు-2
16	1049/2	6.77	0.55	పుంజ	ఈదుపుగంటి రాజ్యలక్ష్మి తండ్రి హరిచంద్ర ప్రసాదు	1048	1051	1049/1	937	పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, తాడి-22, వేప-10, కుంకుడు-2, రావి-2, సింధుగ-2, అశోక-1, పైప్‌లైన్, డ్రిప్,
17	1052/1బి	8.18	1.08	పుంజ	నెక్కలపూడి లక్ష్మీనారాయణ తండ్రి సోమయ్య	1052/1సి	1056	1052/1ఎ	1030	పామాయిల్, కొబ్బరి-12, నిమ్మ-6, వేప-1
18	1059/1ఎ	9.40	0.06	పుంజ	అబ్బూరి శ్రీనివాసరావు తండ్రి బాలకృష్ణారావు	1059/1బి	1059/1బి	1059/1బి	1056	సాగుభూమి
	మొత్తం		8.03							

ఈ భూముల ప్లాన్లు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్ నెం.2, ఏలూరు నందు ఉంచబడినవి. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులయిన వారు ఎవ్వరును లేరు

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/- సి.హెచ్.భాను ప్రసాద్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా

‘బెల్టు’పై హైటెక్ నిఘా

షాపులకు జియోట్యాగింగ్.. తొలగించాక 1100 నుంచి ఫోన్ సర్వే

- **మళ్లీ పెడితే అధికారులపై చర్యలు**
- **ఒక్కో మండలం ఓ అధికారికి బాధ్యత**



అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులకు టెక్నాలజీతో చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం బెల్టులపై ఉక్కుపాదం మోపుతోన్న ప్రభుత్వం... రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 38వేల షాపులను తొలగించింది. ఇవి మళ్లీ వెలవకుండా ఉండేందుకు పీపుల్స్ ఫస్ట్ యాప్ ద్వారా జియోట్యాగింగ్ చేస్తారు. బెల్టు షాపు పెట్టిన ప్రాంతం, నిర్వాహకుడిని అక్కడ జియోట్యాగింగ్ విధానంలో ఫొటోలు తీస్తారు. దాంతో పాటు లిక్కర్, బీరు ఎంత స్వాధీనం చేసుకున్నారు, కేసు వివరాలను కూడా అందులో నమోదుచేస్తారు. ఆ సమాచారం గూగుల్‌తో అనుసంధానమై నేరుగా ‘1100’ పరిష్కార వేదికకు వెళ్తుంది. దాని ఆధారంగా పరిష్కార వేదిక నుంచి ఆ గ్రామం లేదా ప్రాంతంలోని ప్రజలకు ఫోన్లు చేసి బెల్టు షాపులు మళ్లీ వెలిశాయా అని ఆరా తీస్తారు. ఒకవేళ తిరిగి బెల్టు షాపు ఏర్పాటైతే అక్కడి అధికారిపై చర్యలు తీసుకుంటారు. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని నిర్ణయించారు. దీంతోపాటు గుర్తించిన ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం బృందాలు తరచూ తనిఖీలు నిర్వహిస్తాయి.

మండలానికి ఓ అధికారి

ఇప్పటివరకూ ఒక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉండే బెల్టు షాపులపై చర్యలకు అక్కడి ఎస్‌హెచ్‌వో బాధ్యత తీసుకునేవారు. అయితే చర్యలు నామమాత్రంగా ఉండేవి. ఇప్పుడు స్టేషన్ పరిధిలోని ఒక్కో మండలాన్ని ఒక్కొక్కరికి అప్పగించారు. సిబ్బందిని బట్టి ఎస్‌హెచ్‌వో, ఎస్సై, హెడ్ కానిస్టేబుల్ వరకూ బాధ్యతలు ఇచ్చారు. వారికిచ్చిన మండలంలో తిరిగి బెల్టు షాపు వెలిస్తే వారిని ఒకసారి హెచ్చరిస్తారు. రెండోసారి వెలిస్తే అక్కడి అధికారిని సస్పెండ్ చేయాలని భావిస్తున్నారు. మరోవైపు బెల్టు షాపులకు ఇల్లు అద్దెకిచ్చే యజమానులపైనా కేసులు పెడుతున్నారు. మొబైల్ తరహాలో వ్యాపారం చేసేవారి నుంచి లిక్కర్‌తోపాటు వాహనం కూడా సీజ్ చేయాలని నిర్ణయించారు. దానివల్ల మద్యం తక్కువే దొరికినా వాహనం సీజ్ చేయడం వల్ల తిరిగి అమ్మడానికి సాహసించరని అధికారులు అంటున్నారు.

అధికారులకు షోకాజు నోటీసులు

బెల్టు షాపుల నిర్మూలనలో పనితీరు సరిగాలేని అధికారులకు షోకాజు నోటీసులు జారీచేస్తున్నారు. గురువారం సుమారు 30 మంది అధికారులకు నోటీసులు సిద్ధంచేశారు. నేడు వారికి అందజేయనున్నారు. బెల్టులపై సరైన పనితీరు ఎందుకు కనబరచలేకపోయారో చెప్పాలని అందులో కోరారు. ఆ వివరణలకు ఉన్నతాధికారులు సంతృప్తి చెందకపోతే వారిపై చర్యలు తీసుకుంటారు. అలాగే బెల్టులకు మద్యం సరఫరా చేసిన లైసెన్సీలపై చర్యలు తీసుకోని వారిపైనా ఒత్తిడి పెంచారు. బెల్టు షాపులు దాదాపు 95శాతం నిర్మూలించామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంకా అక్కడక్కడా 5శాతం షాపులున్నాయని, రోజుల వ్యవధిలోనే వాటిని తొలగిస్తామని చెప్పారు.



కుటుంబ విలువలు, భిన్నత్వాన్ని అంగీకరించడం, పర్యావరణ అవగాహన అనే మూడు భారతీయ గొప్ప సంప్రదాయాలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆచరించాల్సినవేనని ప్రధాని మోదీ అన్నారు. తనను కలవడానికి వచ్చిన యంగ్ ఫిక్కీ మహిళల సంస్థకు చెందిన 25 మంది సభ్యుల బృందంతో విద్య, నైపుణ్య అభివృద్ధి, మహిళల భద్రత, కళలు, సంస్కృతులపై ఆయన చర్చించారు.

ప్రణబ్ దా, మీరు పితృసమానులు

- **మాజీ రాష్ట్రపతికి లేఖలో ప్రధాని**

న్యూఢిల్లీ: రాష్ట్రపతిగా చివరిరోజు ప్రణబ్ ముఖర్జీ అందుకున్న లేఖ ఆయన మనసును హత్తుకుంది! అది రాసింది మరెవరో కాదు.. ప్రధాని నరేంద్ర మోదీ! “ప్రణబ్ దా, మీరు నాకు పితృసమానులు. మార్గదర్శకులు” అన్న మోదీ అక్షరాలు ఆయన భావోద్వేగాన్నే కాదు.. భిన్న రాజకీయ సిద్ధాంతాల నుంచి వచ్చిన ఆ ఇద్దరు నాయకుల మధ్య అనుబంధాన్నీ చాటుతాయి. గురువారం ఆ లేఖను ప్రణబ్ పోస్ట్ చేశారు. మూడేళ్ల కిందట ఒక బయటి వ్యక్తిగా ఢిల్లీ వచ్చానని ఆ లేఖలో మోదీగుర్తు చేసుకున్నారు. “నా ముందున్న లక్ష్యం చాలా పెద్దది. ఎన్నో సవాళ్లు. ఆ సమయంలో పితృసమానుడిగా, మార్గదర్శకుడిగా నిలిచారు” అని మోదీ జూలై 24నాటి లేఖలో రాశారు. కాగా, మీతో కలిసి పని చేసిన రోజులను మరువలేనని ప్రణబ్ ట్వీట్‌కు మోదీ స్పందించారు.

ఇంకా ఎన్నాళ్లు...!

- **ఆర్టీసీ ఆస్తుల విభజనపై షీలా భిడే ప్రశ్న**
- **బోర్డు నిర్ణయం త్వరగా పంపాలని సూచన**
- **14 ఆస్తుల్లో 58% ఇవ్వాల్సిందే: ఏపీఎస్ఆర్టీసీ**



అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ‘ఇంకా ఎన్నాళ్లు కావాలి... బోర్డు సమావేశం ఏర్పాటు చేసి మీ నిర్ణయాన్ని త్వరగా కేంద్రానికి తెలియజేయండి’ అని ఇరు రాష్ట్రాల ఆర్టీసీ అధికారులకు షీలా భిడే సూచించారు. ఉమ్మడి ఆస్తుల విభజనపై కేంద్రం నియమించిన షీలా భిడే కమిటీ గురువారం హైదరాబాద్‌లోని పరిశ్రమల భవన్‌లో సమావేశమైంది. ఏపీఎస్ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య, ఈడీ ఏవీరావుతో కూడిన అధికార బృందం ఈ సమావేశంలో పాల్గొంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజా రవాణా సంస్థ సమకూర్చుకున్న ఆస్తుల్లో 14 హైదరాబాద్‌లో ఉన్నాయని వాటిలో 58శాతం వాటా తమకు ఇవ్వాల్సిందేనని రాష్ట్ర అధికారులు తేల్చిచెప్పారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. అయితే టీఎస్ఆర్టీసీ అధికారులు మాత్రం ఎక్కడి ఆస్తులు అక్కడే ఉండాలని వాదించారు. ఇరుపక్షాల అభిప్రాయాలపై బోర్డు సమావేశంలో చర్చించి మినిట్స్‌లో పొందుపరిచి కేంద్రానికి త్వరగా పంపాలని షీలా భిడే కమిటీ సూచించింది. బస్‌భవన్, తార్నాక ఆస్పత్రి, మియాపూర్‌లోని బస్ బాడీ బిల్డింగ్ యూనిట్ ఆస్తులను 58:42 నిష్పత్తి ప్రకారం పంచితే సముచితమని కేంద్రం నుంచి వచ్చిన ప్రతినిధులు అభిప్రాయపడినట్లు తెలిసింది. ఈ విషయమై ఏపీఎస్ఆర్టీసీ గుర్తింపు యూనియన్ ఎన్ఎంయూ అధ్యక్షుడు చల్లా చంద్రయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 14 ఆస్తుల్లో 58శాతం వాటా రాబట్టాల్సిందేనన్నారు. అలాకాకుండా మూడింటి వరకే పంచుతామంటే కేంద్ర ప్రభుత్వమైనా ఆ మొత్తాన్ని ఏపీఎస్ఆర్టీసీకి ఇవ్వాలని కోరారు. ఈయూ రాష్ట్ర నాయకుడు పలిశెట్టి దామోదర్‌రావు మాట్లాడుతూ అన్నివిధాలా నష్టాల్లో ఉన్న సంస్థ స్థిరాస్తులు కూడా కోల్పోతే మరింత ఇబ్బందుల్లో పడటం ఖాయమన్నారు. ఉమ్మడి ఆస్తుల విషయంలో ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఎక్కడా రాజీ పడకుండా న్యాయంగా రావాల్సిన వాటాను రాబట్టాలన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి నీరు

- **వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు 23వేల కోట్లు: మంత్రి లోకేశ్**



అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా రోజుకు వంద లీటర్ల తాగునీటిని అందించే వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. రూ.23వేల కోట్లతో 12,920 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి నీరు ఇవ్వాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. దీనికి అవసరమైన నిధుల సమీకరణపై ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

కొనసాగుతున్న తనిఖీలు

- **డ్రగ్స్ కేసు డాక్యుమెంట్ రెడీ**
- **మరికొన్ని రోజులు విదేశీ పార్సిళ్ల పరిశీలన**
- **నార్కొటిక్ పరీక్షా ఫలితాలొచ్చాక చార్జిషీట్**

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసులో సోదాలు, తనిఖీలు కొనసాగుతున్నాయి. గురువారం విదేశాల నుంచి ఆరుగురికి వచ్చిన కొరియర్ పార్సిళ్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేసి.. ఆ తరువాత డెలివరీ చేశారు. కాగా, ఐటీ కంపెనీల ఉద్యోగుల విచారణకోసం సిట్ అధికారులు వేదికను కనిపెట్టే పనిలో ఉన్నట్లు తెలిసింది. ఐటీ శాఖ సూచన మేరకు మీడియా కంటపడని ప్రాంతంలోనే విచారించేందుకు సిట్ సిద్ధమవుతోంది. సినిమా వారిని అందరికీ తెలిసేలా, మిగతా వారిని గుట్టుగా విచారించడం ఏమిటి? అన్న ప్రశ్నలను ఎన్‌ఫోర్స్‌మెంట్ కొట్టిపారేస్తోంది. సినిమా వారికి, ఐటీ ఉద్యోగులకు పోలికే లేదని ఓ అధికారి స్పష్టం చేశారు. "సినిమా వారిని ప్రజలంతా అభిమానిస్తారు. వారిని తమ నిజజీవిత హీరోలుగా, మార్గదర్శకులుగా భావించుకుంటున్నారు. డ్రగ్స్‌కేసులో వారి గురించి స్పష్టత వచ్చాకే విచారణకు పిలిచాం. సహజంగా సినిమా వారు కావడంతో ప్రజల్లో ఆసక్తి వచ్చింది. కానీ ఐటీ ఉద్యోగులది అలా కాదు. డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు కొంతమందిని గుర్తించాం. అది పూర్తిగా నిర్ధారణ కావాల్సి ఉంది.” అని ఓ అధికారి చెప్పారు. ఇదిలా ఉంటే, చార్జిషీట్ దాఖలుకు అవసరమైన కేస్‌డైరీని సిట్ రూపొందించినట్లు తెలిసింది. విచారణలో భాగంగా పూరీ జగన్నాథ్‌తోపాటు పలువురి రక్తం, జుట్టు శాంపిల్స్ తీసుకున్నారు. ఈ పరీక్షా ఫలితాలు వచ్చిన తర్వాత చార్జిషీట్ రూపకల్పన పూర్తవుతుందని, ఇదంతా మరో వారంలో పూర్తికావొచ్చని తెలిసింది. ఇదిలా ఉంటే, శాంపిల్స్ ఇవ్వని వారి విషయంలో వారు డ్రగ్స్ ఉపయోగించారా? లేదా అన్నదానిపై ఇప్పటికే స్పష్టతకొచ్చారు. వారికయితే క్లీన్‌చిట్ ఇచ్చే అవకాశమే లేదని తెలిసింది.

• ఉద్యోగుల ఫ్యామిలీకీ చెకప్: కామినేని

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులతో పాటు వారి కుటుంబసభ్యులకు కూడా ఒకసారి హెల్త్ చెకప్ అవకాశం కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.230కోట్ల వరకూ భారం పడుతుందన్నారు. అలాగే జర్నలిస్టులకు కూడా ఒకసారి హెల్త్ చెకప్‌కు అవకాశం కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

• మెడ్‌టెక్‌పై ఆరోపణలు నిరాధారం: పూనం

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న మెడ్ టెక్ జోన్(ఎంటీజెడ్) నిర్మాణంలో అక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన ఆరోపణల్లో ఏ మాత్రమూ వాస్తవం లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మెడ్ టెక్ జోన్ ఏర్పాటుపై ఆ సంస్థ మాజీ ఉద్యోగి జూడిష్ రాజ్ బుధవారం విజయవాడలోని మీడియా సమావేశం చేసిన ఆరోపణల్లో ఏ మాత్రమూ వాస్తవం లేదన్నారు.

ఏపీబీసీఎల్ ఉద్యోగులకు 60 ఏళ్ల రిటైర్మెంట్

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీబీసీఎల్) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 60 ఏళ్లకు పెంచుతూ బోర్డు సమావేశంలో తీర్మానించినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులకు కూడా పదవీ విరమణ వయసును 60 సంవత్సరాలకు పెంచుతూ ఆ శాఖ కార్యదర్శి వి.రాములు ఉత్తర్వులు విడుదల చేశారు.

• కనీస వేతనాలపై కార్మికశాఖ కృషి: దత్తన్న

న్యూఢిల్లీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కనీస వేతనాలు పెరిగేలా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ వెల్లడించారు. వ్యవసాయ కూలీలకు ఇస్తున్న రూ.211 రోజుకూలిని రూ.300కి పెంచారని, వ్యవసాయేతర కార్మికులకు రూ.250 నుంచి రూ.350కి పెంచారని తెలిపారు.

ప్రాణాలు కాపాడితే బహుమతి!

- **రోడ్డు ప్రమాదాల నివారణకి కర్ణాటక నిర్ణయం**

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదం బారినపడి రక్తపు మడుగులో పడిఉన్నవారిని ఆదుకోవడం, అంబులెన్స్ పిలవడం, ఆస్పత్రికి తీసుకెళ్లడం మానవత్వం! అది మరిచి ఆ ప్రమాదస్థలిలో నిలబడి సెల్ఫీలు దిగడం, మొబైల్‌లో వీడియో రికార్డు చేసుకొనే తొందరలో ఉండేవారే ఎక్కువ! ఇలాంటివారికి వారి బాధ్యతని గుర్తు చేయడంతో పాటు, అందుకు ముందుకొచ్చేవారికి బహుమతులూ ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వం భావిస్తోంది. రూ.10 వేల నగదు పురస్కారం అందించాలని ఆలోచిస్తోంది. రోడ్డుప్రమాదంలో కొద్దికాలం క్రితం మృతి చెందిన హరీశ్ అనే యువకుడి ఉదంతం ప్రభుత్వాన్ని కదిలించింది. సత్వరం స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చి.. వారి ప్రాణాలు నిలిపినవారికి ప్రశంసా పత్రం అందించడానికి ‘సాంత్వన’ అనే పథకాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పథకం అమలవుతున్నా, దానికి అంతగా స్పందన లేదు. ఈ దృష్ట్యా ప్రశంసాపత్రానికితోడు.. ఇకనుంచి నగదు బహుమతి ఇవ్వాలనే ఆలోచనలో సిద్ధరామయ్య ప్రభుత్వం ఉంది. మంత్రిమండలిలో చర్చించి దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి కేఆర్ రమేశ్ కుమార్ తెలిపారు.

చర్చలకు పిలుపే లేదు... ఇక విలీనం ఎక్కడ?

- **అవినీతి ఊబిలో ఎడప్పాడి సర్కారు: పన్నీరు సెల్వం**

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని ప్రభుత్వం అవినీతి ఊబిలో కూరుకు పోయిందని మాజీ సీఎం పన్నీర్‌సెల్వం ఆరోపించారు. గురువారం ఉదయం ఆయన చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. అన్నాడీఎంకేలో రెండు వర్గాల విలీన చర్చలకు పళనిస్వామి శిబిరం నుంచి తమకు ఎలాంటి ఆహ్వానం అందలేదన్నారు. చర్చలకు ఆహ్వానమే లేనప్పుడు ఇక విలీనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని ప్రజలు భావిస్తున్నారని పన్నీరు సెల్వం అన్నారు. గత ఫిబ్రవరిలో అన్నాడీఎంకే శాసనసభ్యులు బసచేసిన కూవత్తూర్ రిసార్టులో ఐటీశాఖ దాడులు నిర్వహించి ఉంటే గుట్టురట్టయి ఉండేదని ఓపీఎస్ వ్యాఖ్యానించారు.

నవ్య
కుటుంబ కదంబం



వరం వయ్యారం!



వరలక్ష్మీ పూజ కోసం ఒక పక్క అమ్మలు వంటగదిలో ఫలహారాలు సిద్ధం చేస్తూ... పూజకు కావాల్సిన సామాగ్రినంతటినీ అమర్చుకునే పనిలో ఉంటే... మరోపక్క కూతుళ్లు తమకు వచ్చిన, నచ్చిన పనులు చేస్తూ అమ్మకు సాయంగా ఉంటారు ఇవ్వాళంతా. అయితే... 'ఎంత పనైనా మేం చూసుకుంటాం మీరు చక్కగా రెడీ అయ్యి పూజకు కూర్చోండి చాలు' అంటుంది అమ్మ. మన సారా లక్ష్మీదేవిని ఆరాధించే ఆ తల్లి మనసు.. కూతురిలో మహాలక్ష్మిని చూసుకుంటుంది. అందుకే అమ్మాయిలు కూడా రోజూవారీ వేసుకునే మోడ్రన్ డ్రస్‌లను పక్కన పెట్టి... అమ్మ మనసు మెచ్చేలా, అమ్మకు నచ్చేలా అచ్చ తెలుగింటి అమ్మాయిలా తయారవుతారు. ఈ ఫోటోల్లో ఉన్న అమ్మాయిలు కూడా అలానే పూజకు సిద్ధమయ్యారు.

సందర్భం- నేడు వరలక్ష్మీ వ్రతం

వరాలనిచ్చే మహాలక్ష్మి

తెలుగులోగిళ్లలో శ్రావణమాసానికీ, శ్రావణమాసంలో నోములకీ, వరలక్ష్మీ వ్రతానికీ ప్రత్యేక స్థానం ఉంది. దీనికో కారణం ఉంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువు శయనములోకి ప్రవేశించింది మొదలు నాలుగు మాసాలు ఎలాంటి హోమాలూ ఉండవు. కేవలం వ్రతాలు మాత్రమే ఉంటాయి. ఆషాఢం తర్వాత వచ్చే శ్రావణ మాసంలో వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి. ఈ పంటలకు 'ప్రకృతి స్వరూపిణి' అయిన మహాలక్ష్మి అనుగ్రహం ఉండాలనే ఉద్దేశంతో శ్రావణంలో ప్రత్యేక నోములు ఆచరించడం ఆనవాయితీగా మారింది.

'ప్రకృత్యైనమః' అనేది 'శ్రీ మహాలక్ష్మి' నామములలో మొదటిది. దేవీ భాగవతానుసారం లక్ష్మీదేవి, దుర్గాదేవి- ఇద్దరినీ ప్రకృతి స్వరూపాలుగా చెబుతారు. మన సంప్రదాయంలో నీటిని లక్ష్మి స్వరూపంగా భావిస్తారు. ప్రకృతిలోని ప్రతి అంశాన్నీ 'లక్ష్మీదేవి'గా చెప్పారు. అందువల్ల ప్రకృతి అనుగ్రహం కోసం దైవారాధన చేస్తుంటారు.

సౌభాగ్య ప్రదం

మహిళలు సౌభాగ్యం కోసం వ్రతాలను ఆచరిస్తారు. ఇక్కడ సౌభాగ్యం అంటే భర్త దీర్ఘాయుష్షు పొందడం ఒకటే కాదు! సంతానం, సంపాదన, ధాన్యం, ధైర్యం, ఆరోగ్యం, కుటుంబం, విద్య, విజయం- ఇలా లక్ష్మీదేవి ప్రసాదంగా లభించే అన్ని విశేషాలూ సౌభాగ్య ప్రదాలే. వరలక్ష్మీ వ్రతం ఆచరించడం వెనుక ముఖ్య ఉద్దేశం కూడా ఇదే. ఆదిలక్ష్మి, గజలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి.. వీళ్లందరూ అష్టలక్ష్ములు. వరలక్ష్మి కటాక్షం పొందకుండా అష్టలక్ష్ములను ప్రసన్నం చేసుకున్నంత మాత్రాన జీవితంలో సంతృప్తి పొందలేం. అందుకే శ్రావణ మాసంలో ప్రతి మహిళా వరలక్ష్మీ వ్రతం చేస్తుంటుంది.

ఇదీ విధానం!

సత్ప్రవర్తన కలిగిన వారిని వరలక్ష్మి వరిస్తుంది. అందుకే మంచి మనసున్న చారుమతి కథను పాటగా పాడుతూ ఈ వ్రతాన్ని జరుపుకుంటారు. వరలక్ష్మీవ్రతం నాడు పచ్చి బియ్యప్పిండితో చలిమిడి ఉండ్రాళ్లు చేసి వాయనంగా ఇస్తారు. 12 ఉండ్రాళ్లు అమ్మవారికి, 12 బ్రాహ్మణుడికి, 12 నైవేద్యంగా అమ్మవారికి సమర్పిస్తారు. వ్రతం ఆచరించిన మహిళ నైవేద్యంగా పెట్టిన 12 ఉండ్రాళ్లు తిని మిగిలినవి ముత్తయిదువులకు ఇవ్వాలి. తర్వాత ముత్తయిదువులందరికీ పూజ చేసి, వాళ్లనే వరలక్ష్మి అమ్మవారిగా భావిస్తూ వాయనం సమర్పించుకుని, దీవెనలందుకోవాలి. వాయనం ఇస్తున్నవారు 'ఇచ్చుకుంటినమ్మ వాయనం' అంటూ ఉంటే, పుచ్చుకున్నవారు 'పుచ్చుకుంటినమ్మ వాయనం' అంటూ దీవించాలి.

ఆరోగ్య రహస్యాలు

ఈ వ్రతాల్లో ఆచరించే కట్టుబాట్లు, నియమాలు చక్కటి వ్యాయామాన్నీ, ఆరోగ్యాన్నీ అందిస్తాయి. నైవేద్యంగా సమర్పించి ఆరగించే చలిమిడి చలువ చేస్తుంది. చలిమిడి గర్భధారణ అవరోధాలను తొలగిస్తుంది. వరలక్ష్మీవ్రతం రోజు వాయనంగా ఇచ్చే మొలకెత్తిన శెనగలు పోషక నిలయాలు. వీటిలోని మాంసకృతులు తక్షణ శక్తినిస్తాయి. అలాగే వర్షాకాలంలో పాదాలు ఎక్కువ సేపు తడిగా ఉండటం వల్ల ఇన్‌ఫెక్షన్లు కలుగుతుంటాయి. ఇలా ఇన్‌ఫెక్షన్లకు గురవ్వకుండా ఉండటం కోసమే కాళ్లకు పసుపు పూసుకోవటాన్ని ఈ వ్రతాల్లో భాగం చేశారు. ఆవు నెయ్యితో వెలిగించే దీపాల ద్వారా విడుదలయ్యే ధూపం వాయు కాలుష్యాన్ని హరిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రావణ మాసం రెండో శుక్రవారం నాడు ఆనవాయితీగా చేసే వరలక్ష్మీ వ్రతం ఐశ్వర్య ప్రదం! ఆరోగ్యకరం!!



వంటిల్లు

అమ్మకు నైవేద్యం

నేడు ప్రతి తెలుగింటి ఇల్లాలూ వరలక్ష్మీ వ్రతం చేసుకుంటుంది. 'భర్త, పిల్లాపాపల్ని చల్లగా చూడు తల్లీ' అంటూ అమ్మవారికి పూజలు చేస్తుంది. అమ్మవారికి ఇష్టమైన ప్రసాదాలు నైవేద్యం పెడుతుంది. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పెట్టే నైవేద్యాలలో కొన్ని మీ కోసం...

గారెలు



కావాల్సినవి: మినపప్పు-2 కప్పులు, ఉప్పు-తగినంత, నీళ్లు-6 కప్పులు, నూనె-తగినంత

తయారీ:

- మినపప్పు బాగా కడిగి, నీళ్లల్లో కనీసం రెండు గంటలు నానబెట్టాలి.
- మినపప్పు నానిన తర్వాత మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.
- గ్రైండ్ చేసిన పిండిలో ఉప్పు కలపాలి.
- పిండిని గ్రైండ్ చేసేటప్పుడు కొద్ది కొద్దిగా నీటిని కలిపితే చాలు... పిండి మెత్తగా అవుతుంది.
- నూనె వేడెక్కిన తర్వాత పిండిని వడల్లా చేసి అందులో వేయించాలి.
- చేతిని నీటితో తడిపి పిండిని వడలా చేసి నూనెలో వేగించాలి.
- వడ మధ్యలో చిన్న రంధ్రం చేయడం మరవొద్దు. గారెల ప్రసాదం సిద్ధం.

దధ్ధోజనం



కావాల్సిన పదార్థాలు: బియ్యం-1/2 కప్పు, నీళ్లు- 2 కప్పులు, పాలు- 3 టేబుల్ స్పూన్లు, గడ్డపెరుగు-1 కప్పు, ఉప్పు-తగినంత, నెయ్యి-1 టేబుల్ స్పూను, జీడిపప్పులు-10

తాలింపులోకి: నెయ్యి- 2 టీస్పూన్లు, ఆవాలు- పావు టీస్పూను, మినపప్పు-అర టీస్పూను, పచ్చి మిరపకాయలు-3, అల్లం- చిన్నముక్క, కరివేపాకు.

తయారీ:

- ప్రెషర్ కుక్కర్‌లో అన్నం వండుకోవాలి.
- చల్లారిన తర్వాత అన్నాన్ని మెత్తగా చేయాలి. అందులో పెరుగు, పాలు, ఉప్పు వేసి బాగా కలపాలి.
- పచ్చి మిరపకాయలు, అల్లం రెండింటినీ చిన్న చిన్న ముక్కలుగా తరగాలి.
- చిన్న మూకుడులో రెండు మూడు టీస్పూన్ల నెయ్యి వేసి, అందులో మినప్పప్పు, ఆవాలు వేసి బంగారు వర్ణంలోకి వచ్చేవరకూ వేయించి, రెడీగా పెట్టుకున్న పెరుగన్నంలో కలపాలి.
- తాలింపులో కరివేపాకు తప్పకుండా వేయాలి.
- దధ్ధోజనంలో వేయించిన జీడిపప్పులు కలిపితే మరింత రుచిగా ఉంటుంది. దధ్ధోజనం ప్రసాదం రెడీ.. వీటిని అమ్మవారికి నైవేద్యం పెట్టి, అందరూ ఆరగించండి మరి.

ఆంధ్రజ్యోతి నివేదన


శ్రీ రమణ కథామృతం

(గత వారం తరువాయి)

అతుల్యానాథేశ్వర ఆలయంలోకి పూజారితో పాటు వెళ్లిన వెంకటరామన్ ఒక మూలన కూర్చున్నాడు. కానీ, కొద్దిసేపటిలో ఆలయంలో కాంతిపుంజం వెలిసింది. ఆ కాంతి గర్భగుడి నుంచి వస్తోందేమోనని వెళ్లి చూశాడు. అక్కణ్నుంచి కాదని గ్రహించి తన స్థానంలోకి వెళ్లి, మళ్లీ ధ్యానంలో కూర్చున్నాడు.

ఇంతలో పూజారి తన పూజని ముగించుకొని ఆలయ ద్వారాన్ని మూయబోతూ కేక వేశాడు. "ఎవరక్కడ! ఆలయాన్ని మూసివేయాలి బయటకు వచ్చేయండి" అని. అప్పటికే వెంకటరామన్‌కి బాగా ఆకలి వేస్తోందేమో! తనకి కాస్త ప్రసాదం ఇవ్వమని పూజారిని కోరాడు. పూజారి మాత్రం చాలా కటువుగా "అదేం కుదరదు" అన్నాడు. సమీపంలోని (కీలూర్‌లో) ఉన్న విరాటేశ్వరాలయంలో కూడా దీపారాధన చేయాల్సిన తొందరలో ఉన్నాడు ఆ పూజారి. అతడి వెంట వెంకటరామన్ కూడా

శ్రీకృష్ణుడే వచ్చాడనుకొని..



వెళ్లాడు.

విరాటేశ్వరాలయంలోనూ పూజారి వరుస మారలేదు. రామన్ ప్రసాదం అడగడం.. ఆయన కాదనడం! రమణుని ...

... కూడా చేసింది. ఈలోగా రమణునికి ఒక సందేహం పట్టుకుంది.

(సశేషం)

● పింగళి సూర్య సుందరం

బలహీనులు! బలవంతులు!!



ధర్మపథం

ఒక దేశం గానీ, సమాజం గానీ, కుటుంబం గానీ, ఊరు గానీ.. ఐకమత్యంగా ఉంటేనే బలంగా ఉంటాయి. ఐక్యమత్యం లోపించినది ఏదైనా అంతరించి పోతుంది. కాలగతిలో కనుమరుగైపోతుంది.

వ్యక్తి కంటే సంఘ బలమే గొప్పదని బుద్ధుడు ఎప్పుడూ చెబుతూ ఉండేవాడు. కుల, మత, ప్రాంత భేదాలు సమాజాన్ని బలహీనపరుస్తాయని పదే పదే హెచ్చరించేవాడు. 'బహుజన హితాయ.. బహుజన సుఖాయ' అనేది బౌద్ధ ధర్మం. పక్షులన్నీ కలిసి ఒకే ...

... గ్రామంలో.. ప్రజల మధ్య గొడవలు రేగాయి. ఆ విషయం తెలిసి బుద్ధుడు తన భిక్షు సంఘంతో అక్కడికి వెళ్లాడు.

ఆ రాత్రి ఆకాశంలో మేఘాలు కమ్మాయి. పెనుగాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన కురిసింది. తెల్లారేసరికి వర్షం తగ్గిపోయింది. రాత్రి వీచిన పెనుగాలికి ఊరు చివరన ఉన్న మర్రిమాను ఒకటి కూలిపోయిందనే విషయం తెలిసింది. వందలాది ఊడలు దిగిన మహావృక్షం అది. గ్రామస్థులంతా కూలిపోయిన చెట్టు దగ్గరికి చేరుకున్నారు. ఆ ఊరికి దూరంగా ఒక మామిడి తోట ఉంది. ఆ తోటలో చెట్లు మరీ ...

... త్యంలో బలం వారికి అర్థమై.. గొడవలు మాని.. చక్కగా కలిసి జీవనం కొనసాగించారు.

● బొర్రా గోవర్ధన్

చెడు ఆలోచనలే నరకానికి ద్వారాలు

సృష్టికర్త మనకు ప్రపంచంలో ఎన్నో భాగ్యాలు ప్రసాదించాడు. మనం అడగకుండానే మన అవసరాలను తీరుస్తున్నాడు. సృష్టికర్త ఆజ్ఞలను శిరసావహించడానికి బదులు.. మన లాంటి తోటి మానవమాత్రుల ఆజ్ఞలను కళ్లు మూసుకొని పాటిస్తున్నాం. ప్రవక్తలు బోధించిన హితోక్తుల్ని తోసి పుచ్చి మనో వాంఛలకు బానిసలయిపోతున్నాము. సృష్టికర్త ప్రసాదించిన ...

సందేశం



... దాని పర్యవసానం మృత్యుముఖమే. అశ్లీలతల నుంచి సురక్షితంగా ఉండదలచినప్పుడు ముఖ్యంగా మన దృష్టిమీద నియంత్రణను కలిగి ఉండాలి.

● మహమ్మద్ వహీదుద్దీన్, సిద్దిపేట

నవజీవన వేదం


'కశ్చితర్థం వినిశ్చిత్య
లఘుమూలం మహోదయమ్
క్షిప్రమారభసేకర్మ
న దీర్ఘయసి రాఘవ'

ఈ పద్యానికి అర్థం ఇది. "ముందు డబ్బుందో, లేదో చూసుకోవాలి. ఎవరినో మభ్యపెట్టడానికో, సంతోషపెట్టడానికో పని చేయకూడదు. వాస్తవంగా రూపుదాల్చడానికి సరిపడే డబ్బుందా, లేదా చూసుకోవాలి. తరువాత తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించేలా ప్రణాళికలు వేసుకోవాలి. అప్పుడు పని వెంటనే మొదలు పెట్టాలి. మొదలుపెట్టిన పనిని దీర్ఘకాలం కొనసాగించాలి".

నీటిని మూటగట్టి పందిళ్లనమర్చె పంటలకు
నిండిన కుక్షి రవంత పంట నాలుగిళ్లకు పంచిపెట్టెను
ఫలింపవె సత్కృషి చిత్తశుద్ధియున్'

అక్కడ నీళ్లు లేవు, నదులు లేవు. వర్షాలు పడవు. ఉన్న నీటిని పొదుపుగా వాడాలి. అందుకోసం నీరు నేరుగా మొక్క వేరుకు అందితే చాలు కదా అని ఆలోచించారు. దాన్నే 'బిందు సేద్యం' అన్నారు. మనం నేర్చుకున్నదీ అక్కడి నుంచే! వాళ్లు పంటకు పందిరేసి రక్షించారు. వాళ్ల కడుపు నిండిన తరువాత పండిన పంటను నలుగురికీ పంచారు. అనేక రకాల పంటలను ఎగుమతి చేస్తున్న దేశాల్లో ప్రథమ స్థానాల్లో ఉంది ఇజ్రాయిల్. వాళ్లకు చిత్తశుద్ధి ఉంది. ఇంట్లో అందరూ కష్టపడతారు. మన దగ్గర ఒక్కరు కష్టపడితే నలుగురు కూర్చొని తింటారు.

చూసి నేర్చుకుందాం!




...

... బాధలన్నింటిని తట్టుకుని జాతిని పునర్నిర్మాణం చేసుకున్నారంటే ఎంత గొప్పవారండీ ఇజ్రాయిలీలు.

❖ ❖ ❖

'నీళ్లకు నోచనట్టి దయనీయ పరిస్థితి బట్టి
నేరుగా వేళ్లకు నీళ్లనిచ్చెడి వివేకము

... నీటిని పొదుపుగా వాడకపోతే దేశానికి ద్రోహం చేసినట్టుగా భావించాలి. అప్పుడు మనం ప్రతి వస్తువునూ జాగ్రత్తగా చూసుకుంటాం.



● డా. గరికిపాటి నరసింహారావు

దైవమార్గం

"నాకు అర్థం కాని చాలా విషయాలను నేను నమ్ముతాను. అత్యున్నత స్థాయికి చెందిన గణితశాస్త్రం నా మెదడుకు అందదు. అయితే గణిత శాస్త్రాన్ని నమ్ముతాను నేను" అన్నారు ప్రసిద్ధ క్రైస్తవ ప్రవక్త డీఎల్ మూడి. మరికొంత ముందుకు వెళ్లి "నా కళ్లకు కనిపించని దేన్నీ నేను నమ్మను" అన్న వ్యక్తితో.. "మరి మీ మెదడు మీకు కనిపించదు కదా! దాన్ని నమ్మరా?" అని ప్రశ్నించినట్టు ఆయన ఒక పుస్తకంలో రాసుకున్నారు.

యేసుక్రీస్తు పునరుత్థాన వార్త జెరూసలెంలో, గ్రామాల్లోనూ పాకింది. చాలామంది ఆ వార్తను విశ్వసించినా.. రోమా ప్రభుత్వానికి భయపడి, నమ్మ

నిజమైన నమ్మకం అంటే..?



నట్టుగా నటించారు. యేసుక్రీస్తు తిరిగి సజీవుడయ్యాడన్న వార్త పునాదిగా నూతన విశ్వాసుల సమాజం ఏర్పడి, అదే చర్చిగా మారింది. అయితే ఆయన శిష్యుల్లో ఒకరైన తోమా హేతువాద ధోరణులున్న, ఆచరణాత్మ ...

● సుశీల్ సందేశ్

గిరి కోనల్లో.. కన్నెపిల్లల కలల పండుగ

ప్రతి ప్రాంతానికీ, వర్గానికీ ఓ సంస్కృతి ఉంటుంది. ఆ సంస్కృతిని నిలబెట్టే పండుగలూ ఉంటాయి. అలాంటి పండుగే తీజ్ ఉత్సవం. తెలుగ రాష్ట్రాల్లోని గోర్ బంజారాలు పవిత్రంగా జరుపుకునే వేడుక ఇది. వర్షాలు నిండుగా కురవాలనీ, పంటలు దండిగా పండాలనీ కోరుతూ ప్రత్యేక పూజలు చేస్తారు. 'బతుకమ్మ' పండుగ తరహాలో చేసుకునే సాగే తీజ్ పండుగ శ్రావణ మాసంలో వస్తుంది. రేపటి నుంచి ఈ నెల 13 వరకు తొమ్మిది రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో ఈ గిరిజనోత్సవం జరగనుంది.

తీజ్ ఉత్సవం

హిందూ సంప్రదాయ పండుగలను ఘనంగా చేసుకునే గిరిజనులు (గోర్ బంజారాలు) సీత్లా, తీజ్ పండుగలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా తీజ్ పండుగలో సేవాలాల్ మహారాజ్, దండి మేరామ యాడీలను దైవ దూతలుగా కొలుస్తారు. పరమేశ్వరుడి ప్రేమను పొందడానికి పార్వతీ దేవి 107 జన్మలు ఎత్తిందనీ, 108వ జన్మలో శివుణ్ణి భర్తగా పొందిందనీ వీరి నమ్మకం. పార్వతీపరమేశ్వరుల పెళ్లి జరిగిన రోజుకు గుర్తుగా 'తీజ్ పండుగను తొమ్మిది రోజుల పాటు సంబరంగా జరుపుకుంటారు.

బుట్టల్లో గోధుమనారు

తండాల్లోని పెళ్లికాని అమ్మాయిలు తమ తల్లితండ్రులకు పంటలు బాగా పండాలనీ, బాగా అభివృద్ధి చెందాలనీ, భవిష్యత్తు బాగుండాలనీ, ప్రేమగా చూసుకునే భర్త రావాలనీ కోరుతూ.. దేవుళ్లను కొలుస్తారు. 'తీజ్' ...

చూర్మో ప్రసాదం

...

శివపార్వతుల కల్యాణం

...



ఉత్సవంలో రెండో రోజు యువతీ యువకులు 'చేలలో బోరడీ' ఆట ఆడుకుంటారు. యువకులు చేలల్లో ఉండే రేగుచెట్టును కర్రతో కదలిస్తుంటారు. కదిలే చెట్టు ముళ్లకు సెనగలను గుచ్చడం అమ్మాయిల పని. పాటలు పాడుతూ.. యువకులను మైమరిచేలా చేసి రేగుముళ్లకు సెనగలు గుచ్చి.. 'బో రడీ' ఆట ముగిస్తారు.

... తీసుకొస్తారు. ఆ మట్టితో శివ... పాటు స్త్రీ-పురుషుల ప్రతిమలు ... పార్వతుల విగ్రహాలను అలంకరి... ఘనంగా పెళ్లి జరిపిస్తారు. ... తండాలోని అన్ని ఇళ్లలో నుంచి ... సేకరించి వాటితో పాయసం ... లాల్ మహారాజ్‌కు బోగ్ ... గోధుమ నారు పెరిగి... చేరుస్తారు. ... బంజారాల వి...

● నవాజ్, మహబూబాబాద్

డైలీ సుడోకు - 143

		6	8	3				
2	8	3				1		5
7				9				
		2						
1	6			2			3	9
						5		
				5				3
3		5				8	4	6
				1	6	2		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 142 సమాధానం




బాలయ్య ఇమేజ్‌కి సరిపడే కథ

NBK102

నందమూరి బాలకృష్ణ హీరోగా 102వ చిత్రం గురువారం రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రారంభమైంది. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. నయనతార కథానాయిక. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి బోయపాటి శ్రీను క్లాప్‌నిచ్చారు. బి.గోపాల్ కెమెరా స్విచ్చాన్ చేశారు. క్రిష్ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ "పద్దెనిమిది ఏళ్ల తర్వాత తెలుగులో చేస్తున్న చిత్రమిది. గతంలో బాలకృష్ణతో సినిమా చెయ్యాలని రెండుమూడు సార్లు అనుకున్నా. అప్పుడు కుదరలేదు. లేట్ అయినాగానీ మంచి కథతో వస్తున్నా. ఈ కాంబినేషన్ కుదరడమే విజయానికి తొలిమెట్టుగా భావిస్తున్నా" అని అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ "బాలకృష్ణగారి 101వ సినిమా నేనే తియ్యాలి. ఆ అవకాశం మిస్ అయింది. మొదట చాలా కథలనుకున్నాం. వాటిలో ఏదొక లోపం ఉండటంతో వద్దనుకున్నాం. రత్నం చెప్పిన కథ మా అందరినీ ఆకట్టుకుంది. బాలయ్య తరహా గుండెను పిండే భావోద్వేగాలు, ప్రేమాభిమానాలున్న కథకు మాస్ అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. నయనతారతోపాటు మరో ఇద్దరు నాయికలు ఉంటారు. ఈ నెలాఖరు వరకూ ఫిల్మ్‌సిటీలో షూటింగ్ జరుగుతుంది. వచ్చే నెల 6 నుంచి కుంభకోణంలో.. తర్వాత వైజాగ్, హైదరాబాద్ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలతోపాటు పాటల్ని తెరకెక్కిస్తాం. బుధవారంతో బాలయ్య 101వ సినిమాకు గుమ్మడికాయతో కట్ చెప్పి.. గ్యాప్ లేకుండా 102వ సినిమాకు యాక్షన్ చెప్పారు. ఇదే ఎనర్జీతో షూటింగ్ పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని అన్నారు. "ఓ సినిమా అనుకుంటున్నా, కె.ఎస్.రవికుమార్ దర్శకుడు నువ్వేం చేస్తావో నాకు తెలీదు. మంచి కథ కావాలి' అని బాలకృష్ణగారు పిలిచి మరీ అడిగారు. రకరకాల కథలు అనుకున్నాక.. ఈ కథ కుదిరింది. ఆయనకు పర్ఫెక్ట్‌గా సరిపడే కథ ఇది" అని ఎం.రత్నం తెలిపారు. ప్రకాశ్‌రాజ్, మురళీమోహన్, అశుతోశ్ రానా బ్రహ్మానందం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సి.రాంప్రసాద్, సంగీతం: చిరంతన్‌భట్.

అమెరికా లైఫ్.. వైఫ్



శత్రఘ్న రాయపాటి, స్టెఫానీ, జోసెలిన్, రెబెకా, మిల్లిచ స్వీటెన్ కీలక పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'గ్రీన్‌కార్డ్'. రమ్స్ దర్శకుడు. శ్రీనివాస్ గుప్తా మోహన్.ఆర్, నరసింహ, నాగ శ్రీనివాసరెడ్డి నిర్మాతలుగా రూపొందిస్తున్న ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "అమెరికా వెళ్లి 'గ్రీన్‌కార్డ్' కోసం ఎన్ని తిప్పలు పడుతున్నారనే కథతో రూపొందుతున్న చిత్రమిది" అని అన్నారు.

'బంగారి బాలరాజు' ప్రేమకథ!



"ఎన్ని శతాబ్దాలు మారినా మారనిది ప్రేమ మాత్రమే. మా చిత్రంలోనూ బంగారి, బాలరాజు అనే జంట ఉంటారు. వారు తమ ప్రేమను త్యాగం చేసి చరిత్రలో నిలిచిపోతారా? లేక ప్రేమను గెలిపించుకుని చరిత్ర సృష్టిస్తారా? అనేది అసలు కథ" అని కోటేంద్ర దుద్యాల అన్నారు. ఆయన దర్శకత్వంలో నంది క్రియేషన్స్ పతాకంపై, చల్లా క్రియేషన్స్ సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం 'బంగారి బాలరాజు'. కె.ఎం.డి.రఫి నిర్మాత. ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో బుధవారం ఉదయం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి హీరో నాగ అన్వేష్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు సాగర్ క్లాప్‌నిచ్చారు.

నా సంతోషానికి కారణం సినిమా పరిశ్రమే!

- సురేశ్ కొండేటి



ఆది, హెబ్బా, రెజీనా, సురేశ్ కొండేటి

"నాగార్జునగారు ఇచ్చిన సలహాతో 'సంతోషం' అవార్డులను మొదలుపెట్టాను. అప్పటి నుంచీ స్టార్స్ హీరోలు అందిస్తున్న సపోర్ట్‌ను మర్చిపోలేను. నేను బతికినంత కాలం సంతోషం అవార్డులను అందజేస్తాను. ఈ నెల 12న అత్యంత వైభవంగా వేడుకను నిర్వహిస్తాం. ఈ సారి స్పెషల్‌గా ప్లాన్ చేశాం" అని 'సంతోషం' అధినేత సురేశ్ కొండేటి అన్నారు. 'సంతోషం' కర్టన్ రైజర్ వేడుక బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగింది. అవార్డుల లోగోను 'మా' అధ్యక్షుడు శివాజీరాజా, నాయిక రెజీనా విడుదల చేశారు. సంతోషం అవార్డులు 16వ ఏట అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉందని శివాజీరాజా అన్నారు. తాను కూడా ఓ సారి 'సంతోషం' అవార్డును అందుకున్నట్టు ఆది చెప్పారు. సురేశ్ ఎప్పుడు కలిసినా అవార్డుల గురించే మాట్లాడుతారని, తాను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో విన్న అవార్డుల్లో 'సంతోషం' అవార్డు ఒకటని రెజీనా చెప్పారు. సురేశ్ ఒన్ మేన్ ఆర్మీలా వేడుకను నిర్వహిస్తున్నారని సీనియర్ జర్నలిస్ట్ యు.వినాయకరావు అన్నారు. కష్టాన్ని నమ్ముకుని ఎదిగిన వ్యక్తి సురేశ్ అని సీనియర్ జర్నలిస్ట్ ప్రభు చెప్పారు. వేడుక ఘనంగా జరగాలని సినీ ప్రముఖులు కె.ఎస్.రామారావు, హెబ్బాపటేల్, ఏడిద రాజా, ఏడిద శ్రీరామ్, సురేశ్ కొండేటి పిల్లలు మహేశ్ కొండేటి, లక్ష్మీ కొండేటి ఆకాంక్షించారు.



ప్రతిపాదిత ఎన్‌హెచ్‌-9 రహదారి, దాని దిగువన జలమార్గంగా అభివృద్ధి పరచనున్న కొండవీటి వాగు

'కొండవీటి'కి కొత్త కళ!

(మొదటి పేజీ తరువాయి)

ముప్పును తప్పిస్తూనే, మరోపక్క రాజధానిలో పర్యావర ణహితమైన జలరవాణా వ్యవస్థను అభివృద్ధి పరచడం, అత్యద్భుత పర్యాటక ప్రదేశంగా వాగు, దాని పరీవాహక ప్రాంతాలను తీర్చి దిద్దడం లక్ష్యాలుగా ఈ ప్రణాళికను రూపొందించారు. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రధాన జాతీయ జలమార్గాల్లో ఒకటైన కృష్ణానదికి రాజధాని ప్రాంతాన్ని అనుసంధానించడమనే మరో ప్రధాన ప్రయోజనాన్ని కూడా ఈ ప్రాజెక్టు నెరవేర్చబోతోంది. దీనికి ఇప్పటికే సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో చేపట్టనున్న ఈ బహుళ ప్రయోజనకర పథకానికి సంబంధించిన టెండర్లను కొద్ది రోజుల్లో పిలిచేందుకు ఏడీసీ సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన రుణసహాయాన్ని అందించేందుకు ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రపంచ బ్యాంకు కొద్ది రోజుల్లో తుది పరిశీలనకు తన బృందాన్ని రాజధానికి పంపనుంది.

కొండవీటి వాగు ప్రాజెక్టు ప్రధాన విశేషాలు ఇవీ

- కొండవీటి వాగు రాజధానిలోని వివిధ ప్రదేశాలను తాకుతూ ప్రవహిస్తున్నప్పటికీ దాని వల్ల ముంపు బెడద తీవ్రంగా ఉండే నీరుకొండ వద్ద నుంచి కృష్ణాయపాలెం మీదుగా కృష్ణానదిలో కలిసే ఉండవల్లి వరకూ అంటే సుమారు 11 కిలోమీటర్ల పొడవునా ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. (వాగు కట్టడికి మిగిలిన చోట్ల కూడా దాని వెడల్పు, లోతు పెంచుతారు). ఈ 11 కిలోమీటర్ల మేర కొండవీటి వాగును మొత్తం 175 మీటర్ల వెడల్పున విస్తరిస్తారు. ఇందులో 115 మీటర్ల (సుమారు 350 అడుగులు)లో వాగు ప్రవహిస్తుంది. వాగుకు ఇరువైపులా 30 మీటర్ల చొప్పున పచ్చదనాన్ని అభివృద్ధి పరుస్తారు.
- జాతీయ జలరవాణా మార్గాల్లో కీలకమైన కృష్ణానదిని అనుసంధానించడం ద్వారా భవిష్యత్తులో దేశంలోని కాకినాడ, చెన్నై తదితర ప్రదేశాలతో జలమార్గం ద్వారా రాజధానికి సరకుల రవాణా పెద్దఎత్తున జరిగేలా ఈ వాటర్‌వే దోహదపడనుంది.
- కొండవీటి వాగు కట్టడికి ఉద్దేశించిన పలు చర్యల్లో భాగంగా నిర్మించనున్న నీరుకొండ రిజర్వాయర్ (0.4 టీఎంసీలు), కృష్ణాయపాలెం జలాశయం (0.1 టీఎంసీ)ల సాయంతో ఈ మార్గంలో నిరంతరం తగినంత నీరుండేలా చూస్తారు. భారీ వెడల్పు, లోతుతో రూపుదిద్దుకుంటున్నందున ఇందులో 100 టన్నుల సరకు రవాణా సామర్థ్యముండే బోట్లు సులభంగా ప్రయాణం సాగించగలుగుతాయి. వీటికి ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఈ మార్గంలో నిర్మించనున్న రోడ్డు వంతెనలను తగినంత ఎత్తున నిర్మిస్తారు.
- రాజధానిలోని పలు ప్రదేశాలకు అనుసంధానమై ఉండే ఈ జలమార్గం ద్వారా సౌకర్యవంతంగా చేరుకునేందుకు వీలుగా వాటర్ ట్యాక్సీలను నడుపుతారు.

అభివృద్ధికి 'గామన్' గ్రహణం

- పట్టాలెక్కని బెజవాడ-గుండుగొలను ప్రాజెక్టు
- ఐదేళ్లుగా అడుగు ముందుకు పడని వైనం
- విజయవాడ ట్రాఫిక్ కష్టాలకు సంపూర్ణ పరిష్కారం
- కీలక ప్రాజెక్టును గడువులతో గడిపేస్తున్న వైనం
- గామన్‌పై కేంద్రం కరుణ.. వెల్లువెత్తుతున్న విమర్శలు

విజయవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ- గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు.. నవ్యాంధ్ర అభివృద్ధికి ఎంతో కీలకమైనది. రాజధాని ప్రాంతమైన విజయవాడలో నానాటికీ తీవ్రమవుతున్న ట్రాఫిక్ కష్టాలను తీర్చటంతోపాటు, రాజధాని అమరావతిని ఉభయ గోదావరి జిల్లాలతో అనుసంధానం చేసే 'విజయవాడ-గుండుగొలను' రోడ్డు ప్రాజెక్టుకు మోక్షం కలగటం లేదు. ఈ ప్రాజెక్టును బీవోటీ విధానంలో దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ 'గామన్' ఐదేళ్లుగా పనుల ఊసే ఎత్తడం లేదు. రైతుల సహకారంతో అతి సునాయాసంగా 98శాతం భూ సేకరణ జరిగినా.. ఏళ్ల తరబడి పనులు ప్రారంభం కాని ప్రాజెక్టు బహుశా దేశంలో ఇదే కావచ్చు.

గుంటూరు జిల్లా కాజ నుచి కృష్ణానది మీదుగా ఎన్‌హెచ్ - 65ను ఎన్‌హెచ్ - 16తో అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టును అమరావతికి రాజమార్గంగా ఉపయోగించుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా గతంలో ఉన్న నాలుగు వరుసల ప్రతిపాదనను సవరించి ఆరు వరుసలుగా నిర్మించాలని ఆలోచన చేసింది. కృష్ణానదిపై నిర్మించబోయే ఐకానిక్ వంతెనను కూడా ఆరువరుసలుగా నిర్మించటానికి సిద్ధమైంది. ఈ సవరణలకు అయ్యే ఖర్చును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించేందుకు సమాయత్తమైంది. కాజ నుంచి గుండుగొలను వరకు విస్తరిస్తున్న రోడ్డు ప్రాజెక్టులో అంతర్భాగంగా రెండు బైపాస్‌లు ఉన్నాయి. గుంటుపల్లి మీదుగా సూరంపల్లి, బీబీ గూడెం, పెద అవుటపల్లి వరకు 48 కిలోమీటర్ల వరకు విజయవాడ బైపాస్ నిర్మించాల్సి ఉంది. విజయవాడ బైపాస్ వల్ల హైదరాబాద్ , ఖమ్మం జిల్లాల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను, చెన్నై నుంచి వచ్చే ట్రాఫిక్‌ను విజయవాడ బైపాస్ మీదుగా పెద అవుటపల్లికి డైవర్షన్ చేయవచ్చు. దీంతో విజయవాడలోకి లారీల రాకపోకలకు పూర్తిగా బ్రేక్ పడుతుంది. దీంతో బెజవాడ ట్రాఫిక్ కష్టాలకు ఉపశమనం లభిస్తుంది. హనుమాన్ జంక్షన్ నుంచి గుండుగొలను వరకు 42 కిలోమీటర్ల వరకు రెండో బైపాస్‌ను నిర్మించాల్సి ఉంటుంది.




విజయవాడ – గుండుగొలను రోడ్డు మ్యాప్

కీలక ప్రాజెక్టుపై కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యం

నవ్యాంధ్రకు ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టు విషయంలో కాంట్రాక్టు సంస్థ గామన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కాంట్రాక్టు సంస్థకు ఆర్థిక ఇబ్బందులలో ఉండటంతో కొంత మేర మట్టిలెవలింగ్ పనులు మాత్రమే చేసి పనులు ఆపేసింది. ఈ క్రమంలో కాంట్రాక్టు సంస్థకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు పదేపదే నోటీసులు జారీ చేశారు. అయినా పనులు చేపట్టకపోవటంతో గామన్ సంస్థను రద్దు చేయాలని సిఫారసు చేస్తూ ఢిల్లీలోని ఎన్‌హెచ్ ఉన్నతాధికారులకు ఇక్కడి అధికారులు నోట్ పంపించారు. దీని మీద తక్షణం చర్యలు తీసుకోవాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వ సూచనలతో ఆ సంస్థకు గడువు ఇచ్చారు. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆస్ట్రేలియన్ కంపెనీ బ్రూక్‌ఫీల్డ్‌తో పనులు చేయించేందుకు ప్రయత్నాలు చేసినా.. గామన్ నుంచి సహకారం లభించలేదు. మొత్తం మూడు విడతలుగా గడువు ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. ఆగస్టు 2 తో మూడో విడత గడువు కూడా ముగిసింది.

2017 నాటికే పూర్తి కావాల్సిన ప్రాజెక్టు

తొలుత కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్టును 2017 ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. విజయవాడ - గుండుగొలను రోడ్డు ప్రాజెక్టును 103.59 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.1684 కోట్లు. మార్చి 21 , 2012న ఈ సంస్థతో ఎన్‌హెచ్ ఒప్పందం చేసుకుంది. సెప్టెంబరు 1 , 2014 న ఎన్‌హెచ్ అపాయింట్ డేట్ ఇచ్చింది. గామన్ సంస్థకు ఎన్ని అవకాశాలు ఇచ్చినా పనులు చేపట్టకపోవడంతో ఈపీసీ విధానంలో టెండర్లు పిలవాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఈ నిర్ణయాన్ని కేంద్రం ఎంత వరకు అమలు చేస్తుందో చూడాలి. ఈపీసీ విధానంలో టెండర్లు పిలవాల్సి వస్తే ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు విలువ రూ.1600 కోట్లు కాగా మరో రూ.900 కోట్ల మేర వ్యయం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ లెక్కన రూ.2500 కోట్లకు ఈ ప్రాజెక్టు చేరుకుంటుందన్నమాట. కాంట్రాక్టు సంస్థ గామన్‌పై కేంద్ర ప్రభుత్వం అమిత ప్రేమ చూపుతోంది. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) టెర్మినేట్ చేయమని సిఫారసు చేసినా పట్టించుకోకుండా 'గామన్'కు గడువుల మీద గడువులు ఇస్తూ అవకాశాలను కల్పిస్తోంది. మరోవైపు రాష్ట్రానికి కీలకమైన ఈ ప్రాజెక్టు విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గామన్ సంస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిగా ఒత్తిడి తెచ్చి ఉంటే ఈ పాటికే అమరావతికి అత్యద్భుతమైన రాజమార్గం సాకారమై ఉండేది. రాష్ట్ర ప్రభుత్వానికి ఇది ఎంతో మైలేజీ తీసుకువచ్చేది.



అమరావతిలో 'మైస్ హబ్'!

- మెగా కన్వెన్షన్ సెంటర్, ఎగ్జిబిషన్లు, హోటళ్లు
- వాణిజ్య కలాపాలకు ఊపు

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయి సౌకర్యాలతో, అమరావతిని అగ్రశ్రేణి అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో కీలక అడుగుపడింది. 'మైస్ హబ్' నిర్మాణం కోసం 'ఆర్ఎఫ్‌క్యూ'లను(రిక్వెస్ట్ ఫర్ క్వాలిఫికేషన్) ఆహ్వానిస్తూ, ఏపీసీఆర్డీయే బిడ్లను పిలిచింది. 'మీటింగ్స్-ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్ అండ్ ఎగ్జిబిషన్స్' అనే పదబంధానికి సంక్షిప్త నామధేయమే 'మైస్'. మెగా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, ఎగ్జిబిషన్ సెంటర్, హోటళ్లు, వ్యాపార దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ తదితరాల సమాహారంగా.. మైస్ హబ్ రూపుదిద్దుకోనుంది. దీనికోసం రాజధానిలోని కీలక ప్రదేశంలో 42 ఎకరాలను కేటాయించారు. పీపీపీ విధానంలో ప్రీ క్వాలిఫికేషన్ బిడ్లను సీఆర్‌డీఏ పిలిచింది. దరఖాస్తులను సమర్పించేందుకు సెప్టెంబరు 25 వరకు గడువు ఇచ్చింది.

జన్మభూమికి సేవ!

- గ్రామసీమలతో ఎన్ఆర్ఐల అనుసంధానం
- ప్రతి కార్యక్రమంలో 30 శాతం భాగస్వామ్యం
- 1500 పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు
- మహా ప్రస్థానం, అంగన్‌వాడీలకూ నిధులు
- విరాళాలకు ఆన్‌లైన్, ఆదాయపన్ను రాయితీ



అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జన్మభూమి స్మృతులు, సొంతగడ్డపై మమకారం తీర్చుకునేందుకు...గ్రామంతో తిరిగి కనెక్ట్ అయ్యేందుకు వేలమంది ప్రవాసాంధ్రులు ముందుకొస్తున్నారు. ప్రభుత్వంతో కలిసి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు గ్రామాల్లో వెలుగులు నింపుతున్నాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యా శాఖలతో కలిసి ప్రవాసాంధ్రులు మూడు కార్యక్రమాలను అమలుచేస్తున్నారు. ప్రతి కార్యక్రమంలోనూ 70 శాతం ప్రభుత్వం, 30 శాతం ప్రవాసాంధ్రుల వాటా ఉంటుంది. డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటుకు ప్రవాసాంధ్రులు రూ.45వేలు ఇస్తే....రూ.1.05లక్షలు ప్రభుత్వం అందిస్తోంది. అదేవిధంగా అంగన్‌వాడీల భవన నిర్మాణాల కోసం రూ.3లక్షలు ప్రవాసాంధ్రులు, రూ.7లక్షలు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పెట్టుకొంటున్నాయి. మహాప్రస్థానం పేరుతో స్మశానాల అభివృద్ధినీ ఇదే తరహాలో చేపడుతున్నారు. ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం ప్రవాసాంధ్రుల పక్షాన ఈ కార్యక్రమాలన్నింటినీ సమన్వయం చేస్తున్నారు.

ఐదువేల డిజిటల్ పాఠశాలల దిశగా..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వీలైనంతగా, డిజిటల్ తరగతుల ఏర్పాటుకు ఒక కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెండు కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, పాఠ్యాంశాలు లోడ్‌చేసే ఏర్పాట్లు ఉండేలా డిజిటల్ క్లాస్‌రూమ్‌ని రూపొందించారు. ఒక్కో ప్రవాసాంధ్రుడు ఒక్కో గ్రామానికి లేక అంతకంటే ఎక్కువ గ్రామాల్లోని పాఠశాలల డిజిటలైజేషన్‌కు తోడ్పాటుని అందిస్తున్నారు. ఇప్పటికి రాష్ట్రంలో మొత్తం 1500గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటుచేశారు. రెండో విడతలో..మరో 630పాఠశాలల్లో ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మొత్తంగా ఐదువేల ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటుచేసేందుకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు ప్రవాసాంధ్రులు సిద్ధంగా ఉన్నారని కోమటి జయరాం తెలిపారు. డిజిటల్ తరగతుల ఏర్పాటు వల్ల పిల్లల్లో ఆసక్తి పెరిగినట్టు, ఫలితంగా పలుచోట్ల హాజరుశాతం బాగున్నట్టు విద్యాశాఖ తెలిపిందన్నారు. మరోవైపు డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏ పాఠశాలల్లో ఎంతమేర ఉపయోగిస్తున్నారు, ఎన్నిగంటలు ఉపయోగిస్తున్నారనేది ఎప్పటికప్పుడు సీఎం డ్యాష్‌బోర్డులో నమోదయ్యేలా అనుసంధానం చేశారు. బాగా ఉపయోగించిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఎంపికచేసి ప్రోత్సాహక బహుమతుల్ని కూడా ఇవ్వనున్నారు. మరోవైపు డిజిటల్ క్లాస్‌రూమ్ నిర్వహణపై ఉపాధ్యాయులకు మరింత అవగాహన కోసం.. ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థుల సహకారం తీసుకొంటున్నారు. పాఠశాల ఉన్న ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ప్రతి శనివారం సాయంత్రం అక్కడకు వెళ్లి శిక్షణ ఇస్తున్నారు. డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఉపయోగం విషయంలో తూర్పుగోదావరి జిల్లా ముందుంది. ఉపాధిహామీ పథకం అనుసంధానంతో అంగన్‌వాడీ భవనాలు, మహాప్రస్థానం కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు ఐదు వేల అంగన్‌వాడీ భవనాలకు తమ వైపునుంచి కూడా నిధులివ్వాలనే ఉద్దేశంలో ప్రవాసాంధ్రులు ఉన్నారు. ప్రవాసాంధ్రులు రూ.3లక్షలు విరాళం ఇస్తే...ఐదు లక్షల రూపాయలు ఉపాధి హామీ నుంచి, మరో రెండు లక్షల రూపాయలను స్త్రీ శిశు సంక్షేమ శాఖనుంచి ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్స్ నిర్వహించాలనే లక్ష్యానికి ఈ నిధుల జోడింపు ఉపయోగపడుతోంది. భవన నిర్మాణం పూర్తవడంతో పాటు...అక్కడ పిల్లలకు ఆట వస్తువులు, ఒక స్మార్ట్ టీవీ, ప్రీస్కూల్ నిర్వహణకు అవసరమైన ఇతర సామగ్రినీ ఈ మొత్తంతో సమకూరుస్తున్నారు. అదేవిధంగా పలుచోట్ల మహాప్రస్థానం పేరిటి స్మశానాలను అభివృద్ధి చేస్తున్నారు. దీనికోసం రూ.3లక్షలు ప్రవాసాంధ్రులు పెట్టుకొంటే, గ్రామీణాభివృద్ధి శాఖ రూ.ఏడు లక్షలు ఇస్తోంది. ఈ నిధులతో స్మశానాలకు ప్రహరీ గోడ నిర్మించడం, ఎలక్ట్రిక్ శవ దహన వాటిక ఏర్పాటు, నీటి కుళాయిల ఏర్పాటు లాంటి పనులు చేపడుతున్నారు.

ఏపీకి అమెరికాలో ఆఫీసు : కోమటి జయరాం

ఏపీ ప్రభుత్వం కోసం ఉత్తర అమెరికాలో ఒక కార్యాలయాన్ని నిర్వహిస్తున్నామని కోమటి జయరాం పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో కాకుండా తామే స్వచ్ఛందంగా అద్దె చెల్లించి, నడుపుతున్నట్టు చెప్పారు. "ఏపీకి చెందిన సుమారు 4 లక్షల కుటుంబాలు అమెరికాలో ఉంటున్నాయి. వీరిలో అత్యధికులు అవసరమైన సాయాన్ని తమ గ్రామాలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. వారికోసం 'ఆంధ్రప్రదేశ్ జన్మభూమి' అనే వెబ్‌సైట్ నిర్వహిస్తున్నాం. దీనిద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఎన్ఆర్ఐలు విరాళాలు అందించవచ్చు. 'ఏపీ జన్మభూమి' అనే సంస్థను అమెరికాలో రిజిస్టర్ చేశాం. విరాళాలిచ్చే వారికి ఆదాయపు పన్ను రాయితీ లభించేలా చూస్తున్నాం. సమీకరించిన నిధులను 'తానా' ద్వారా ఏపీకి పంపిస్తున్నా"మని కోమటి జయరాం వివరించారు.



మానవత్వం పరిమళించిన వేళ



బాధితులకు చెక్ అందిస్తున్న ధనుష్ దంపతులు

అన్నదాతకు అండగా..

125 రైతు కుటుంబాలకు ధనుష్ ఆర్థికసాయం

- ఒక్కొక్కరికి 50 వేలు అందజేత

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): "మాట్లాడే పెదవుల కన్నా సాయపడే చేతులే మిన్న" అనే నానుడిని తమిళ సినీ నటుడు ధనుష్ మరోసారి రుజువు చేశారు. వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోయిన, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థికసాయం చేసి తన గొప్ప మనసును చాటుకున్నారు. వర్షాభావంతో తమిళనాట తీవ్ర సంక్షోభం నెలకొనడంతో అక్కడి రైతులు ఏడాది నుంచి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనిపై పలు రైతు సంఘాలు పోరాడుతుండగా ధనుష్ మాత్రం తనదైన శైలిలో సహాయ చర్యలకు దిగారు. వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోయిన రైతు కుటుంబాలను గుర్తించేందుకు ఇటీవల ఓ కమిటీని ఏర్పాటు చేసిన ధనుష్... ఆ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు 125 రైతు కుటుంబాలకు రూ.50వేల చొప్పున నగదు అందించారు. తేని జిల్లా శంకరాపురంలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. మున్ముందు మరిన్ని రైతు కుటుంబాలను ఆదుకుంటానని ఈ సందర్భంగా ధనుష్ భరోసా ఇచ్చారు.

కిరోసిన్‌పైనా క్రమంగా సబ్సిడీ ఎత్తివేత



న్యూఢిల్లీ, ఆగస్టు 3: డీజిల్, వంటగ్యాస్‌పై క్రమంగా సబ్సిడీలు తగ్గిస్తున్న కేంద్రం ఇప్పుడు కిరోసిన్‌పై దృష్టి పెట్టింది. వంటగ్యాస్ తరహాలో నిర్ణీత రోజులకు సబ్సిడీ కిరోసిన్ ధర పెంచుకుంటూ మొత్తానికి సబ్సిడీ ఎత్తివేయాలని యోచిస్తోంది. పక్షానికోసారి సబ్సిడీ కిరోసిన్ ధరను పావలా చొప్పున పెంచుకుంటూ పోవాలని ఆదేశించింది. వాతావరణ కాలుష్యం లేని ఎల్పీజీ వంటి ఇంధనాల వాడకాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద నిరుడు రెండున్నర కోట్ల మంది ఉచిత దీపం కనెక్షన్లు ఇచ్చింది. కాగా, పెట్రోలు, డీజిల్ బంకుల డీలర్లకు చెల్లించే కమీషన్లను ప్రభుత్వ రంగ ఆయిల్‌కంపెనీలు పెంచాయి. పెట్రోలుపై 43 శాతం దాకా, డీజిల్‌పై 59 శాతం దాకా కమీషన్‌ను పెంచాయి. ఐవోసీ ఛైర్మన్ సంజీవ్ సింగ్ గురువారం ఈ విషయం చెప్పారు.

నో ప్రమోషన్ ప్లీజ్!!

- పదోన్నతి పేరెత్తితేనే హడలిపోతున్న అధికారులు
- జిల్లాలకెళ్లేందుకు నో.. సుదీర్ఘకాలంగా కమిషనరేట్‌లోనే
- దేవాదాయ శాఖలో వింత పరిస్థితి

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో పదోన్నతి కోసం ప్రతి ఉద్యోగి తహతహలాడతాడు. స్థాయితో పాటు జీతభత్యాలూ పెరుగుతాయి కాబట్టి ఎప్పుడెప్పుడు ప్రమోషన్ వస్తుందా అని ఉద్యోగులు ఎదురుచూడటం సహజమే. కానీ రాష్ట్రంలోని దేవాదాయశాఖలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. తమకు ఎక్కడ పదోన్నతి వస్తుందోనని కొందరు అధికారులు హడలిపోతున్నారు. ప్రమోషన్ వచ్చిన తర్వాత ఉండే పోస్టులు జిల్లాల్లోనే ఉంటాయి. ఏళ్ల తరబడి కమిషనరేట్‌లో పాతుకుపోయిన వారికి ఇక్కడి నుంచి వెళ్లడం సుతరామూ ఇష్టం లేదు. దీంతో తమకు ప్రమోషన్లు రాకుండా ఉండటానికి వీలైన ప్రయత్నాలు చేస్తున్నారు. దేవాదాయశాఖలో 2002 నుంచి అధికారి స్థాయి ఉద్యోగులకు పదోన్నతులు లేవు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని కారణాలను చూపుతూ అప్పట్లో కోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా ప్రమోషన్లు ఆగిపోయాయి. ఇతర శాఖలు మాత్రం కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకొని, సాంకేతిక ఇబ్బందులను తొలగించుకొని ప్రమోషన్లు ఇస్తున్నాయి. ఈ శాఖలో మాత్రం ఆ ఒక్క కారణం సాకుగా చూపించి ప్రమోషన్లు ఇవ్వడం లేదు.

భారీగా పెరిగిన తారతమ్యాలు

దేవాదాయశాఖలో అసిస్టెంట్ కమిషనర్(గెజిటెడ్ సూపరింటెండెంట్) స్థాయి అధికారులు ఆరుగురు ఉన్నారు. వారికి పదోన్నతులు వస్తే డిప్యూటీ కమిషనర్లు అవుతారు. ఆ స్థాయి పోస్టులు ప్రముఖ ఆలయాలు, జిల్లాల్లో ఉంటాయి. కానీ వారిలో ఎక్కువమంది కమిషనరేట్‌ను వదిలేందుకు ఇష్టపడట్లేదు. దీనివల్ల కింది స్థాయి ఉద్యోగులకు కూడా పదోన్నతులు దక్కడం లేదు. ఏళ్ల తరబడి పదోన్నతులు లేకపోవడంతో శాఖలో తారతమ్యాలు భారీగా పెరిగిపోయాయి. సుదీర్ఘకాలంగా ఉన్నవారిని బదిలీ చేయాలని దేవాదాయశాఖ మంత్రి పి.మాణిక్యాలరావు రెండేళ్ల కిందటే అధికారులను ఆదేశించారు. ఆ శాఖ ముఖ్యకార్యదర్శి జేఎస్వీ ప్రసాద్ కూడా మెమో జారీచేశారు. అయినా ఇంతవరకూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ప్రమోషన్లు ఇవ్వడానికి ఉన్నతాధికారులు సుముఖంగానే ఉన్నప్పటికీ కిందిస్థాయి అధికారులు దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. కాగా, సాంకేతికంగా ఉన్న ఇబ్బందులను తొలగించి ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని మంత్రి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయించారు.



సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై)	వెండి	రూపాయి Vs డాలర్	ముడి చమురు
▼ 238.86	▼ 67.85	▼ 30	▼ 385	▲	▲
32237.88	10013.65	28,550	37,525	63.69	52.62
		10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	కిలో (రూపాయల్లో)		బ్యారల్ ధర (డాలర్లలో..)

పతంజలి రెడీమేడ్ దుస్తులు

త్వరలో మార్కెట్లోకి.. తొలి ఏడాది రూ.5,000 కోట్ల వ్యాపారంపై కన్ను

ఆహార, ఆయుర్వేద, కాస్మెటిక్ ఉత్పత్తుల మార్కెట్లో అదరగొడుతున్న పతంజలి ఆయుర్వేద్.. రెడీమేడ్ దుస్తుల రంగంలోకి ప్రవేశించనుంది. త్వరలోనే ఈ కంపెనీ బ్రాండెడ్ దుస్తులు పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్నాయి. ఏ బ్రాండ్ పేరుతో దుస్తులను తీసుకురావాలన్న దానిపై ప్రస్తుతం కంపెనీ కసరత్తు చేస్తోంది. పురుషులు, మహిళలు, పిల్లలు ధరించే స్వదేశీ శ్రేణి దుస్తులను తీసుకురానున్నామని, తొలి ఏడాదిలో 5,000 కోట్ల రూపాయల అమ్మకాలను సాధించాలన్న లక్ష్యంతో ఉన్నామని పతంజలి ఆయుర్వేద్ ఉన్నతాధికారి ఎస్‌కె తిజరావాలా తెలిపారు. ప్రతి కేటగిరీలోనూ విభిన్న రకాల దుస్తులు ఉంటాయని, కష్టమర్లు చెల్లించే సొమ్ముకు తగిన విలువను ఇచ్చే దుస్తులు ఉంటాయని ఆయన చెప్పారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 250 ఎక్స్‌క్లూజివ్ రిటైల్ స్టోర్లలో పతంజలి దుస్తులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. తొలుత నేత దుస్తులు, నైట్‌వేర్, మెషిన్ మేడ్ దుస్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. సొంత స్టోర్లతో పాటు ఇతర భారీ మాల్స్‌లోనూ పతంజలి దుస్తులు అమ్ముతారని తెలుస్తోంది. ఇప్పటికే పతంజలి బిగ్‌బజార్‌తో ఒప్పందం కుదుర్చుకుని తన ఉత్పత్తులను విక్రయిస్తోంది. గత మే నెలనాటికి పతంజలి ఆయుర్వేద్ 10,561 కోట్ల రూపాయల టర్నోవర్‌ను నమోదు చేసుకుంది. వచ్చే ఐదేళ్ల కాలంలో దీన్ని పదింతలు పెంచుకోవాలన్న లక్ష్యంతో ఉంది.

బిఎండబ్ల్యు '320డి ఎడిషన్ స్పోర్ట్'

న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం బిఎండబ్ల్యు.. 320డి ఎడిషన్ స్పోర్ట్ కారును దేశీయ మార్కెట్లోకి తెచ్చింది. దీని ధర 38.60 లక్షల రూపాయలు (ఎక్స్‌షోరూమ్). 3 సీరిస్ మోడల్ పోర్ట్‌ఫోలియో విస్తరణలో భాగంగా ఈ మోడల్‌ను తెచ్చినట్టు కంపెనీ తెలిపింది. ఈ కార్లను చెన్నైలోని ప్లాంట్‌లోనే అసెంబుల్ చేస్తున్నారు. ట్విన్‌పవర్ టర్బో డీజిల్ ఇంజన్ కలిగిన ఈ కారు 190 హార్స్‌పవర్‌ను వెలువరుస్తుంది. గంటకు గరిష్ఠంగా 250 కిలో మీటర్ల వేగంతో ఇది దూసుకుపోతుందని కంపెనీ పేర్కొంది. ఆరు ఎయిర్ బ్యాగులు, బ్రేక్ అసిస్ట్‌తో యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఎబిఎస్), డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ (డిఎస్‌సి), సైడ్ ఇంపాక్ట్ ప్రొటెక్షన్ వంటి ఫీచర్లు ఈ కారులో ఉన్నాయని కంపెనీ ప్రెసిడెంట్ విక్రమ్ పవా తెలిపారు. ఎలక్ట్రానిక్ వెహికిల్ ఇమ్మొబిలైజర్, క్రాష్ సెన్సార్ వంటి అత్యాధునిక ఫీచర్లు కూడా ఈ కారులో ఉన్నాయని ఆయన చెప్పారు.



ధర రూ.38.60 లక్షలు

బంగారానికి భలే గిరాకీ

ద్వితీయ త్రైమాసికంలో 37 శాతం పెరుగుదల

167 టన్నులకు చేరిక.. డబ్ల్యుజిసి నివేదిక వెల్లడి



ముంబై: భారత్‌లో బంగారానికి గిరాకీ జోరుగా పెరిగింది. ఈ ఏడాది ద్వితీయ త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో బంగారం డిమాండ్ 37 శాతం పెరిగి 167.4 టన్నులకు చేరుకుంది. సీజనల్ డిమాండ్‌తో పాటు గ్రామీణ ప్రాంత సెంటిమెంట్‌లో పురోగతి వంటి అంశాలు పసిడి డిమాండ్ పెరుగుదలకు దోహదపడ్డాయని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యుజిసి) తన గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్ నివేదికలో తెలిపింది. గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో బంగారం డిమాండ్ 122.1 టన్నులు మాత్రమే ఉంది. ద్వితీయ త్రైమాసికంలో విలువపరంగా బంగారం డిమాండ్ 32 శాతం పెరిగి 43,600 కోట్ల రూపాయలకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది 33,090 కోట్ల రూపాయలుగా ఉంది.

రెండో త్రైమాసికంలో బంగారం డిమాండ్ పెరిగినప్పటికీ ఐదేళ్ల సగటుకన్నా తక్కువే ఉంది. జిఎస్‌టి అమలు నేపథ్యంలో చాలా మంది ముందస్తుగానే బంగారం కొనుగోళ్లకు దిగడం వల్ల డిమాండ్ పెరిగే అవకాశం ఏర్పడినట్టు డబ్ల్యుజిసి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ పిఆర్ సోమసుందరమ్ తెలిపారు. జువెలరీపై ఒక శాతం ఎక్సైజ్ సుంకాన్ని విధించడాన్ని నిరసిస్తూ ఆభరణాల తయారీదారులు సమ్మె నిర్వహించిన ఫలితంగా అమ్మకాలపై కొంత మేర ప్రభావం పడినట్టు ఆయన చెప్పారు. ఈ ఏడాది ద్వితీయ త్రైమాసికంలో దేశీయంగా జువెలరీ డిమాండ్ 41 శాతం పెరిగి 89.8 టన్నుల నుంచి 126.7 టన్నులకు చేరుకుంది. విలువపరంగా ఆభరణాల డిమాండ్ 36 శాతం వృద్ధి చెంది 24,350 కోట్ల రూపాయల నుంచి 33,000 కోట్ల రూపాయలకు చేరింది.

పెట్టుబడుల డిమాండ్‌లో 26 శాతం వృద్ధి

ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో బంగారంలో పెట్టుబడుల డిమాండ్ 26 శాతం పెరిగి 32.3 టన్నుల నుంచి 40.7 టన్నులకు చేరుకుంది. విలువపరంగా బంగారంలో పెట్టుబడుల డిమాండ్ 21 శాతం వృద్ధితో 8,740 కోట్ల రూపాయల నుంచి 10,610 కోట్ల రూపాయలకు చేరుకుంది. ఏప్రిల్-జూన్‌లో 29.6 టన్నుల బంగారాన్ని రీసైకిల్ చేశారు. ప్రజలకు నగదు అందుబాటులోకి రావడం, వర్షాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాలు వంటివి బంగారంపై సెంటిమెంట్ సానుకూలంగా మారేందుకు దోహదపడ్డాయని, ఫలితంగానే అక్షయ తృతీయ సందర్భంగా అమ్మకాలు పెరిగాయని సోమసుందరమ్ పేర్కొన్నారు.

ఇక ఈ ఏడాది ద్వితీయార్థం విషయానికొస్తే.. వ్యాపారులు, వినియోగదారులు జిఎస్‌టిని చెల్లించాల్సి వస్తున్నందువల్ల వర్షాలు మెరుగ్గా ఉన్నా వృద్ధి రేంజ్ బౌండ్‌గానే ఉండవచ్చని ఆయన చెప్పారు. పూర్తి సంవత్సరంలో బంగారం డిమాండ్ 650-750 టన్నుల వరకు ఉంటుందని భావిస్తున్నామన్నారు.

వడ్డీ రేట్లు నిదానంగా తగ్గుతాయ్..

- **ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ**



న్యూఢిల్లీ: వడ్డీ రేట్లు నెమ్మదిగా సహేతుకమైన స్థాయికి చేరుతాయని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. ఒకప్పుడు 14-15 శాతం ఉన్న వడ్డీ రేట్లు అంతర్జాతీయ మార్కెట్లో భారత్ పోటీ సామర్థ్యాన్ని దెబ్బతీశాయన్నారు. అంత ఎక్కువ స్థాయి వడ్డీ రేట్లకు రుణాలు తీసుకొని వ్యాపారాలు చేయడం సాధ్యంకాదని ఆయన చెప్పారు. రుణాలపై వడ్డీ రేట్లతో పాటు డిపాజిట్లపై కూడా రేట్లు తగ్గడం సహజమేనని అయితే వృద్ధులు, పదవీ విరమణ చేసిన వారి కోసం ఎల్ఐసి 8 శాతం వడ్డీ రేటుతో పెన్షన్ స్కీమ్ ప్రకటించిందని వివరించారు. లోక్‌సభలో గురువారం నాడు బ్యాంకింగ్ రెగ్యులేషన్ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొంటూ ఆయన పలు అంశాలను ప్రస్తావించారు.

అవినీతి నిరోధక చట్టమే అడ్డం...

మొండిపద్దుల సమస్య పరిష్కారానికి నిజాయితీగా కొన్ని చర్యలు తీసుకునేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నా, భవిష్యత్తులో దర్యాప్తు సంస్థల నుంచి ఎలాంటి ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తుందో అన్న భయంతో అడుగుముందుకు వేయడం లేదని ఆర్థిక మంత్రి జైట్లీ అన్నారు. నిజాయితీగా ఇప్పుడు తీసుకునే చర్యల వల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న భయం బ్యాంకర్లలో ఉందని ఆయన చెప్పారు. పిఎస్‌యు బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి పద్దుల సమస్య పరిష్కారానికి రాజకీయ ఏకాభిప్రాయం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. బ్యాంకులను దగా చేసినవారిని వదిలిపెట్టే సమస్యేలేదని స్పష్టం చేశారు.

చిట్ ఫండ్‌ల నియంత్రణకు చట్టం

చిట్‌ఫండ్ స్కీమ్‌ల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తేనుంది. బ్యాంకింగ్ రెగ్యులేషన్స్ బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పారు. ఇప్పటికే ప్రతి రాష్ట్రంలోనూ చిట్‌ఫండ్ వ్యాపార నియంత్రణకు చట్టాలున్నాయనీ, వీటికి తోడుగా కేంద్రం కూడా ఒక చట్టాన్ని ప్రవేశపెట్టనుందని ఆయన తెలిపారు. చిట్‌ఫండ్ కంపెనీల కారణంగా ఇన్వెస్టర్లు మోసపోతున్న ఉదంతాలను సభ్యులు ప్రస్తావించగా జైట్లీ ఈ విషయం వెల్లడించారు. మోసకారి సంస్థలు ఆపరేట్ చేసే చిట్‌ఫండ్ స్కీమ్‌కు కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

కొత్తగా చేసిన దివాలా చట్టాల ద్వారా మొండి బకాయిల వసూలుకు బ్యాంకులు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాయనీ, మరికొన్ని కేసుల్లోనూ ఈ చట్టాన్ని వినియోగించుకునేందుకు ఆర్‌బిఐ సిఫారసు చేసే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. బ్యాంకింగ్ రెగ్యులేషన్ బిల్లు వల్ల రుణాల ఎగవేతదారులపై దివాలా చట్టాన్ని ప్రయోగించాల్సిందిగా సిఫారసు చేసే అధికారం ఆర్‌బిఐకి లభిస్తుంది.

విస్తరణ బాటలో ఎస్ఎస్‌బి రిటైల్

ఈ ఏడాదిలో మరో 10 స్టోర్ల ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎస్ఎస్‌బి గ్రూప్‌నకు చెందిన ఎస్ఎస్‌బి రిటైల్.. హైదరాబాద్‌లో మరిన్ని స్టోర్లను ప్రారంభించే సన్నాహాల్లో ఉంది. ఇప్పటికే రెండు రిటైల్ మాల్స్‌ను నిర్వహిస్తున్న ఈ సంస్థ గురువారం చక్రిపురం, ఇసిఐఎల్‌లో రెండు రిటైల్ మాల్స్‌ను ప్రారంభించింది. అల్‌ఫైన్ బ్రాండ్ కింద సూపర్ మార్కెట్, కసబెనె బ్రాండ్‌తో ఫర్నీచర్ మాల్‌ను ఒకే చోట కంపెనీ నిర్వహిస్తోంది. ఎస్ఎస్‌బి వరల్డ్ షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా ఎస్ఎస్‌బి రిటైల్ ఇండియా డైరెక్టర్ అజయ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది చివరినాటికి హైదరాబాద్‌లో మరో 10 స్టోర్లను ప్రారంభించాలన్న లక్ష్యంతో ఉన్నామని, వీటి కోసం 25 కోట్ల రూపాయల పెట్టుబడి అవసరం ఉంటుందని చెప్పారు. తాము సొంతంగానే ఫర్నీచర్‌ను తయారు చేస్తున్నందు వల్ల ఇతర స్టోర్లలో అందుబాటులో ఉన్న ఫర్నీచర్‌కన్నా ధర తక్కువగా, నాణ్యత ఎక్కువగా ఉంటుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కె తారక రామారావు

హైదరాబాద్‌లో మిస్సైల్ తయారీ యూనిట్

- **ప్రారంభించిన కల్యాణి గ్రూప్, రఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్**
- **రూ.70 కోట్లతో ఏర్పాటు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంజనీరింగ్, ఫోర్జింగ్ రంగంలోని కల్యాణి గ్రూప్, ఇజ్రాయెల్ ప్రభుత్వ సారథ్యంలోని రఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్.. హైదరాబాద్‌లో యాంటీ టాంక్ గైడెడ్ మిస్సైల్ (ఎటిజిఎం) ప్రొడక్షన్ ప్లాంట్‌ను ప్రారంభించాయి. ఇరు సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కల్యాణి రఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్లాంట్‌ను తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు, భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి డేనియల్ కార్మన్, కల్యాణి గ్రూప్ చైర్మన్ బాబా ఎన్ కల్యాణి, రఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రెసిడెంట్ యోవ్ హర్ ఈవెన్ ప్రారంభించారు. 70 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌లో కల్యాణి గ్రూప్‌నకు 51 శాతం, రఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు 49 శాతం వాటాలున్నాయి. ఈ సందర్భంగా కల్యాణి గ్రూప్ చైర్మన్ బాబా కల్యాణి మాట్లాడుతూ.. ప్రైవేట్ రంగంలో ఏర్పాటు చేసిన తొలి ఆయుధ పరికరాల ప్లాంట్ ఇదని చెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ.. మేకిన్ ఇండియా ఆలోచనలకు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. భారత ప్రభుత్వం నుంచి ఆర్డర్లను అందుకున్న కొద్ది వారాల్లోనే భారత సైన్యానికి అవసరమైన స్పైక్ మిస్సైల్‌గా వ్యవహరించే ఎటిజిఎంను ఈ ప్లాంట్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. మిస్సైల్‌కు సంబంధించి అన్ని ఫీల్డ్ ట్రయల్స్ పూర్తయ్యాయని, 90 శాతం స్థానిక ఉత్పత్తులను ఈ మిస్సైల్‌లో ఉపయోగించినట్లు బాబా కల్యాణి వెల్లడించారు. 24 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ప్లాంట్‌ను కేవలం పది నెలల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ఇంటిగ్రేటెడ్ స్పైక్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ సిస్టమ్స్, స్పైస్ గ్లైడర్ బాంబ్స్‌ను ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. 2010లోనే యాంటీ టాంక్ గైడెడ్ మిస్సైల్స్ కోసం ప్రక్రియను ప్రారంభించగా 2014లో రఫెల్‌ను షార్ట్ లిస్ట్ చేసినట్లు ఆయన చెప్పారు. భారత సైన్యానికి అవసరమైన 321 స్పైక్ ఎటిజిఎం లాంచర్స్, 8,356 మిస్సైల్స్, 15 ట్రైనింగ్ సిమ్యులేటర్స్‌ను కల్యాణి రఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సరఫరా చేయాల్సి ఉంటుంది.

రక్షణ ఉత్పత్తుల హబ్‌గా హైదరాబాద్

పెట్టుబడులకు హైదరాబాద్ అత్యంత ఆకర్షణీయమైన నగరమని తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన రక్షణ సంస్థలు ఇక్కడ ఉన్నాయని, వీటికి అనుబంధంగా వందలాది అనుబంధ పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని చెప్పారు. టాటా ఏరోస్పేస్ మొదలుకుని చిన్న స్థాయి పరిశ్రమలు రక్షణ ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తూ హైదరాబాద్‌ను రక్షణ ఉత్పత్తుల హబ్‌గా మార్చాయని తెలిపారు. కాగా కల్యాణి గ్రూప్, రఫెల్ అత్యంత తక్కువ సమయంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి రికార్డు సృష్టించాయని అన్నారు.

మరో రూ.70 కోట్ల పెట్టుబడి...

ప్రస్తుతం ప్లాంట్ ఏర్పాటుకు 60-70 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టగా ఆర్డర్లకు అనుగుణంగా రానున్న సంవత్సరాల్లో మరో 70 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు బాబా కల్యాణి వెల్లడించారు. ఈ విభాగంలో దాదాపు 100 కోట్ల డాలర్ల వ్యాపార అవకాశాలున్నాయని చెప్పారు. భారత రక్షణ అవసరాలను తీర్చటంతో పాటు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 300 మందికి ఉపాధి లభించనుండగా పరోక్షంగా మరో వెయ్యి మందికి ఉపాధి లభించనుందని కల్యాణి చెప్పారు.

11,12 తేదీల్లో హైదరాబాద్‌లో ఫార్మాలిటికా 2017 సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత బల్క్ డ్రగ్ క్యాపిటల్ అయిన హైదరాబాద్‌లో నాలుగో ఎడిషన్ ఫార్మాలిటికా 2017 సదస్సును నిర్వహిస్తున్నట్లు యుబిఎం ఇండియా వెల్లడించింది. ఈ నెల 11, 12 తేదీల్లో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనున్న ఈ సదస్సులో అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ నిపుణులు పాల్గొంటున్నారని తెలిపింది. అనలిటికల్, బయో టెక్, లాబ్ ఎక్విప్‌మెంట్స్, లాబ్ కెమికల్స్, ఫార్మా మెషినరీ, ప్యాకేజింగ్ సబ్ సెక్టార్లకు చెందిన నిపుణులకు ఫార్మాలిటికా ఒక వేదికగా ఉంటుందని యుబిఎం తెలిపింది. దాదాపు 150 మంది ఎగ్జిబిటర్లు నాలుగో ఎడిషన్‌లో పాల్గొంటున్నారని పేర్కొంది

రూ.10 నాణాలు చెల్లుతాయ్: ఆర్‌బిఐ

హైదరాబాద్: పది రూపాయల నాణెం చెల్లుబాటు అవుతుందని భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) స్పష్టం చేసింది. విశాఖ జిల్లా అనకాపల్లికి చెందిన కొణతాల సాయిబాబు.. పది రూపాయల నాణాన్ని తీసుకోవడానికి వ్యాపారులు నిరాకరిస్తున్న విషయం, రెండు వేల రూపాయల నోటు రద్దు అవుతుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ ఆర్‌బిఐకి నేరుగా ఒక లేఖ రాశారు. దీనికి స్పందిస్తూ పది రూపాయల నాణెం చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, 2,000 రూపాయల నోటు ఉపసంహరణకు సంబంధించిన ఆలోచన ఉన్నట్టు తమకు తెలియదని ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయం పేర్కొంది. ఈ విషయాల్లో ప్రజలను జాగృతం చేసేందుకు చైతన్య సదస్సులు ఏర్పాటు చేయాల్సిందిగా బ్యాంకులను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయి బ్యాంకర్లతో తాము సమావేశం అవుతున్నట్టు తెలిపింది. ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేందుకు నాణాల మేళాలను నిర్వహించాలని కూడా సూచిస్తున్నట్టు పేర్కొంది.

ఫారెక్స్ రెమిటెన్స్ కోసం కోటక్ రెమిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆధార్ ఆధారిత ఇన్‌స్టంట్ ఫారెక్స్ రెమిటెన్స్ సొల్యూషన్స్‌ను కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రారంభించింది. బ్యాంకు వినియోగదారులు, వినియోగదారులు కాని వారి కోసం కోటక్ రెమిట్ పేరుతో ఆధార్ ఆధారిత సమీకృత ఔట్‌వార్డ్ ఫారెక్స్ రెమిటెన్స్ సేవలను అందించనున్నట్లు తెలిపింది. ఆధార్ సంఖ్య లేదా పాన్ నంబర్‌తో ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికి ఫారెక్స్ రెమిటెన్స్ సేవలను ఆఫర్ చేయనున్నట్లు పేర్కొంది.

ఎంసిఎక్స్‌తో మహీంద్రా అగ్రి ఒప్పందం

ముంబై: వ్యవసాయ సంబంధిత ధరల సమాచారాన్ని అందించేందుకు గాను మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎంసిఎక్స్), మహీంద్రా అగ్రి సొల్యూషన్స్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందంలో భాగంగా అన్ని కమోడిటీలకు సంబంధించిన ధరల సమాచారం, స్పాట్ ధర, ఫ్యూచర్ ధర, డిరైవ్డ్ డేటా (అనలిటిక్స్)ను ఎంసిఎక్స్ అందించనుంది. మైఅగ్రి గురు మొబైల్ అప్లికేషన్‌లో ఈ సమాచారమంతా అందుబాటులో ఉంటుందని ఎంసిఎక్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ మృగాంక్ పరంజపే తెలిపారు. మహీంద్రా అగ్రితో ఒప్పందం కారణంగా వ్యవసాయ వాల్యూ చెయిన్‌లో ఈ సమాచారం కింది స్థాయిలకు చేరుకోనుందని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి ధరల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేసేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని మహీంద్రా అగ్రి సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ అశోక్ శర్మ తెలిపారు.

Q1 ఫలితాలు

ఐఒసికి ఇన్వెంటరీ నష్టాల దెబ్బ

- **45 శాతం తగ్గిన లాభం**

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి 4,548.51 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభంతో (రూ.8,268.98 కోట్లు) పోల్చితే ఇది 45 శాతం తక్కువ. రిఫైనరీ ద్వారా వచ్చిన మార్జిన్లు ఇన్వెస్టరీ నష్టాల కారణంగా కరిగిపోయాయి. ఫలితంగానే లాభాలు సగానికి సగం తగ్గినట్టు కంపెనీ చైర్మన్ సంజీవ్ సింగ్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు తగ్గిన ఫలితంగా ఇన్వెంటరీ నష్టాలు పెరిగాయి. సమీక్షా త్రైమాసికంలో ఇన్వెంటరీ నష్టాల కారణంగా 4,042 కోట్ల రూపాయలు కోల్పోవాల్సి వచ్చింది. ప్రొక్యూర్‌మెంట్ తర్వాత, మార్కెటింగ్‌కు ముందు చమురు ధరలు తగ్గితే ఇన్వెంటరీ నష్టాలు వస్తుంటాయి. సమీక్షా త్రైమాసికంలో ప్రతి బ్యారెల్ క్రూడాయిల్‌ను ఇంధనంగా మార్చడం ద్వారా 4.32 డాలర్లు కంపెనీకి వచ్చాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో వచ్చిన మొత్తం 9.98 డాలర్లుగా ఉంది. క్రూడాయిల్ ఇన్వెంటరీ కారణంగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 2,033 కోట్ల రూపాయల నష్టం వచ్చింది. గతేడాది ఇదే కాలంలో ఇన్వెంటరీ లాభం 3,785 కోట్ల రూపాయలుగా ఉందని ఐఒసి డైరెక్టర్ (ఫైనాన్స్) ఎకె శర్మ తెలిపారు. ఇక కంపెనీ రాబడి సమీక్షా త్రైమాసికంలో 1,07,670 కోట్ల రూపాయల నుంచి 1,29,418 కోట్ల రూపాయలకు చేరుకుంది. కంపెనీ రుణ భారం 54,820 కోట్ల రూపాయల నుంచి 34,922 కోట్ల రూపాయలకు తగ్గింది.

భారీగా పెరిగిన కాగ్నిజెంట్ లాభం

అమెరికాకు చెందిన ఐటి సర్వీసుల దిగ్గజం కాగ్నిజెంట్ నికర లాభం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 86 శాతానికి పైగా పెరిగి 47 కోట్ల డాలర్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ 25.2 కోట్ల డాలర్ల లాభాన్ని ఆర్జించింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ రాబడులు 8.9 శాతం వృద్ధితో 367 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో పూర్తి సంవత్సరానికి రాబడికి సంబంధించిన వృద్ధి ఔట్‌లుక్‌ను 8-10 శాతం నుంచి 9-10 శాతానికి సవరించింది.

పవర్‌గ్రిడ్ లాభం రూ.2,052 కోట్లు

హైదరాబాద్: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ 2,052 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది (1,802 కోట్ల రూపాయలు)తో పోల్చితే నికర లాభం 14 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంల్చో కంపెనీ మొత్తం రాబడులు కూడా 18 శాతం వృద్ధి చెంది 6,259 కోట్ల రూపాయల నుంచి 7,390 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. త్రైమాసిక కాలంలో 1,640 కిలోమీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్స్‌ను చేర్చుకున్నట్లు పవర్‌గ్రిడ్ తెలిపింది. ఏప్రిల్-జూన్ కాలంలో 765 కెవి డి/సి వార్ధా-నిజామాబాద్ (ఇంటర్ రీజినల్ లింక్), 400 కెవి డి/సికాక్రాపర్-నవ్‌సారి సహా మరో రెండు లైన్లను ప్రారంభించినట్లు పేర్కొంది. కాగా 765కెవి నిజామాబాద్, 132 కెవి రోయింగ్, 132 కెవి టెజు సబ్‌స్టేషన్ల కార్యకలాపాలను ప్రారంభించినట్లు పవర్ గ్రిడ్ తెలిపింది.

బిఎస్ఇ లాభంలో 12 రెట్ల వృద్ధి

బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ) నికర లాభం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో 12 రెట్లు పెరిగి 523.70 కోట్ల రూపాయలకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బిఎస్ఇ ఆర్జించిన నికర లాభం 43.70 కోట్ల రూపాయలుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం 11 శాతం వృద్ధితో 142.73 కోట్ల రూపాయల నుంచి 158.38 కోట్ల రూపాయలకు చేరుకుంది. ఒక అనుబంధ సంస్థలో వాటాలను విక్రయించడం ద్వారా బిఎస్ఇకి ఒక్కసారిగా 461.75 కోట్ల రూపాయలు వచ్చాయి. ఫలితంగానే లాభాలు వృద్ధి చెందే అవకాశం ఏర్పడింది. అనుబంధ కంపెనీ సిడిఎస్ఎల్‌లో కొంత వాటాను బిఎస్ఇ విక్రయించింది.

జ్యోతి లాబ్ లాభంలో 46 శాతం క్షీణత

ఎఫ్ఎంసిజి సంస్థ జ్యోతి లాబొరెటరీస్ జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి 24.3 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికర లాభం (44.9 కోట్ల రూపాయలు)తో పోల్చితే ఇది 45.87 శాతం క్షీణించింది. సమీక్షా త్రైమాసికంలో నికర అమ్మకాలు కూడా 452.6 కోట్ల రూపాయల నుంచి 385 కోట్ల రూపాయలకు తగ్గాయి. జిఎస్‌టి అమలు నేపథ్యంలో నిల్వలను తగ్గించుకోవడానికి చేపట్టిన పనుల కారణంగా రాబడి తగ్గినట్టు జ్యోతి లాబొరెటరీస్ చైర్మన్, ఎండి ఎంపి రామచంద్రన్ తెలిపారు. గురువారం బిఎస్ఇలో కంపెనీ షేరు ధర 4.57 శాతం నష్టంతో 390 రూపాయల వద్ద ముగిసింది.

సేవల రంగానికి జీఎస్‌టీ షాక్

నాలుగు సంవత్సరాలు వెనక్కి.. జూలై పిఎంఐ 45.9 పాయింట్లు



న్యూఢిల్లీ: జీఎస్‌టీ ప్రారంభంపై నెలకొన్న గందరగోళం కారణంగా కొత్త ఆర్డర్లే లేకపోవడంతో జూలై నెలలో సేవల రంగం తిరోగమించింది. నిక్కీ ఇండియా పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) సర్వేలో ఈ విషయం తేలింది. తయారీ రంగంలో కూడా ఇదే ధోరణి కనిపించింది. సేవల రంగం ఉత్పత్తికి దర్పణం పట్టే పిఎంఐ జూలై నెలలో 45.9 పాయింట్లకు దిగజారింది. 2013 సెప్టెంబర్ తర్వాత పిఎంఐ ఈ స్థాయికి క్షీణించడం ఇదే ప్రథమం. జూన్‌లో ఇది 53.1 పాయింట్లుంది. నిక్కీ ఇండియా సేవలు, తయారీ రంగం సమీకృత ఇండెక్స్ కూడా జూలైలో 46 పాయింట్లకు దిగజారింది. 2009 మార్చి తర్వాత ఈ ఇండెక్స్ ఈ స్థాయికి దిగజారడం ఇదే ప్రథమం. పిఎంఐ 50 పాయింట్ల కన్నా పైన ఉంటే ఆ రంగం పురోగమనపథంలో ఉన్నదని, అంతకన్నా దిగజారితే తిరోగమనం ఆవరించిందని సూచిస్తుంది. ఆరు నెలల కాలంలో సేవల రంగం పిఎంఐ తిరోగమనం బాటపట్టడం కూడా ఇదే ప్రథమమని ఐహెచ్ఎస్ మార్కిట్ ప్రిన్సిపల్ ఎకనామిస్ట్ పొల్యానా డి లిమా అన్నారు. జీఎస్‌టీ ప్రవేశపెడుతున్న సందర్భంగా నెలకొన్న సందిగ్ధ వాతావరణంలో కొత్త ఆర్డర్లే రాలేదని, ఇదే తిరోగమనానికి కారణమని సర్వేలో పాల్గొన్నవారు తెలిపినట్టు ఆమె చెప్పారు. డీమానిటైజేషన్ తర్వాత జూలైలోనే తొలిసారిగా ప్రైవేటు రంగంలో కార్యకలాపాలు తిరోగమించాయని ఆమె అన్నారు. అయితే రానున్న 12 నెలల కాలంలో వ్యాపారం వృద్ధిపై సర్వీస్ ప్రొవైడర్లు ఆశావహంగానే ఉన్నారని ఆమె చెప్పారు. పురోగమిస్తున్న కొద్ది జీఎస్‌టీ ప్రయోజనకరంగానే ఉంటుందని, పరిస్థితి మెరుగుపడుతుందని వారు భావిస్తున్నారని చెప్పారు. జూలైలో ఏర్పడిన ఈ తిరోగమనం పరిమితి స్వభావంతో కూడినదేనని, త్వరలోనే కార్యకలాపాలు పుంజుకుంటాయని నోమురా చెబుతోంది.

గ్రామీణ డిమాండు పెరుగుతుంది : బోఫాఎంఎల్

ఖరీఫ్‌లో వ్యవసాయోదాయాలు పెరగడంతో రానున్న నెలల్లో గ్రామీణ డిమాండు పెరుగుతుందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ (బోఫా ఎంఎల్) అంచనా వేసింది. 2012 ప్రారంభం నుంచి గ్రామీణ డిమాండు విషయంలో ఆచితూచి వ్యవహరించిన తాము 2016 జూలై నుంచి బుల్లిష్ ధోరణి ప్రదర్శిస్తున్నట్టు పేర్కొంది. 2016 ఖరీఫ్ పంట ఆదాయాలు 23.3 శాతం పెరిగినా డీమానిటైజేషన్ కారణంగా డిమాండు దెబ్బతిన్నట్టు తెలిపింది. ఈ ఏడాది ఖరీఫ్ ఆదాయాలు గత జూలై కన్నా 5.3 శాతం మేరకు పెరుగుతాయని అంచనా ప్రకటించింది.



న్యూఢిల్లీ: సూపర్ బైక్‌లను తయారు చేస్తున్న ఇటలీ కంపెనీ డుకాటీ.. గురువారం భారత మార్కెట్లోకి స్క్రాంబ్లర్ కేఫ్ రేసర్ మోడల్‌ను విడుదల చేసింది. దీని ధర 9.32 లక్షల రూపాయలు (ఎక్స్ షోరూమ్). యూరో 4 నిబంధనలకు అనుగుణంగా తయారు చేసిన ఈ బైక్‌లో ట్విన్ సిలిండర్ 803 సిసి ఇంజన్ ఉంది. ఢిల్లీ ఎన్‌సిఆర్, ముంబై, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్, కోచి డీలర్‌షిప్‌ల వద్ద ఈ బైక్ లభిస్తుందని కంపెనీ పేర్కొంది. ఈ బైక్ అంతర్జాతీయ సంస్కృతిని భారత్‌లోకి తెస్తుందని భావిస్తున్నట్టు డుకాటీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సెర్గి కెనోవాస్ గార్సియా చెప్పారు. ట్రెంబో బ్రేకింగ్ వ్యవస్థ కలిగిన ఈ బైక్‌లో బాష్ 9.1 ఎంపి ఎబిఎస్ ఉంది.

డుకాటీ నుంచి స్క్రాంబ్లర్ కేఫ్ రేసర్

ధర రూ.9.32 లక్షలు

కొచ్చిన్ షిప్‌యార్డ్ సూపర్ సక్సెస్

మార్కెట్లో ఉన్న కొచ్చిన్ షిప్‌యార్డ్ పబ్లిక్ ఇష్యూకి ఇన్వెస్టర్ల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. గురువారం చివరి రోజు మార్కెట్ ముగిసే సమయానికి ఇష్యూ 76 రెట్లు ఓవర్ సబ్‌స్ర్కయిబ్ అయింది. ఇష్యూ పరిమాణం 3.39 కోట్ల షేర్లు కాగా 258.64 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. ఈ ఇష్యూ ద్వారా ప్రభుత్వ రంగంలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ 1468 కోట్ల రూపాయలు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. షేరు ధరల శ్రేణిని 424-432 రూపాయలుగా నిర్ణయించారు. క్యుఐబీల విభాగం 63.52 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషన్ ఇన్వెస్టర్ల విభాగం 288.87 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 8.28 రెట్లు ఓవర్‌సబ్‌స్ర్కయిబ్ అయ్యాయి.



బ్యాంకింగ్, ఆటో, రియల్టీ కుదేలు



- సెన్సెక్స్ 239 పాయింట్లు డౌన్

ముంబై: రెపో రేటును 0.25 శాతం తగ్గించిన ప్రతికే ద్రవ్యపరపతి విధాన సమీక్షలో భవిష్యత్ కోతపై ఆర్‌బిఐ ప్రకటించిన అప్రమత్త ధోరణి కారణంగా వడ్డీ రేట్ల ప్రభావం ఉండే బ్యాంకింగ్, రియల్టీ, ఆటో రంగాల షేర్ల వరుసగా రెండో రోజు కూడా భారీ నష్టాలు చవి చూడడం స్టాక్ ఇండెక్స్‌లను తిరోగమన పథంలోకి నెట్టింది. ఈ మూడు విభాగాలకు చెందిన షేర్లు 9 శాతం మేరకు నష్టపోయాయి. ఆర్‌బిఐ రెపో రేటు తగ్గించిందనే ఉత్సాహం కన్నా అప్రమత్త ధోరణి ప్రభావమే మార్కెట్ సెంటిమెంట్‌ను అధికంగా పడిం ది. రూపాయి మరింత బలపడి రెండేళ్ల గరిష్ఠ స్థాయిలో క్లోజయినా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరచలేకపోయింది. వడ్డీ రేట్లపై కేంద్రబ్యాంకు ప్రకటించిన వైఖరి రేట్ల ప్రభావం ఉండే విభాగాలపై ఒత్తిడిని పెంచిందని, భవిష్యత్‌పై ఆర్‌బిఐ తన తటస్థ వైఖరిని సడలించు వైఖరిగా మార్చి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు. మరోవైపు జూలై నెలలో సేవల రంగం పిఎంఐ నాలుగు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి దిగజారిందన్న వార్తలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. రెండో రోజు కూడా మార్కెట్ నష్టాల బాటలోనే నడవడంతో సెన్సెక్స్ 238.86 పాయింట్ల నష్టంతో 32237.88 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 67.85 పాయింట్లు నష్టపోయి 10013.65 పాయింట్ల వద్ద క్లోజయింది. ఒకదశలో కీలక స్థాయి 10000 కన్నా దిగువకు వచ్చి 9998.25 పాయింట్లను తాకింది.

- రియల్టీ షేర్లు అత్యధికంగా దెబ్బతిన్నాయి. యూనిటెక్ (8.88 శాతం), హెచ్‌డిఐఎల్ (2.80 శాతం), ఫీనిక్స్ మిల్స్ (1.78 శాతం) డిఎల్ఎఫ్ (1.48 శాతం) నష్టపోయాయి. రియల్టీ ఇండెక్స్ 0.73 శాతం నష్టపోయింది.
- పంజాబ్ నేషనల్ బ్యాంక్ (5.98 శాతం), బ్యాంక్ ఆఫ్ బరోడా (3.16 శాతం), యస్ బ్యాంక్ (2.42 శాతం), ఎస్‌బిఐ (2.24 శాతం), యాక్సిస్ బ్యాంక్ (2.01 శాతం) నష్టపోయాయి. బిఎస్ఇ బ్యాంకింగ్ ఇండెక్స్ 1.66 శాతం పతనమయింది.
- నష్టపోయిన ఆటో షేర్లలో టాటా మోటార్స్ (1.74 శాతం), మారుతి సుజుకీ (0.98 శాతం) ఉన్నాయి. బిఎస్ఇ ఆటో ఇండెక్స్ 0.66 శాతం నష్టపోయింది. నష్టపోయిన ఇతర షేర్లలో లుపిన్ (3.80 శాతం), కోల్ ఇండియా (3.36 శాతం) నష్టపోయాయి.

హిందుస్థాన్ కాపర్‌లో వాటాల విక్రయం.. ఖజానాకు రూ.400 కోట్లు

హిందుస్తాన్ కాపర్‌లో ప్రభుత్వం 6.83 శాతం వాటాను విక్రయించింది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు 400 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. రెండు రోజుల ఆఫర్ ఫర్ సేల్ గురువారంతో ముగిసింది. షేరు ధరను 64.75 రూపాయలుగా నిర్ణయించింది. ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ విభాగం పూర్తిగా సబ్‌స్ర్కయిబ్ అయింది. ఈ ఆఫర్‌తో హిందుస్తాన్ కాపర్‌లో ప్రభుత్వ వాటా 76.05 శాతానికి తగ్గుతుంది.

10000 దిగువన మరింత బలహీనం

టెక్ వ్యూ

నిఫ్టీ మైనర్ బలహీనతతో ప్రారంభమై 10100 కన్నా దిగజారి రోజంతా బలహీనతను కొనసాగించింది. చివరికి 10000 పాయింట్ల కన్నా పైనే అయినప్పటికీ దే కనిష్ఠ స్థాయిలో క్లోజయింది. ప్రస్తుతం కరెక్షన్ ధోరణిలో ఉన్న మార్కెట్ స్వల్పకాలిక ఓవర్ బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంటోంది. ప్రధాన ట్రెండ్ మాత్రం ఎగువకే ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ స్థాయిలో బలమైన కన్సాలిడేషన్ సాధించి బలంగా ముగియడం అవసరం.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం: 10100 మద్దతు: 9980

- ప్రధాన నిరోధం 10100. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి.
- మైనర్ మద్దతు స్థాయి 9980 కన్నా దిగజారితే కరెక్షన్ ట్రెండ్ కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 8900. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ కీలక స్థాయి 25000 కన్నా స్వల్పంగా దిగువన ముగిసింది. బలహీనత ఉండవచ్చునసేందుకు ఇది సంకేతం.

■ వి.సుందర్ రాజా

మిడ్‌సెషన్ నిస్తేజం

తిథి: శ్రావణ శుక్ల ద్వాదశి, దశమి **నక్షత్రం:** మూల రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 10077.10 (+62.60)

ట్రెండ్ మార్పు వేళలు: 2.19, 2.52

ధోరణి: గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 10.30 గంటల వరకు అదే ధోరణిలో ట్రేడయి ఆ తర్వాత 12.30 వరకు నిలకడగా ఉండి 12.40 నుంచి 2.45 మధ్యన నిస్తేజంగా ఉండవచ్చు. తిరిగి 2.50 మెరుగ్గా మారే ఆస్కారం ఉంది.

ఆస్ట్రో వ్యూ

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 10.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 2.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంత కన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10050, 10085

మద్దతు స్థాయిలు : 9975, 9940

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ బోనస్ ఇష్యూ

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల పునర్వ్యూహం కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా వాటాదారులకు బోనస్ షేర్లు జారీ చేసే విషయం వచ్చే వారంలో జరుగనున్న బోర్డు సమావేశంలో పరిశీలించనున్నట్టు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్‌సి) ప్రకటించింది. ఈ నెల పదో తేదీన డైరెక్టర్ల బోర్డు సమావేశం జరుగనున్నదని, ఆ సమావేశంలో ఇతర అంశాలతో పాటు బోనస్ ఇష్యూ విషయం కూడా పరిశీలిస్తారని బిఎస్ఇకి పంపిన సమాచారంలో తెలిపింది.

నారాయణ హృదయాలయలో వాటాల విక్రయం

ఆరోగ్య సంరక్షణ విభాగంలోని నారాయణ హృదయాలయలో 1.7 శాతం వాటాలను జెపి మోర్గాన్ మారిషస్ హోల్డింగ్స్, క్యాపిటల్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు విక్రయించాయి. గత నెల ఆరో తేదీన జరిగిన ఈ ఓపెన్ మార్కెట్ లావాదేవీలో ఒక్కో షేరును 299.93 రూపాయలకు విక్రయించాయి. డీల్ విలువ 104.29 కోట్ల రూపాయలు.

కల్పతరుకు రూ.1,081 కోట్ల ఆర్డర్

విద్యుత్ రంగంలోని కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ (కెపిటిఎల్) రైల్వే విద్యుదీకరణ పనులకు సహా 1,081 కోట్ల రూపాయల విలువ గల ఆర్డర్లు పొందినట్టు ప్రకటించింది. రైల్వే నుంచి 318 కోట్ల రూపాయల విలువ గల విద్యుదీకరణ, సిగ్నలింగ్, టెలి కమ్యూనికేషన్ ఆర్డర్ అందిందని, తమ రైల్వే కాంట్రాక్టుల విభాగం ఎప్పటికప్పుడు కొత్తఆర్డర్లు పొందుతూ వ్యాపారాల అభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నదని కెపిటిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ మోహనోత్ చెప్పారు. ఈ ఏడాది తమకు 3200 కోట్ల రూపాయల పైబడి ఆర్డర్లు వచ్చినట్టు ఆయన చెప్పారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	29,390	29,400	29,420	28,550	--
క్రితం ముగింపు	29,590	29,700	29,560	28,580	--
22 క్యారెట్లు	28,800	27,300	27,320	28,400	27,110
క్రితం ముగింపు	29,000	27600	27,410	28,430	27,270
వెండి (కిలో)	38,900	39,000	38,900	37,525	--
క్రితం ముగింపు	39,200	39,600	39,400	37,910	--

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	67.00	గోదావరి	67.00
కరీంనగర్	68.00	విజయవాడ	69.00
వరంగల్	67.00	గుంటూరు	70.00
మహబూబ్‌నగర్	67.00	ఒంగోలు	71.00
కర్నూలు	67.00	చిత్తూరు	79.00
విశాఖపట్నం	57.00	నెల్లూరు	79.00

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.70 నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	310.00	వరంగల్	312.00
విజయవాడ	308.00	చెన్నై	372.00
గోదావరి	308.00	నమక్కల్	360.00
బెంగళూరు	360.00	చిత్తూరు	365.00
విశాఖపట్నం	318.00	ముంబై	360.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.93	67.17
పౌండ్	76.56	88.81
యూరో	68.63	79.58
ఆస్ట్రేలియా డాలర్	45.95	53.18
బహ్రెయిన్ దినార్	156.95	179.77
కువైట్ దినార్	174.41	217.19
ఒమని రియాల్	153.58	175.75
సౌదీ రియాల్	15.40	18.26
సింగపూర్ డాలర్	42.88	50.80
యుఎఇ దిరమ్	15.76	18.43

ఎన్ఎస్ఇ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 567.4(567.8)11592
AARTIIND 914.55(930.65)46031
ABAN 179.75(182.25)399734
ABB 1409.85(1414.65)57741
ABFRL 174(177.55)223222
ABGSHIP 12.65(12.85)21108
ACC 1810.6(1772.1)891266
ADANIENT 137.75(141.95)2488880
ADANIPORTS 407.35(411.25)2541125
ADANIPOWER 32.5(33.2)8434608
ADANITRANS 124.4(126.95)223416
AEGISCHEM 187.3(189.4)88178
AHLUCONT 278.35(279.75)42248
AIAENG 1411.9(1422.75)14436
AJANTPHARM 1338.05(1374.6)209014
AKZOINDIA 1754.75(1764.95)7663
ALBK 71.35(73.85)2911007
ALLCARGO 169.8(172.05)66929
ALOKTEXT 3.25(3.4)6207794
AMARAJABAT 817.65(842.7)256160
AMBUJACEM 272.1(266.6)3813836
AMTEKAUTO 27.1(27.6)1072776
ANANTRAJ 59.5(62.4)1549064
ANDHRABANK 54.95(56.25)2261342
APARINDS 763.1(779.6)11886
APLLTD 530.5(539.5)84297
APOLLOHOSP 1267.55(1277.55)230588
APOLLOTYRE 270.85(277.75)5013187
ARVIND 363.5(367.4)854234
ASHIANA 187.25(186.65)37831
ASHOKA 179.65(185.4)45903
ASHOKLEY 108.9(109.35)7702651
ASIANPAINT 1146.1(1144.5)997619
ASTRAL 621.8(616.7)242487
ASTRAZEN 909.65(917.6)2007
ATUL 2119.6(2165.95)20217
AUROPHARMA 741.3(731.05)3436769
AVANTIFEED 1782.35(1724.85)276588
AXISBANK 506(516.9)4140945
BAJAJ-AUTO 2834.25(2802.9)325945
BAJAJCORP 419.2(417.5)34178
BAJAJELEC 328.25(329)444329
BAJAJFINSV 5115.05(5002.35)311578
BAJAJHIND 15.5(15.9)9260948
BAJAJHLDNG 2403.1(2413.35)68358
BALKRISIND 1594.1(1619.5)85028
BALLARPUR 16(16.2)1064306
BALMLAWRIE 248.9(253.95)171449
BALRAMCHIN 175.4(172.25)5063985
BANKBARODA 158.2(163.4)9337691
BANKINDIA 154.75(161.55)5438753
BASF 1451.05(1415.05)46796
BATAINDIA 621.5(585)8481663
BBTC 874.05(875.95)50298
BEML 1687.8(1706.5)330660
BERGEPAINT 247(250.75)381076
BFUTILITIE 363.15(373)260137
BGRENERGY 143.65(146.1)70482
BHARATFIN 822(842.1)1644149
BHARATFORG 1162.45(1156.35)836930
BHARTIARTL 424.2(415.85)2535067
BHEL 138.65(141.2)4474664
BHUSANSTL 67.35(70.2)476515
BIOCON 374.85(384.35)1579103
BIRLACORPN 949.85(950.1)38080
BLISSGVS 173.4(173.85)449603
BLUEDART 4174.2(4213.25)9727
BLUESTARCO 677.5(679.85)28044
BOMDYEING 79.4(82.15)780684
BOSCHLTD 24849.55(25029.75)19217
BPCL 490(486.3)6212375
BRFL 147.75(152.1)100200
BRIGADE 266.25(274.35)49887
BRITANNIA 3873.95(3864.1)74679
CADILAHC 546.25(540.8)751793
CANBK 347.6(360.25)2308310
CANFINHOME 2991.9(3073.1)96050
CAPF 764.1(780.65)474547
CARERATING 1629.55(1636.05)14326
CASTEXTECH 6.8(6.55)846945
CASTROLIND 391.75(396.4)781950
CCL 286.25(288.2)31139
CEATLTD 1903.65(1927.05)1184529
CENTRALBK 86.65(88.95)558115
CENTURYPLY 274.6(283.85)258705
CENTURYTEX 1178.3(1172.5)259867
CERA 2875.7(2906.25)4308
CESC 962.2(950.65)853776
CHAMBLFERT 138.4(141.4)1058256
CHENNPETRO 410.2(406.8)1577486
CHOLAFIN 1161.55(1174.3)105929
CIPLA 557.15(568.55)1065451
CLNINDIA 635.15(674.85)41562
COALINDIA 241.75(250.85)9661464
COLPAL 1083.3(1039.25)1577611
CONCOR 1179.75(1172.5)647280
COROMANDEL 457.4(451.15)395263
CORPBANK 48.9(49.95)281740
COX&KINGS 279.3(278.25)414078
CRISIL 1843.35(1844.15)13496
CUB 170.95(171.25)165543
CUMMINSIND 949.3(992.75)1144787
CYIENT 528.35(525.55)18382
DABUR 305.1(300.7)1518665
DALMIABHA 2615.55(2624.7)76793
DBCORP 377.7(379)123456
DBREALTY 40.25(42.55)1324562
DCBBANK 195.2(199.4)1172876
DCMSHRIRAM 388.5(388)203200
DEEPAKFERT 357.4(356.1)400632
DELTACORP 167.3(169.15)2049509
DEN 83.05(85.45)90354
DENABANK 33.3(34.05)977298
DHANUKA 759.55(760.45)14975
DHFL 450.85(460.8)1612049
DISHTV 79.15(81.6)4375287
DIVISLAB 670.05(669.05)604522
DLF 190.25(193.1)6009655
DREDGECORP 605.55(618.95)72862
DRREDDY 2323.95(2378.55)777585
DYNAMATECH 2369.35(2369.8)1730
ECLERX 1271.1(1282.25)4189
EDELWEISS 226.2(215)10264812
EICHERMOT 30726.05(31153.8)34412
EIDPARRY 330(334.75)270100
EIHOTEL 132.9(134.4)73634
ELECTCAST 29.35(32.3)627197
ELGIEQUIP 222.75(226.7)15767
EMAMILTD 1140.9(1105.05)883600
ENGINERSIN 159.7(162.95)1830509
EROSMEDIA 206.9(214.6)897201
ESCORTS 677.4(694.75)961756
ESSDEE 37.05(37.95)21171
ESSELPACK 246.85(241.95)75678
EVEREADY 305.65(295.65)220721
EXIDEIND 222.15(221.95)2188652
FCONSUMER 39.8(41.5)7510471
FDC 178.8(179.95)7832
FEDERALBNK 113.4(114.8)9066621
FINCABLES 475.65(480)29127
FINPIPE 591.5(603.75)67712
FLFL 314.85(319.45)38846
FORTIS 163.3(153.3)22100914
FSL 33.9(35.2)2350691
GAIL 370.55(369.9)1334233
GATI 116.05(118.1)362108
GDL 270.05(272.55)402586
GEPIL 706.25(712.65)13564
GESHIP 387.95(388.95)49102
GET&D 381.75(393.9)136154
GILLETTE 5261.55(5216)1566
GLAXO 2361.5(2367.65)5792
GLENMARK 702.3(703.3)925857
GLOBOFFS 37.4(36.3)23059
GMDCLTD 139.3(140.9)356001
GMRINFRA 17.9(18.5)28780056
GODFRYPHLP 1056.3(1091.45)102365
GODREJCP 970.15(920.25)6342025
GODREJIND 654.45(647.65)633249
GODREJPROP 499.9(505.1)253320
GPPL 140.95(144.15)281967
GRANULES 132.25(136.3)930517
GREAVESCOT 159.3(160.15)314611
GREENPLY 265.2(266.7)682665
GRINDWELL 417.1(417.55)9563
GRUH 502.15(503.2)119679
GSFC 136.85(137)4288299
GSKCONS 5417.5(5440.6)5565
GSPL 187.7(185)246523
GUJFLUORO 779.2(792.65)26818
GUJGASLTD 748(756.95)24348
GULFOILLUB 805.35(808.75)62090
GVKPIL 12.1(12.6)20287433
HATHWAY 31.95(32.65)197797
HAVELLS 486.15(472.8)2145689
HCC 40.85(40.85)14049324
HCL-INSYS 46.9(47.7)695714
HCLTECH 875.75(882)1272005
HDFC 1736.75(1766.4)3975454
HDFCBANK 1779.95(1791.65)1064196
HDIL 83.5(85.85)8430465
HEIDELBERG 127(128.3)89270
HEROMOTOCO 3838.35(3802.6)424548
HEXAWARE 246.5(249.75)948075
HFCL 16.75(17.35)3424396
HIMATSEIDE 333.65(342.2)221790
HINDALCO 220.95(228.2)10254636
HINDCOPPER 62.35(65.05)5954936
HINDPETRO 396.8(385)9960727
HINDUNILVR 1169.9(1168.75)597333
HINDZINC 282.7(283.8)825082
HMT 36.5(36.7)140
HMVL 274.4(274.05)12579
HONAUT 12374.05(12286.7)170
HOTELEELA 23.3(24)1099818
HSIL 357.4(361.8)102605
HTMEDIA 86.8(88.45)153156
IBREALEST 241.4(236.45)13863018
IBULHSGFIN 1199.75(1195.75)1153794
ICICIBANK 295.7(301.85)14389817
ICRA 3817.3(3891.85)14745
IDBI 56.65(59.25)3053102
IDEA 93.25(92.35)10304736
IDFC 56.95(58.2)3419930
IFBIND 692.15(700.45)3972
IFCI 25.9(26.5)3992609
IGARASHI 970.2(973.8)10311
IGL 1184.45(1176.9)314099
IIFL 589.15(596)131543
IL&FSTRANS 89.65(90.35)284232
INDHOTEL 126.9(129.3)146702
INDIACEM 192.45(200.75)6845546
INDIANB 298.6(311.55)1145961
INDOCO 200.05(202.05)434859
INDUSINDBK 1645.2(1658.75)462668
INEOSSTYRO 1026.2(1049.25)13193
INFRATEL 403.95(397.85)3426255
INFY 984(993.35)2320174
INGERRAND 833.7(857.5)36982
INOXLEISUR 251.65(254.95)39230
INOXWIND 135.5(134.85)254823
INTELLECT 110.55(112.8)182992
IOB 24.6(25)788728
IOC 387.05(370.1)17149615
IPAPPM 310.65(315.45)17333
IPCALAB 467.95(478.6)29527
IRB 220(225.85)1427243
ITC 281.4(285.45)10199231
J&KBANK 80.85(82.35)142397
JAGRAN 178.3(177.2)57298
JAICORPLTD 81.1(83.6)565417
JBCHEPHARM 313.6(313.55)123727
JBFIND 192.3(204.9)352000
JCHAC 2019.75(2044.05)4057
JETAIRWAYS 588.15(591.35)1121303
JINDALPOLY 401.2(400.7)80737
JINDALSTEL 142.1(158.4)28593865
JISLJALEQS 101.6(104.5)2602834
JKCEMENT 1007.2(1008.2)10402
JKIL 289.95(291.8)62851
JKLAKSHMI 454.15(455.15)28103
JKTYRE 163.4(169.1)2625694
JMFINANCIL 123.4(120.3)1296270
JPASSOCIAT 25(25.95)204551255
JPINFRATEC 19.9(20.5)8606310
JPPOWER 6.6(7.05)25219065
JSWENERGY 67.05(69.65)4898056
JSWHL 1903.8(1742.05)179361
JUBILANT 715.3(712.8)215426
JUBLFOOD 1254.8(1280.75)541181
JUSTDIAL 356.9(365.35)1300785
JYOTHYLAB 391.55(375)559173
KALPATPOWR 351.9(354.2)134146
KANSAINER 451.15(457.5)104311
KEC 303.95(298.3)1204652
KESORAMIND 137.95(140.2)164223
KIRLOSENG 400(400)12804
KITEX 257.55(262.5)62799
KOLTEPATIL 159.8(163.85)74043
KOTAKBANK 996.4(1010.9)1152115
KPIT 126.1(128.15)635727
KRBL 448.45(454.6)146989
KSCL 694(690.2)782867
KSK 7.9(8.25)1651473
KTKBANK 149.2(152.9)2384514
KWALITY 133.35(137.75)806394
L&TFH 170.9(175.35)3990422
LAKSHVILAS 176.95(178.45)1064471
LAOPALA 508.4(510.65)5003
LAXMIMACH 5793.85(5874.25)6360
LICHSGFIN 681(693.15)2258508
LITL 1.3(1.35)2715766
LT 1174.75(1176.8)1426006
LUPIN 993.4(1034.95)7852897
M&M 1416.5(1414.6)563019
M&MFIN 395.1(399.9)2243319
MAGMA 172.25(170.2)760138
MAHINDCIE 241.95(246.1)380990
MAHLIFE 422.2(423.85)21241
MANAPPURAM 102.7(106.15)3082480
MANPASAND 788.3(793)19118
MARICO 327.8(326.1)3186048
MARKSANS 41.45(42.3)1290758
MARUTI 7737.4(7795.5)287116
MAYURUNIQ 359.55(359.85)28034
MCDOWELL-N 2611.7(2598.3)435511
MCLEODRUSS 177(176.95)70631
MERCK 1255.85(1244.9)19704
MHRIL 379.25(388.65)110438
MINDACORP 103.7(104.3)82191
MINDTREE 465.9(473.3)215576
MMTC 57.8(59.55)465539
MOIL 333.2(340.15)357673
MONSANTO 2687.05(2711.35)4108
MOTHERSUMI 331.05(333.15)2180725
MOTILALOFS 1085.65(1086.5)135046
MPHASIS 601.35(598.8)85924
MRF 69150.4(70810.4)14610
MRPL 128(128.05)2679182
MTNL 19.85(20.65)1059475
MUTHOOTFIN 453.9(464.45)600109
NATCOPHARM 968.65(963)76291
NATIONALUM 66.5(69.6)2772907
NAUKRI 998.6(999.25)105641
NAVKARCORP 197.2(201.15)21239
NCC 88.6(90.35)3714447
NETWORK18 53.9(54.35)382872
NHPC 29.85(30.1)3577315
NIITTECH 502.05(510.6)349679
NITINFIRE 6(6.2)2256453
NLCINDIA 99.05(100.8)538517
NMDC 121.3(124.05)2167755
NTPC 172.55(171.85)6035392
OBEROIRLTY 386.6(379.95)102810
OFSS 3615.75(3639)20033
OIL 285.25(282.05)354716
OMAXE 203.25(202.55)632548
ONGC 165.7(165.4)6902925
ORIENTBANK 138.1(143.95)3239120
ORIENTCEM 154.2(152.65)175000
ORISSAMINE 1871.9(1961.75)10984
PAGEIND 16380.7(16936.8)18144
PARSVNATH 21.75(22.5)404556
PCJEWELLER 253.95(255.4)667048
PEL 2902.1(2912.05)211729
PERSISTENT 634.9(646.35)92849
PETRONET 208.4(212.95)6161170
PFC 126.3(122.2)10375986
PFIZER 1780.85(1800.65)21394
PFS 40.4(40.75)581124
PGHH 8015.15(8015.1)838
PHOENIXLTD 484.05(497.5)244624
PIDILITIND 806.85(800)314026
PIIND 729.15(757.4)247320
PNB 149.3(158.95)19702626
POLARIS 230.05(231.25)55102
POWERGRID 222.95(221.8)2973119
PRAJIND 74.35(75.65)218175
PRESTIGE 273.1(270.9)148083
PRISMCEM 117.45(119.25)72907
PTC 116.95(118.75)1826341
PUNJLLOYD 20.75(20.6)2132630
PURVA 74.65(75.1)175699
PVR 1374.05(1377.65)202693
RADICO 145.3(149.3)670380
RAIN 129.7(128.25)1822841
RAJESHEXPO 729.55(729.25)317089
RALLIS 244.3(244.75)186349
RAMCOCEM 688.25(699.1)343710
RAMCOSYS 401.85(434.75)150971
RATNAMANI 836(836.7)60200
RAYMOND 763.6(776.7)524470
RCF 97.5(96.85)8751315
RCOM 23.1(25)33210562
RDEL 58.25(59.75)1793658
RECLTD 173.5(172.2)6713413
REDINGTON 145.55(146.8)288798
RELAXO 459.2(463.6)45448
RELCAPITAL 722.7(730.45)2232880
RELIANCE 1650.1(1629.2)4504776
RELINFRA 526.25(532.35)2532498
RENUKA 18.6(18.75)6997960
REPCOHOME 734.4(760.25)86440
RIIL 450.8(459.75)274159
RKFORGE 559.35(573.5)45331
ROLTA 57.1(58.35)361662
RPOWER 42.55(44)3729984
RTNPOWER 6.25(6.5)3938545
RUCHISOYA 23.25(23.05)373056
SADBHAV 288.75(291.15)124009
SADBHIN 103.05(104.2)6364
SAIL 60.75(63.2)5498245
SANOFI 4219.5(4337.85)5740
SBIN 300.55(307.7)14459919
SCHAEFFLER 4297.8(4453.15)12923
SCHNEIDER 128.9(130.3)70213
SCI 86.05(84.65)1659379
SHARDACROP 455.9(460.6)54350
SHILPAMED 650.2(652.95)40304
SHK 265.95(266.15)83476
SHOPERSTOP 359.45(359.85)89363
SHREECEM 18134.65(18426.55)17560
SHRIRAMCIT 2241.85(2325.85)68476
SIEMENS 1379.2(1368.45)180118
SIMPLEXINF 462.7(465)18704
SINTEX 34.05(35.35)13282777
SITINET 25.5(25.8)708250
SJVN 32.95(32.95)202818
SKFINDIA 1579.45(1590.35)4925
SMLISUZU 1024.8(1054.25)29537
SNOWMAN 53.55(54.95)322478
SOBHA 385.2(388.95)94128
SOMANYCERA 773.65(771.25)6148
SONATSOFTW 161.9(168.4)449523
SOUTHBANK 28.95(29.85)13353186
SPARC 369.6(372.75)313605
SREINFRA 119.25(121.05)1264674
SRF 1507.8(1536.4)166415
SRTRANSFIN 995.9(1018.3)792067
STAR 1016.05(1048.55)200321
STCINDIA 166.55(170.25)106266
SUNDARMFIN 1658.9(1678.75)16731
SUNDRMFAST 398.5(403.75)141454
SUNPHARMA 515.85(523.55)4531774
SUNTV 796.5(798.5)882736
SUPREMEIND 1100.9(1110.15)27625
SUVEN 170.45(170.2)98540
SUZLON 17.75(18.45)73282571
SWANENERGY 130.35(132.7)178825
SYMPHONY 1372.25(1395.55)7823
SYNDIBANK 69.6(72.9)3764054
SYNGENE 469.35(483.4)146816
TAKE 149.6(150.15)261437
TATACHEM 600.15(612.25)637146
TATACOFFEE 127.7(128.4)160351
TATACOMM 637.65(659.55)502741
TATAELXSI 1691.5(1715.2)164772
TATAGLOBAL 166.65(165.1)2895078
TATAMOTORS 431.45(440.35)6197142
TATAMTRDVR 253.6(260.45)1483140
TATAPOWER 82.65(82.6)2966583
TATASPONGE 813.55(826.5)126567
TATASTEEL 559.3(569.25)3286455
TBZ 106.45(110.9)1361681
TCS 2489.45(2473.8)941274
TECHM 407.15(402.05)4650231
TECHNO 373.7(373.45)37647
TEXRAIL 92.25(93.15)190463
THERMAX 908.75(876.8)25015
THOMASCOOK 220.55(222.95)100894
TIDEWATER 5825.9(5857.9)576
TIMKEN 712.65(718.5)11308
TITAN 558.05(552.8)4333554
TNPL 369.3(360.05)285663
TORNTPHARM 1254.05(1274.8)89554
TORNTPOWER 183.7(183.15)2521679
TREEHOUSE 15.95(16.2)37585
TRIDENT 84.15(86.1)559766
TRITURBINE 139.4(141.1)24053
TTKPRESTIG 6138.3(6266.65)4136
TTML 7.1(7.5)2523977
TUBEINVEST 758.45(774.2)107365
TV18BRDCST 38.65(38.85)3809932
TVSMOTOR 586.7(590.55)426796
TVSSRICHAK 3644.9(3767.45)10407
TVTODAY 240.85(241.7)80716
UBL 801.8(809.5)90500
UCOBANK 32.75(33.15)782757
UFLEX 428.15(439.9)223928
ULTRACEMCO 4084.4(4087.45)195349
UNICHEMLAB 268.55(269.1)26962
UNIONBANK 143.6(150.05)7698675
UNITECH 7.5(8.2)75201873
UPL 880.75(889)947932
VAIBHAVGBL 519.7(515)4822
VAKRANGEE 451(451.8)1038792
VEDL 279.95(280.95)5892361
VIDEOIND 23.65(22.55)1251285
VIJAYABANK 68.45(70.1)1115172
VINATIORGA 1027.05(1026.4)12921
VIPIND 185.95(179.35)1436186
VOLTAS 538.3(542.35)2375385
VRLLOG 327.4(323.9)39096
VSTIND 2939.1(2984.2)2213
VTL 1209.8(1221.75)109625
WABAG 622.65(613.25)170886
WABCOINDIA 5537.05(5545.85)1947
WELCORP 126.6(130.25)618175
WELSPUNIND 83.9(82.7)462980
WHIRLPOOL 1166.05(1159.6)13505
WIPRO 289.1(293.8)3645825
WOCKPHARMA 594.15(585.9)1526666
WONDERLA 347.9(353.6)13072
YESBANK 1785.45(1829)2997605
ZEEL 539.95(540.3)1906088
ZEELEARN 43.7(43.6)316635
ZENSARTECH 787.9(790.7)1999
ZYDUSWELL 886.1(889.25)2356

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ADITYA SPIN. 8.96(8.95)560
AGRO TECH FO 512.6(513.7)1289
AISHWARYA TE 4.05(4.12)1550
ALPHAGEO (I) 871.45(869.9)6489
ALU FLUORIDE 57(58.6)9287
AMAR RAJA BA 820.1(840.45)19148
ANDHRA BANK 55(56.35)159090
ANDHRA CEMEN 9.58(9.8)22865
ANDHRA PETRO 25.25(26.05)34537
ANJANI PORTL 225.2(227)557
ASTRA MICRO 131.25(134.15)51050
AUROB.PHARMA 741.35(730.85)239850
AVANTEL LTD 220.05(229.35)15432
AVANTI FEEDS 1786.15(1726.4)35799
B.N.RATHI SE 35(36.5)1303
BALAJI AMINE 318.8(325.05)1590
BAMBINO AGRO 182.9(192)6473
BARTRONICSIN 15.25(15.25)13119
BHAGIRA.CHEM 173.6(178.6)4081
BHAGYA INL 23.7(24.2)1557
BHARATFIN 821.65(841.55)114570
BNR UDYOG 38.5(37.25)4021
CAMBRIDGE 74.25(74.85)4374
CCHHL 14.53(14.68)47458
CCL PRODUCTS 284.75(289.15)26331
CELESTIAL 24.35(24.45)23580
CIL SECURITS 43.15(42.95)617
COROM INTER 457.15(450.75)42737
CUBEX TUBING 18.05(18.1)1995
CYBERMATE 3.15(3.31)133216
CYIENT 525.8(525.75)1343
DANLAW TECH. 50.8(52.3)2576
DECAN CEMENT 1125(1142.4)370
DHAN ROTO SP 22.7(23.8)430
DIAMONPOWER 26.15(27.15)28466
DIVI'S LAB. 670.45(668.55)56352
DIVYA.GRANIT 101.8(104.05)6488
DQ ENT 13.14(13.91)39587
DR.REDDY'S 2331.85(2379.85)58841
EMPEE SUGARS 5.9(6.04)5833
EVEREST ORG. 99.55(99.65)637
FACOR ALLOYS 4.05(4.03)62263
FIRSTOBJ 15.85(15.8)2437
G.R.CABLES .34(.33)270
GATI LTD. 116.1(118.05)47503
GAYATRI BIO 11.74(12.35)900
GAYATRI PROJ 165.35(168.65)3287
GENNEX LAB 4.62(4.64)95471
GMR INFRASTR 17.95(18.45)2063621
GODAVARI DRU 38.3(39.5)1955
GOLDST INFRA 75.7(75.2)88583
GOLDSTONE EN 9.45(9)63883
GRANULES (I) 132.45(136.55)86934
GVK POWERINF 12.05(12.52)3113164
HBL P SYS 47.25(48.05)30758
HERITGFOOD 1260.4(1252.05)1150
I.C.S.A. IND 2.9(3.13)13001
IKF TECHNO .61(.62)95917
INCAP LTD. 46.2(44)3702
IPAPPM 310.7(315.1)3075
IVRCL LTD 5.77(6.27)539915
KAKATIYA CEM 376.6(379.1)2278
KALLAM SPG. 26.85(27.6)16020
KAVERI SEED 694.25(689.7)48726
KCP LTD 102.25(102.05)14701
KERNEX MICRO 36.65(35.9)5081
KNR CONST 209(212)17315
KREBS BIOCHM 99.15(100.2)6471
LANCO INFRA 1.26(1.32)4071186
LOKESH MACH 84.05(86.9)28504
MADHUCON PRJ 32.25(32.25)22936
MOLD-TEK TEC 50.1(50)6492
MOSCHIP SEMI 43.85(44.75)93744
MSR INDIA 22.75(23.5)218714
N C L IND. 204.8(204.95)21636
NAGAR.AGRICH 37.05(37.05)11173
NATCO PHARM 965.2(961.7)20684
NCC 87.95(90.25)571646
NEHA INTER. 6.11(6.18)36601
NETTLINX LTD 111.95(104.9)18446
NEULAND LAB. 1443.55(1449.8)274
NIHAR INFO 16.5(16)1487
NILE LTD. 614.85(613.2)4857
NTL 4.52(4.52)3082
OIL COUNTRY 45.1(45.15)5162
PADMALAYA TE 9.47(9.96)101961
PALRED 107.95(109)1159
PANYAM CEMEN 62.9(64.65)14920
PENNAR STEEL 55(55.1)156216
PFL INFOTECH 5.77(5.77)8960
PHYTOCHEM I. 59.75(60)1223
PITTI LAMIN. 54.35(54.65)3448
POKARNA LTD 1282.4(1290.55)722
PRAJAY ENGS. 9.63(9.19)28979
PREMIER EXPL 460.3(471)4829
PRISM CEMENT 116.95(119.4)9047
RAIN 129.9(128.6)282346
RAJ PACKAGIN 55.25(56.05)19450
RAJVIR IND 41.1(43)100
REG.CERAMIC 5.88(5.84)1329
RESTILE CER. 5.51(5.64)2777
SAAMYA BIO 1.88(1.88)1000
SAGAR CEM. 836.45(846.05)667
SAMKRG PIST. 293.85(295.45)4866
SAMPRE NUTRI 46.85(45.8)1235
SANGHI IND. 91.35(88.5)87591
SATVAH.ISPAT 44(44.4)8313
SAVEN TECHNO 23(22.85)5350
SIBAR AUTO 11.38(11.97)193
SMPL 2.02(2.05)8497
SMS PHARMACE 76.25(77)587
SREE RAYALA 127.2(129.45)2796
STEEL EXCH 88.7(90.55)132985
SUJANA INDUS 1.18(1.2)15302
SURANATP 5.02(5.13)9960
SURYACHAKRA 1.65(1.67)32153
SURYAMBA SP 55.6(58)93
SURYAVA SPIN 9.45(9.02)142
SURYLAK.COTT 105.95(108.05)3352
SUVEN LIFE S 170.05(170.15)44143
TAJ GVK HOTL 165(167.4)1562
TANLA 35.7(36.5)72551
TCI INDUS. 1616(1616)20
TRANSCORP IN 19(19.2)1894
TRANSGENE BI 2.6(2.51)32592
TRANSPORT CO 301.6(304.25)16477
USHER AGRO 8.13(8.02)11765
VICEROY HOTE 18.6(19)9284
VIJAY TEXTIL 63.1(61.15)37312
VIMTA LABS 137.75(142)29174
VIRAT CRANE 36.85(36.9)927
VIRINCHI 88.35(89.8)25409
VISAKA IND. 489.5(485.9)9713
VISTA PHARMA 30.6(32.05)11592
VIVIMED LABS 120.35(119.8)67183
VST INDUS. 2950(2995)291
WATERBASE 109.8(109.45)88865
XLENERGY 2.02(1.82)3710
YBRANTDIGI 6.96(6.96)67247
ZEN TECH 55.6(56)17698
ZENOTECH 51.7(54.25)33207


పోలీసులు అరెస్టు చేసిన కృష్ణసింగ్, షంషేర్. దొరికిన బంగారం, నగదు

బెట్టింగ్ కింగ్ కటకటాల్లోకి

- కృష్ణ సింగ్, 114 మంది బుకీలు, పంటర్లు అరెస్టు

నెల్లూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లతో ఎన్నో కుటుంబాలను రోడ్డునపడేసిన బెట్టింగ్ కింగ్ కృష్ణ సింగ్‌ను అరెస్ట్ చేసినట్లు నెల్లూరు జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ప్రకటించారు. అతనితోపాటు మరో 114 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. గురువారం నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లపై ఫిర్యాదులు రావడంతో 21 చోట్ల దాడులు నిర్వహించి 115 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అరెస్ట్ అయిన వారిలో దేవళం కృష్ణ సింగ్ మొత్తం బెట్టింగ్ దందాకు సూత్రధారి అని ఎస్పీ తెలిపారు. అతనికి షంషేర్ ప్రధాన అనుచరుడిగా వ్యవహరిస్తున్నారన్నారు. అరెస్ట్ అయిన


పోలీసుల అదుపులో బుకీలు, పంటర్లు

వారిలో 9 మందిని జాతీయ బుకీలుగా గుర్తించామన్నారు. మరో 21 మంది సబ్ బుకీలుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వీరితోపాటు 85 మంది పంటర్లు, ఫైనాన్షియర్లను కూడా అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. పరారీలో ఉన్నవారినీ త్వరలో పట్టుకుంటామని స్పష్టం చేశారు. అరెస్ట్ చేసిన వారి నుంచి మూడు కార్లు, రూ.44.24 లక్షల నగదు, 220 గ్రాముల బంగారం, క్రికెట్ బెట్టింగ్‌లకు వినియోగించే 96 సెల్‌ఫోన్లు, పది ల్యాప్‌టాప్‌లు, మూడు కమ్యూనికేటర్లు, ఒక టీవీ, మరో ఎల్ ఈడీ, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కొందరు పోలీసు అధికారులు వీరికి సహకరించారని ఆరోపణలు రావడంతో ప్రాథమికంగా విచారించి గూడూరు డీఎస్పీ శ్రీనివాస్, నెల్లూరు నగర డీఎస్పీ వెంకటరాముడుతోపాటు నెల్లూరు నగర సీఐలు కరీం, రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు పంపామన్నారు. పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించిన తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో అన్ని పార్టీల నేతల అనుచరులు ఉన్న మాట నిజమేనని, ఎవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. త్వరలో చార్జిషీట్ వేసి కేసును వేగవంతం చేస్తామని, గతంలో ఎస్పీగా పని చేసిన వ్యక్తిపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవన్నారు.

సైకో పోలీస్!


సత్యనారాయణ

ఫ్లాటులో తాగుడు..తన్నుడు.. బెంబేలెత్తిన మహిళలు

- గుంటూరు పోలీసులకు ఫిర్యాదు
- మూడునెలల క్రితం సస్పెన్షన్
- అయినా మారని సీఐ వక్రబుద్ధి
- నన్నపనేని ఆదేశంతో అరెస్టు

గుంటూరు, ఆగస్టు 3 : సాధారణంగా ఏదైనా కష్టం వస్తే పోలీసులను ఆశ్రయిస్తాం. అలాంటిది ఓ పోలీసు అధికారి నుంచి తమను కాపాడాలంటూ.. గుంటూరువాసులు వేడుకొంటున్నారు. ఆయన తన సైకో చేష్టలతో తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. అపార్టుమెంటులో మరో మహిళతో కలిసి ఉంటూ.. తన ఫ్లాటునే బార్‌గా మార్చేశారని, ఇదేమిటి అని ప్రశ్నిస్తే, 'సీఐని తెలుసా?' అంటూ హూంకరిస్తున్నారని బాధిత మహిళలు.. గురువారం రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి వద్ద వాపోయారు. నిజానికి, ఈయన శాడిజం చేష్టలు పోలీస్‌శాఖ దృష్టికి రావడంతో, మూడు నెలల క్రితమే సస్పెండ్ చేసింది. ఇలాంటి అధికారిని పూర్తిగా సర్వీసు నుంచి తొలగించాలని రాజకుమారి డిమాండ్ చేశారు. బాధిత మహిళల కథనం ప్రకారం, ప్రకాశం జిల్లా సీసీఎస్‌లో పనిచేస్తున్న సీఐ ఎం చినసత్యనారాయణకి గుంటూరు జిల్లా యువతితో పెళ్లయింది. గుంటూరునగరంలో తన అత్తయ్య పేరిట ఉన్న ఫ్లాటులో సత్యనారాయణ తిష్ట వేశారు. ఫ్లాటులో వేరే మహిళతో కలిసి ఉంటున్నారు. నిత్యం మద్యం సేవిస్తూ, ఆ నిషాలో ఆడా మగా అనే భేదం లేకుండా ఫ్లాట్లలోని వారిని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం, కొట్టడం చేస్తున్నారు. ఇక భరించలేకపోయిన బాధితులంతా, మూడునెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత మార్చిలో పోలీస్ శాఖ సత్యనారాయణను సస్పెండ్ చేసింది. అప్పటినుంచి ఫ్లాటుకు రావడం దాదాపు మానేశారు. తిరిగి 2 రోజులుగా ఫ్లాటులో ఆయన కనిపిస్తున్నారు. చాలా కాలంగా ఫ్లాటులో ఎవరూ లేకపోవడంతో, కరెంటు బిల్లు కట్టలేదని అధికారులు ఫ్యూజు పీకేశారు. అయితే, అది అపార్టమెంటువాసుల పనేనని సత్యనారాయణ అవమానించారు. అటుగా వచ్చిన ఓ మహిళతో గొడవపడ్డారు. ఆమెను బలంగా పక్కకు నెట్టేశాడు. భయపడిపోయిన ఆ మహిళ పెద్దగా కేకలు పెట్టడంతో అంతా పోగయ్యారు. అంతా కలిసి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాజకుమారిని ఆశ్రయించారు. ఆమె ఆదేశాలతో.. సత్యనారాయణని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఐపీసీ 354, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ ఫ్లాటును సీజ్ చేయాలని ఆర్డీవోను రాజకుమారి ఆదేశించారు.

చంపుతానని బెదిరిస్తున్నాడు. ట్యాంకులో విషం కలుపుతానని భయపెట్టడంతో, మేమంతా బయటనుంచి నీళ్లు తెప్పించుకొంటున్నాం. పిల్లలను ఏమైనా చేస్తాడేమోనని పనికి కూడా వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాం.

బయటకు వెళ్లలేకపోతున్నాం


బాధిత మహిళలతో మాట్లాడుతున్న రాజకుమారి

గంజాయిపై ఉక్కుపాదం



- ఏవోబీలో సాగు, రవాణా నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
- పది కొత్త చెక్‌పోస్టులతో దశ దిశలా దిగ్బంధనం
- మూడేళ్లలో పూర్తిగా నిర్మూలించనున్న ప్రభుత్వం
- ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనలకు త్వరలో కార్యరూపం?

నర్సీపట్నం, ఆగస్టు 3: రాష్ట్రంలో గంజాయి సాగు, రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుంది. ఉత్తరాంధ్ర కేంద్రంగా పాకుతున్న ఈ రుగ్మతను శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్)ను రంగంలోకి దించనుంది. మూడేళ్లలో ఆంధ్రా-ఒడిసా సరిహద్దు(ఏవోబీ)లో గంజాయి సాగు అనేదే లేకుండా చేయాలన్నది లక్ష్యమని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఏవోబీ ప్రాంతంలో విస్తారంగా సాగు చేస్తున్న గంజాయి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా దేశ, విదేశాలకు భారీగా రవాణా అవుతున్నది. అధికారిక అంచనా ప్రకారం ఈ ప్రాంతంలో 150 నుంచి 200 గ్రామాల్లో ఏటా వందల ఎకరాల్లో సాగు చేస్తూ సుమారు ఐదు వేల టన్నుల గంజాయిని ఉత్పత్తి చేస్తున్నారు. చాలా కాలంగా సాగుతున్న గంజాయి సాగు, రవాణాను అరికట్టడానికి పోలీస్, ఎక్సైజ్ శాఖలు చేస్తున్న ప్రయత్నాలు పలు కారణాల వల్ల సఫలీకృతం కావడం లేదు. గంజాయితోపాటు, దాని ద్వారా తయారు చేస్తున్న నల్లమందు, లిక్విడ్ గంజాయి వినియోగం విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు వంటి పట్టణాల్లో అధికమవుతున్నది. దీంతో గంజాయిని కూకటివేళ్లతో సహా నిర్మూలించకపోతే రానున్న రోజుల్లో ఇది ఒక కొరకరాని కొయ్యగా మారుతుందని, యువత దీనికి బానిసలయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే... గంజాయి నిర్మూలనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎర్ర చందనం అక్రమ రవాణా నివారణకు ఏర్పాటు చేసినట్లుగానే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనుంది. పోలీస్, ఎక్సైజ్ శాఖల్లో ఇప్పటికే పనిచేస్తున్న యువకులతోపాటు, అవసరమైతే మరికొంత మందిని కొత్తగా రిక్రూట్ చేస్తారు. ఎస్‌టీఎఫ్‌లో సుమారు వెయ్యి మందిని నియమించనున్నట్టు అధికార వర్గాల భోగట్టా!

ఇదీ కార్యాచరణ

కేవలం మూడేళ్ల కాలవ్యవధిలోనే ఏవోబీలో గంజాయి సాగు, రవాణాను పూర్తిగా నిర్మూలించే విధంగా ఎస్‌టీఎఫ్ పనిచేయాల్సి ఉంటుంది. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు జరిపి గంజాయి పంటను, నిల్వలను ధ్వంసం చేయడం, గంజాయి రవాణాకు వినియోగిస్తున్న మార్గాలు, ట్రాన్సిట్‌పాయింట్‌లపై నిఘా ఉంచి, తరచుగా దాడులు చేయడం, గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా కట్టుదిట్టమైన నియంత్రణ చర్యలు చేపట్టడం ఎస్‌టీఎఫ్ ప్రధాన కర్తవ్యాలు. ఇందుకోసం కీలక ప్రాంతాల్లో పది ఎస్‌టీఎఫ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తారు. విశాఖ జిల్లాలో నాలుగు, తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు, ఒడిశా సరిహద్దులో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎస్‌టీఎఫ్‌కు ఆధునిక ఆయుధాలు, అధునాతన గాలింపు పరికరాలు వంటివి సమకూరుస్తారు. ఎస్‌టీఎఫ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వ ఆమోదానికి పంపామని, త్వరలో కార్యరూపం దాల్చవచ్చని అధికార వర్గాల సమాచారం.


పోలీసుల అదుపులో నిందితులు (ఫైల్)

నన్ను పట్టుకున్నందుకు

కంగ్రాట్స్

- సైన్యంతో లష్కరే చీఫ్ కమాండర్ ఆఖరి మాటలు



శ్రీనగర్, ఆగస్టు 3: "నేను పెళ్లి చేసుకోలేదు. తల్లిదండ్రులను వదిలి వచ్చిన రోజే వారు నాకోసం చచ్చిపోయారు" కనీసం తల్లిదండ్రులు, భార్యాపిల్లల గురించైనా ఆలోచించాలని ఓ భద్రతాధికారి కోరినప్పుడు లష్కరే తాయిబా చీఫ్ కమాండర్ పాకిస్థానీ అబూ దుజాన నుంచి వచ్చిన స్పందన ఇది! ఓ భవంతిలో నక్కిన దుజానాను లొంగిపొమ్మంటూ ఓ అధికారి ఫోన్ ద్వారా కోరారు. "ఈ రోజు మీరు నన్ను పట్టుకున్నారు. మీకు కంగ్రాట్స్" అంటూ వారిని అభినందించాడు. లొంగిపోయే ప్రసక్తే లేదని, ఏదో ఒక రోజు చచ్చిపోవాల్సిందే అన్నాడు.

సున్నా వచ్చినా పీహెచ్‌డీ

- ఎస్సీ, ఎస్టీలకు ఢిల్లీ వర్సిటీలో అవకాశం

న్యూఢిల్లీ, ఆగస్టు 3: ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన గణితశాస్త్ర విభాగం ఎస్సీ, ఎస్టీలకు పీహెచ్‌డీ ప్రవేశంలో వెసులుబాటు కల్పించింది. ప్రవేశ పరీక్షల్లో కనీస అర్హత మార్కులు రాకున్నా వీరు అడ్మిషన్‌కు అర్హులేనని ప్రకటించింది. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు ఇంటర్వ్యూతో కలిపి 200 మార్కులకు గాను 94 మార్కులు కనీస అర్హతగా పేర్కొన్నారు.

బినామీల వేట

- పరారీలో 'పాము' బావమరిది కృష్ణమూర్తి
- కోర్టు అనుమతితో ఆస్పత్రిలో సోదాలు
- లావాదేవీల వివరాలతో డైరీ లభ్యం
- భారీగా ఎర్రచందనం, టేకు కలప
- కేసు పెట్టి అరెస్టు చేసేందుకు సిద్ధం
- గంగాధరం కేసులోనూ బినామీలపై నజర్

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అవినీతిపరులపై విరుచుకుపడుతున్న ఏసీబీ... ఇప్పుడు వారి బినామీలను కూడా వేటాడుతోంది. దక్షిణాది రాష్ట్రాల్లోనే సంచలనం సృష్టించిన ప్రజారోగ్యశాఖ మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పాము పాండురంగారావుతోపాటు... ఆర్అండ్‌బీ మాజీ ఈఎన్‌సీ గంగాధరం బినామీలపైనా దృష్టి సారించింది. వెయ్యికోట్ల అక్రమాస్తులకు పడగెత్తిన 'పాము' బావమరిది డాక్టర్ నట్టా కృష్ణమూర్తిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలోని ఒక బ్యాంకులో బావమరిది పేరుతో పాముకు లాకర్ ఉన్నట్లు గుర్తించారు. దానిని తెరిచినప్పుడు 90 ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభించాయి. వాటిలో కొన్నింటికి సంబంధించిన ఆధారాలను మాత్రమే కృష్ణమూర్తి చూపించారు. వెరసి... ఆ 90లో 70 ఆస్తులు పాము పాండురంగారావుకు చెందినవేనని ఏసీబీ అధికారులు అంచనాకు వచ్చారు. 'పాము' మాత్రం ఆ ఆస్తులతో తనకు సంబంధంలేదని చెప్పారు. భార్య, కుమారులదీ అదే సమాధానం. ఎన్నిసార్లు ప్రశ్నించినా వారి మాట మారలేదు.



అజ్ఞాతంలో బావమరిది

'పాము' బావమరిది డాక్టర్ కృష్ణమూర్తిని ఏసీబీ అధికారులు విచారణకు పిలిచినా ఆయన రాలేదు. కోర్టు అనుమతితో ఆయన ఆసుపత్రి సోదా చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించగానే పరారయ్యారు. జూలై 17 నుంచి ఆయన కోసం ఏసీబీ అధికారులు వేటాడుతున్నారు. ఆయన తన ఆచూకీ పసిగట్టకుండా సెల్‌ఫోన్ కూడా ఆఫ్ చేసేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. చివరికి తన కుటుంబ సభ్యులతో సైతం ఫోన్‌లో మాట్లాడటంలేదు. తన సొంత ఆసుపత్రి (బేబీ చిల్డ్రన్స్ హాస్పిటల్)లో పనిచేసే సిబ్బందికి కొత్త కొత్త నెంబర్ల నుంచి ఫోన్లు చేసి కుటుంబ సభ్యులతో సమాచారం సేకరిస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది. ఈ నేపథ్యంలో కృష్ణమూర్తిని సైతం నిందితుడిగా చేర్చి అరెస్టు చేసేందుకు ఉన్న మార్గాలపై ఏసీబీ డీజీ ఠాకూర్ న్యాయ సలహాదారులతో చర్చించారు. కోర్టు అనుమతితో ఆయన ఆసుపత్రిలో గురువారం మరోసారి సోదాలు చేశారు. అందులో కీలక డాక్యుమెంట్లు లభించినట్లు తెలిసింది. తన బావ పాండురంగారావు తనకు ఎప్పుడెప్పుడు ఎంత డబ్బిచ్చారు? ఆ మొత్తాన్ని తిరిగి ఎలా వెనక్కి తీసుకున్నారు? ఏ ఆస్తులు ఎప్పుడు కొనుగోలు చేశారు? ఇలాంటి వివరాలతో కొన్నేళ్లుగా రాసిపెట్టుకున్న డైరీ లభించినట్లు సమాచారం. వీటి ఆధారంగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి పూర్తి ఆధారాలు లభించాక పాండురంగారావు భార్య, కుమారులను సైతం అరెస్టు చేసే ఆలోచనలో ఏసీబీ అధికారులున్నట్లు తెలిసింది. ఇక గురువారం నాటి సోదాల్లో కృష్ణమూర్తి ఆస్పత్రి భవనం స్టోర్ రూమ్‌లో భారీ స్థాయిలో ఎర్రచందనం, బర్మా టేకు దుంగలు కనిపించాయి. దీనిపై ఏసీబీ అధికారులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అదంతా అక్రమ కలపే అని నిర్ధారించిన అటవీ సిబ్బంది దీనిపై కేసు నమోదు చేశారు.


పాము పాండురంగారావు బావమరిది ఆస్పత్రిలో స్వాధీనం చేసుకున్న టేకు, ఎర్రచందనం

గంగాధరం బినామీల లెక్క!

ఆర్ అండ్ బీ మాజీ ఈఎన్‌సీ గంగాధరం కేసులోనూ ఏసీబీ ఉచ్చు బిగిస్తోంది. ఆయనకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్నట్లు అధికారులు గుర్తించారు. ఆయన కుమారుడు తేజ పేరుతో ఉన్న కంపెనీలకు డబ్బు ఎలా వచ్చిందన్న దానిపై ఏసీబీ అధికారులకు కీలక సమాచారం లభించింది. ప్రత్యేక కోర్టులు ఏర్పాటవగానే పాము పాండురంగారావు ఆస్తులతోపాటు గంగాధరం ఆస్తులు కూడా ప్రభుత్వపరం చేసేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది.

గిరిజన బాలికపై అత్యాచారం!

- రెండురోజులు నిర్బంధించి చిత్రహింసలు
- దూరపు బంధువు నిర్వాకం

కర్నూలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరసకు దూరపు బంధువైన వ్యక్తే ఆ చిన్నారిపై కన్నేశాడు. తనను గుడ్డిగా నమ్మి వచ్చిన ఆమెపై అత్యాచారానికి పాల్పడటంతోపాటు చిత్రహింసలకు గురిచేశాడు. రెండు రోజుల తర్వాత ఏమీ ఎరగనట్టు ఆ బాలికను తీసుకొచ్చి హాస్టల్‌లో దిగబెట్టి దర్జాగా వెళ్లిపోయాడు. కర్నూలు జిల్లాలో గత నెలలో జరిగిన ఈ ఘటన గురువారం వెలుగు చూసింది. జిల్లాలోని తుగ్గలి మండలానికి చెందిన గిరిజన బాలిక(13) ప్యాపిలి ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. గతనెల మొదటి వారంలో ఆమెకు దూరపు బంధువునంటూ ఓ వ్యక్తి(35) హాస్టల్‌కు వచ్చాడు. మాయమాటలు చెప్పి ఆమెను బయటకు తీసుకెళ్లాడు. అక్కడినుంచి సమీపంలోని కొండ ప్రాంతాలకు తీసుకెళ్లి ఆమెపై అత్యాచారానికి తెగబడ్డాడు. నోట్లో దుస్తులు కుక్కి చిత్రహింసలకు గురిచేసినట్లు సమాచారం. రెండురోజుల అనంతరం తిరిగి వసతి గృహంలో బాలికను వదిలి వెళ్లిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న ఆ చిన్నారిని హాస్టల్ వార్డెన్ భర్త కర్నూలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు సమాచారం. బాలిక తల్లిదండ్రులను కూడా అక్కడికే పిలిపించి విషయం బయటకు పొక్కకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై వార్డెన్‌ను వివరణ కోసం ప్రయత్నించగా స్పందించ లేదు. వసతి గృహంలోని బాలికపై అత్యాచారం జరగడంతో విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనపై సాంఘిక సంక్షేమశాఖ అధికారులు స్పందించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ హత్య


బాదన్న (ఫైల్)

కళ్యాణదుర్గం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి సమాఖ్య డైరెక్టర్ గొల్ల బాదన్న దారుణ హత్యకు గురయ్యారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం గొల్ల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గొల్ల గ్రామం నుంచి కళ్యాణదుర్గం వెళ్లే రోడ్డుపై వాకింగ్ చేయడానికి గురువారం ఉదయం 5 గంటలకు బాదన్న(63) ఇంటినుంచి బయటికి వచ్చారు. అప్పటికే అక్కడ మాటువేసిన గుర్తు తెలియని వ్యక్తులు కత్తులు, వేట కొడవళ్లతో ఆయనపై దాడి చేశారు. బాదన్నను ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మరణించారు.

విక్రంగౌడ్ అరెస్ట్.. రిమాండ్

ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే పోలీసుల అదుపులోకి.. కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

బంజారాహిల్స్/సైదాబాద్/హైదరాబాద్: మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రంగౌడ్‌ను బంజారాహిల్స్ పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. జూలై 28న తెల్లవారుజామున ఫిలింనగర్‌లో విక్రంగౌడ్‌పై కాల్పులు జరిగాయి. ఓ తూటా కుడి చేతిలోకి మరో తూటా కడుపులోకి వెళ్లడంతో ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులకు విక్రంగౌడ్ సెల్ఫ్ గేమ్ ఆడినట్టు నిర్ధారణ అయింది. రాజకీయ సానుభూతి కోసం విక్రం సుపారీ ఇచ్చి తన మీద కాల్పులు జరిపించుకున్నట్లు నిర్ధారణ అయింది. కాల్పులు జరిపిన ఆరుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారి అయిన విక్రంను ఎ-1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. చికిత్స పొందుతున్న విక్రం ఆరోగ్యం మెరుగుపడటంతో అపోలో వైద్యులు గురువారం డిశ్చార్జ్ చేస్తున్నట్టు ప్రకటించారు. విషయం తెలియడంతో బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వద్ద కొద్దిసేపు హైడ్రామా చోటు చేసుకుంది. విక్రంను పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. 14 రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. కాగా, విక్రం తరఫున న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. తన క్లయింట్ వెన్ను పూస భాగంలో ఇంకా బుల్లెట్ అలాగే ఉందని, చేతికి శస్త్ర చికిత్స చేసిన నేపథ్యంలో ఆయన ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకొని బెయిలివ్వాలని కోరారు. కాని పీపీ మాత్రం కాల్పుల కేసులో విక్రం ప్రధాన నిందితుడని అతడికి బెయిల్ ఇస్తే సాక్షులను బెదిరించే అవకాశం ఉందని కోర్టుకు తెలిపారు.


విక్రమ్‌గౌడ్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

వైద్యురాలి అదృశ్యంపై వీడని మిస్టరీ

- గాలిస్తున్న 3 ప్రత్యేక బృందాలు

విజయవాడ(గుణదల), ఆగస్టు 3: ఇంటి నుంచి వెళ్లిపోయిన వైద్యురాలు సూర్యకుమారి వ్యవహారం మిస్టరీగా మారింది. మంగళవారం రాత్రి నుంచి కనిపించకుండాపోయిన సూర్యకుమారి ఆచూకీ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. సూర్యకుమారి తల్లి కొర్లపాటి మరియమ్మ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంటి నుంచి తమ కుమార్తె వెళ్లిన గంట వ్యవధిలోనే ఆమెతో పరిచయం ఉన్న విద్యాసాగర్ అలియాస్ బాబి తమ ఇంటికి వచ్చి... 'సూర్యకుమారి సెల్‌ఫోన్ ఇచ్చి వెళ్లిపోయింది' అని చెప్పినట్లు మరియమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యాసాగర్ తండ్రి స్వర్గీయ బి.ఎస్.జయరాజు మాజీ ఎమ్మెల్యే. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి 1983-85లో ప్రాతినిధ్యం వహించారు. విద్యాసాగర్‌కు బీసెంట్‌రోడ్డు సమీపంలో జ్యూయలరీషాపు ఉంది. అతడికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. సూర్యకుమారి ప్రతి ఆదివారం స్వరాజ్యమైదానం వద్దగల సీఎస్ఐ చర్చికి ప్రార్థనకు వెళుతుంటుంది. అదే చర్చిలో పరిచయమైన విద్యాసాగర్‌తో ఆమెకు 2010 నుంచి పరిచయం ఏర్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మరిన్ని వివరాల కోసం విద్యాసాగర్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. సూర్యకుమారి తమ ఇంటికి తరచూ వస్తుంటుందని విద్యాసాగర్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సూర్యకుమారి నూజివీడు సమీపంలోని ఒక పీహెచ్‌సీలో వైద్యురాలిగా పనిచేస్తోంది. ప్రతి రోజూ ఇంటినుంచి కారులో వెళ్లి వస్తుంది. పెళ్లి చేస్తామని తల్లిదండ్రులు చెప్తుంటే సూర్యకుమారి ఒప్పుకోవడం లేదని దర్యాప్తులో తేలింది. దీంతో కొంతకాలం ఢిల్లీలో ఉంటున్న సోదరుడి వద్ద ఉండి... పీజీ కోసం శిక్షణ తీసుకోవాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ వెళ్లిందేమోనని పోలీసులు ఆరా తీసినా ఉపయోగం లేకుండా పోయింది. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి ఆమె కోసం గాలిస్తున్నారు. సూర్యకుమారి అక్క కర్ణాటకలో కలెక్టర్‌గా పని చేస్తోంది. విజయవాడ క్రీస్తురాజపురంలోని ఫిలింనగర్ ఇంటి నుంచి సూర్యకుమారి వెళ్లాక బస్టాండ్, రైల్వేస్టేషన్, పుష్పాహోటల్ ప్రాంతాల్లోని పలు సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. అయితే ఆమె ఎటువైపు వెళ్లిందో తెలియరాలేదు. ఆమె వెళ్లిన స్కూటీ వాహనం కూడా ఎక్కడా కనిపించడం లేదు.




సూర్యకుమారి, విద్యాసాగర్

ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్
విజయవాడ శుక్రవారం 4 ఆగస్టు 2017

దక్షిణాఫ్రికా x ఇంగ్లండ్
నాలుగో టెస్టు - తొలి రోజు
మ.3.30 నుంచి
STAR SPORTS SELECT 1

ప్రో కబడ్డీలో నేటి మ్యాచ్‌లు
బెంగళూరు X తలైవాస్ రాత్రి 8.గం (STAR SPORTS 2)
పుణె X ఢిల్లీ రాత్రి 9.గం (maa movies)


సాకేత్

అర్జునకు సురేఖ, సాకేత్

• పుజారా, హర్మన్ కూడా • ఖేల్ రత్నకు దేవేంద్ర, సర్దార్ • సిఫారసు చేసిన కమిటీ

ఖేల్ రత్న సిఫారసులు:
దేవేంద్ర జఝారియా (పారా అథ్లెట్), సర్దార్ సింగ్ (హాకీ).

అర్జున అవార్డుల సిఫారసులు:
వెన్నం జ్యోతి సురేఖ (ఆర్చరీ), సాకేత్ మైనేని (టెన్నిస్), కుష్బీర్ కౌర్ (అథ్లెటిక్స్), ఆరోకియా రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్ బాల్), దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), చటేశ్వర్ పుజారా (క్రికెట్), ఒయినమ్ బెంబెం దేవి (ఫుట్‌బాల్), ఎస్ఎస్‌పీ చౌరాసియా (గోల్ఫ్), హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), ఎస్‌వీ సునీల్ (హాకీ), జస్వీర్ సింగ్ (కబడ్డీ), పీఎన్ ప్రకాష్ (షూటింగ్), ఆంథోని అమల్‌రాజ్ (టేబుల్ టెన్నిస్), సత్యవర్త్ కడియాన్ (రెజ్లింగ్), మరియప్పన్ తంగవేలు (పారా అథ్లెట్), వరుణ్ భాటి (పారా అథ్లెట్).

న్యూఢిల్లీ: అర్జున అవార్డుల ప్రతిపాదనల్లో తెలుగు యువ ప్లేయర్లు తళుక్కుమన్నారు. ప్రముఖ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని, ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డుకు నామినేట్ అయ్యారు. 17 మంది క్రీడాకారుల పేర్లను రిటైర్డ్ జస్టిస్ సీకే ఠక్కర్ నేతృత్వంలోకి అవార్డుల సెలెక్షన్ కమిటీ గురువారం క్రీడా మంత్రిత్వ శాఖకు సిఫారసు చేసింది. టెస్ట్ క్రికెటర్ చటేశ్వర్ పుజారా, మహిళల వరల్డ్‌కప్ స్టార్ హర్మన్‌ప్రీత్ కౌర్, పారాలింపిక్స్ పతక విజేతలు మరియప్పన్ తంగవేలు, వరుణ్ భాటి, గోల్ఫర్ ఎస్ఎస్‌పీ చౌరాసియా, హాకీ ప్లేయర్ ఎస్‌వీ సునీల్‌లకు కూడా అర్జున అవార్డుల ప్రతిపాదిత జాబితాలో చోటు దక్కింది. డేవిస్ కప్ ప్లేయర్‌గా సాకేత్ గుర్తింపు సాధించాడు. 2014 ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జాతో కలిసి సాకేత్ స్వర్ణం గెలిచాడు. విజయవాడకు చెందిన 21 ఏళ్ల జ్యోతి సురేఖ ఆర్చరీలో దూసుకుపోతోంది. 2016 దక్షిణాసియా క్రీడల్లో టీమ్ స్వర్ణంతోపాటు వ్యక్తిగత రజతం సాధించింది. 2015 ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో వ్యక్తిగత స్వర్ణం నెగ్గింది. అనేక జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో సత్తాచాటింది. ఇక పుజారా గత ఏడాది ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన భారత క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు.

ఖేల్‌రత్నకు సర్దార్, దేవేంద్ర

క్రీడారంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక రాజీవ్ గాంధీ ఖేల్ రత్నకు పారాలింపిన్ దేవేంద్ర జఝారియా, భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్ పేర్లను రికమండ్ చేశారు. ఒక పారా అథ్లెట్‌ను ఖేల్ రత్నకు సిఫారసు చేయడం ఇదే ప్రథమం. పారాలింపిక్స్‌లో జావెలిన్ త్రోలో తొలి స్వర్ణాన్ని సాధించిన దేవేంద్ర అవార్డు రేస్‌లో ముందున్నాడు.

ఖేల్‌రత్నకు.. మిథాలీని మరిచిన బీసీసీఐ..!



న్యూఢిల్లీ: వరల్డ్‌కప్‌లో భారత మహిళా క్రికెటర్లపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ముఖ్యంగా కెప్టెన్ మిథాలీ రాజ్ అద్భుత ప్రదర్శనతో భారత్‌ను ఫైనల్స్‌కు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించింది. ఈ క్రమంలో వన్డేల్లో అత్యధికంగా ఆరు వేల పరుగుల మైలురాయిని చేరిన ఉమెన్ క్రికెటర్‌గానూ చరిత్ర సృష్టించింది. అయితే ఇంతటి ఘనతను సాధించిన మిథాలీ పేరును ప్రతిష్ఠాత్మక రాజీవ్ ఖేల్‌రత్న అవార్డుకు పంపడంలో బీసీసీఐ విఫలమైంది. డెడ్ లైన్ ఏప్రిల్ 30లోపు ప్రతిపాదిత పేర్లను పంపాలి. అర్జున అవార్డుల కోసం పుజారా, హర్మన్‌ప్రీత్ పేర్లను నామినేట్ చేసిన భారత బోర్డు.. మిథాలీని పట్టించుకోలేదని సమాచారం. అయితే ఆలస్యంగానైనా ప్రతిపాదన లు పంపే అవకాశం ఉన్నా.. అందుకు క్రీడా మంత్రి జోక్యం అవసరం. మరి బీసీసీఐ తప్పుదిద్దుకుంటుందా? వేచి చూడాలి..!


సురేఖ

ఆంధ్రజ్యోతితో జ్యోతి సురేఖ

ఆసియా క్రీడల్లో పతకం సాధిస్తా

ఆంధ్రజ్యోతి, విజయవాడ: పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న తీరున ఐదేళ్ల ప్రాయంలోనే స్విమ్మింగ్‌లో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఎక్సెప్షనల్ అవార్డులను అందుకున్న వెన్నం జ్యోతి సురేఖ ఆర్చరీలో అర్జున అవార్డుకు నామినేట్ అయింది. ఇది ఎంతో ఆనందం కలిగించే విషయమంటున్న జ్యోతి.. సీనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడల్లోనూ పతకాలు సాధించి తీరుతానంటోంది. ఆమెతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

చిన్న వయసులోనే అర్జునకు సిఫారసు కావడం ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వ ప్రకటన చూసి నమ్మలేకపోయా.

మీకు ఆర్చరీ పట్ల ఆసక్తి ఎలా కలిగింది?

మా తాతగారు పీఈటీగా పనిచేసేవారు. ఆయన కబడ్డీ కోచ్‌గా కూడా చేశారు. క్రీడలపై ఆసక్తి ఆయన నుంచే అలవడింది. ఐదు సంవత్సరాల వయసులో విజయవాడలోని కృష్ణా నదిలో 5 కిలోమీటర్ల మేర ఈదాను. అనంతరం తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆర్చరీలో చేరాను.

ఆర్చరీలో మరిచిపోలేని సంఘటన?

2011లో సబ్ జూనియర్ స్థాయిలో ఉండి, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ చాంపియన్‌షిప్స్ సాధించాను. అది నిజంగా మరిచిపోలేను.

మీ తదుపరి లక్ష్యాలేంటి?

ఈ ఏడాది జరిగే సీనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించాలనేది నా ప్రస్తుత లక్ష్యం. అదే విధంగా వచ్చే ఏడాది ఆసియా క్రీడల్లో వ్యక్తిగత పతకం సాధించాలనేది నా కల.

శిక్షణకు సంబంధించి లభిస్తున్న ప్రోత్సాహం ఎలా ఉంది?

శిక్షణ విషయంలో ఏ ఇబ్బంది లేదు. చాలా ప్రోత్సాహకరంగా ఉంటుంది. మా కాంపౌండ్‌లో ఆసియా గేమ్స్ కేటగిరి వరకు అవకాశం ఉంది.

మీ శిక్షకుల వివరాలు?

విజయవాడలో ఉండగా.. రైల్వే ఉద్యోగి రామారావు వద్ద శిక్షణ తీసుకున్నాను. తర్వాత సాయ్ ఆధ్వర్యంలోకి వచ్చాక పంజాబ్‌కు చెందిన జీవన్ జ్యోత్‌సింగ్ తేజ వద్ద శిక్షణ తీసుకుంటున్నాను.

త్వరలో ఆడబోయే టోర్నీల వివరాలు చెబుతారా?

ఈనెల 8 నుంచి 13 వరకు జర్మనీలో జరగే వరల్డ్ కప్ స్టేజ్-4కు ప్రాతినిధ్యం వహిస్తున్నా. అలాగే దక్షిణ భారతదేశంలో వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ కూడా ఆడుతా.

అసలే టెస్టు క్రికెట్.. ఆడుతోంది కెరీర్‌లో 50వ మ్యాచ్..! పైగా సూపర్ ఫామ్‌లో ఉన్నాడు..! దానికితోడు తన పేరును అర్జున అవార్డుకు సిఫారసు చేసిన ఉత్సాహం..! ఇక టెస్ట్ స్పెషలిస్ట్ చటేశ్వర్ పుజారా ఆగుతాడా..! పరుగుల దాహంతో రగిలిపోతున్న వాడిలా రెచ్చిపోయాడు..!

శ్రీలంకతో తొలి టెస్టులో సూపర్ సెంచరీతో అలరించిన పుజారా రెండో మ్యాచ్‌లోనూ శతకాభివాదం చేశాడు..! శ్రీలంక గడ్డపై ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ సెంచరీల మోత మోగించి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో టెస్టుల్లో 4 వేల పరుగుల మైలురాయిని కూడా చేరుకున్నాడు. పుజారాకు తోడు అజింక్యా రహానె కూడా శతక విన్యాసం చేయడంతో లంతో రెండో టెస్టు తొలిరోజు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత్ సిరీస్ విజయానికి గట్టి పునాది వేసుకుంది.


పుజారా (128 బ్యాటింగ్)
రహానె (103 బ్యాటింగ్)

3
అతి తక్కువ ఇన్నింగ్స్‌ల్లో 4 వేల రన్స్ పూర్తి చేసిన భారత మూడో బ్యాట్స్‌మన్‌గా పుజారా... రాహుల్ ద్రావిడ్ సరసన నిలిచాడు. వీరిద్దరూ 84 ఇన్నింగ్స్‌ల్లో ఈ మార్కు దాటారు. సునీల్ గవాస్కర్, సెహ్వాగ్ (81 ఇన్నింగ్స్‌లు) ముందున్నారు.

6
వరుసగా ఆరు ఇన్నింగ్స్‌ల్లో 50 పైచిలుకు పరుగులు చేసిన భారత మూడో బ్యాట్స్‌మన్ రాహుల్. అంతకుముందు గుండప్ప విశ్వనాథ్, రాహుల్ ద్రావిడ్ మాత్రమే ఈ ఘనత సాధించారు.

శతకాభివాదం!

• పుజారా, రహానె సెంచరీలు
• తొలి ఇన్నింగ్స్ 344/3
• శ్రీలంకతో రెండో టెస్టు

కొలంబో: టీమిండియా మిస్టర్ డిపెండబుల్ చటేశ్వర్ పుజారా (225 బంతుల్లో 10 ఫోర్లు, సిక్సర్‌తో 128 బ్యాటింగ్) అజేయ సెంచరీతో తన 50వ టెస్టును చిరస్మరణీయంగా మార్చుకున్నాడు. అజింక్యా రహానె (168 బంతుల్లో 12 ఫోర్లతో 103 బ్యాటింగ్) కూడా శతకంతో అలరించడంతో ఆతిథ్య శ్రీలంకతో రెండో టెస్టులోనూ భారత్ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇక్కడి సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో గురువారం మొదలైన రెండో టెస్టులో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 344 పరుగులు సాధించింది. యువ ఓపెనర్ కేఎల్ రాహుల్ (57) అర్ధ సెంచరీతో రాణించాడు. శిఖర్ ధవన్ (35) శుభారంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. కెప్టెన్ విరాట్ కోహ్లీ (13) మాత్రం నిరాశపరిచాడు. సొగసైన ఆటతీరుతో శతకాభివాదం చేసిన పుజారా, రహానె క్రీజులో ఉన్నారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు అజేయంగా 211 పరుగులు జోడించారు.

ధవన్, రాహుల్ మెరుపులు

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు మెరుపు ఆరంభం దక్కింది. గత మ్యాచ్‌లో భారీ శతకంతో చెలరేగిన శిఖర్ ధవన్.. జ్వరం నుంచి కోలుకొని జట్టులోకొచ్చిన లోకేశ్ రాహుల్‌తో కలిసి ధాటిగా బ్యాటింగ్ చేశాడు. ఈ ఇద్దరి జోరుకు 8.2 ఓవర్లలోనే భారత్ స్కోరు 50 పరుగులు దాటింది. కానీ, భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించిన ధవన్‌ను దిల్‌రువాన్ పెరీర అవుట్ చేశాడు. పెరీర వేసిన ఇన్నింగ్స్ 11వ ఓవర్లో ధవన్ ఎల్బీగా వెనుదిరిగాడు. తొలుత అంపైర్ నాటౌట్ ఇచ్చినా.. లంక రివ్యూ కోరి నెగ్గింది. ఈ దశలో వన్‌డౌన్‌లో వచ్చిన పుజారాతో కలిసి రాహుల్ పరుగుల వేట కొనసాగించాడు. అతను 72 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. భారత్ 101/1 స్కోరుతో లంచ్‌కు వెళ్లింది.

పుజారా, రహానె జోరు

లంచ్ అనంతరం భారత్ తడబడింది. విరామం తర్వాత మూడో ఓవర్లోనే పుజారాతో సమన్వయ లోపంతో రనౌట్‌గా రాహుల్ వెనుదిరిగాడు. కోహ్లీ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. హెరాత్ ఆఫ్ స్టంప్‌నకు దూరంగా వేసిన బంతిని వెంటాడి స్లిప్‌లో మాథ్యూస్‌కు చిక్కాడు. వెంటవెంటనే రెండు వికెట్లు కోల్పోవడంతో భారత్ 133/3తో కష్టాల్లో పడినట్టు కనిపించింది. అయితే.. అప్పటికే క్రీజులో పాతుకుపోయిన పుజారా లంకకు పైచేయి సాధించే అవకాశం ఇవ్వలేదు. రహానెతో కలిసి ఇన్నింగ్స్ బాధ్యతను భుజాన వేసుకున్నాడు. దాంతో, ఆతిథ్య జట్టు కోలుకొని 238/3 స్కోరుతో టీ బ్రేక్‌కు వెళ్లింది. టీ నుంచి వచ్చిన తర్వాత రహానె చకచకా పరుగులు రాబట్టాడు. మరోవైపు పుష్పకుమార వేసిన 68 ఓవర్లో డబుల్ తీసిన పుజారా కూడా టెస్టు క్రికెట్‌లో 13వ శతకం సాధించాడు. ఆపై ఇద్దరూ లంక బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. రహానె కూడా హెరాత్ వేసిన 86వ ఓవర్లో సింగిల్ తీసి కెరీర్‌లో తొమ్మిదో సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: ధవన్ (ఎల్బీ) దిల్‌రువాన్ పెరీర 35, కేఎల్ రాహుల్ (రనౌట్) 57, పుజారా (నాటౌట్) 128, కోహ్లీ (సి) మాథ్యూస్ (బి) హెరాత్ 13, రహానె (నాటౌట్) 103; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 90 ఓవర్లలో 344/3; వికెట్లపతనం:** 1-56, 2-109, 3-133; **బౌలింగ్:** ప్రదీప్ 17.4-2-63-0, హెరాత్ 24-3-83-1, కరుణరత్నె 3-0-10-0, దిల్‌రువాన్ పెరీర 18-2-68-1, పుష్పకుమార 19.2-0-82-0, డిసిల్వ 8-0-31-0.

టైటాన్స్ పాంచ్ ఫట్‌కా..

• ఐదోసారి ఓడిన తెలుగు జట్టు • 43-36తో మళ్లీ గెలిచిన పట్నా


టైటాన్స్ రైడర్‌ను టాకిల్ చేస్తున్న పట్నా


మ్యాచ్‌కు హాజరైన నారా బ్రహ్మణి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఈ సారి టైటిల్ వదలేదిలేదంటూ బరిలోకి దిగిన తెలుగు టైటాన్స్ తొలి మ్యాచ్‌లోనే ఘన విజయంతో అదరగొట్టి ఆపై తీవ్ర నిరాశపర్చింది. అత్యంత పేలవ ప్రదర్శనతో వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ పరాజయం మూటగట్టు కుంది. రెండు సార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ చేతిలో రెండోసారి ఓడి తొలి అంచె పోటీలకు నిరాశగా వీడ్కోలు పలికింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో పట్నా 43-36తో టైటాన్స్‌ను చిత్తు చేసింది. తమ ఆరంభ మ్యాచ్‌లో తెలుగు జట్టును ఓడించిన పట్నా రెండోసారి కూడా పైచేయి సాధించింది. కెప్టెన్ పర్‌దీప్ నార్వల్ (12), మోను గోయత్ (10) చెలరేగి ఆడగా.. వినోద్ కుమార్ (4), జైదీప్ (4), మనీష్ (4) వారికి అద్భుత సహకారం అందించాడు. మళ్లీ రాహుల్ చౌదరిపైనే ఎక్కువ ఆధారపడడంతో పాటు డిఫెన్స్‌లో తేలిపోయిన టైటాన్స్ ఏ దశలోనూ ప్రత్యర్థికి పోటీ ఇవ్వలేకపోయింది. రాహుల్ (12), రాకేశ్ కుమార్ (6), నిలేష్ (4), రక్షిత్ (4) మెరిసినా.. సమన్వయం లేని టాకిల్స్‌తో ఆతిథ్య జట్టు చేజేతులా ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో రెండు సార్లు ఆలౌటైన రాహుల్‌సేన.. ప్రత్యర్థిని ఒకసారి ఆలౌట్ చేసింది. చివర్లో రాహుల్ దాటిగా ఆడినా.. ఫలితం లేకపోయిం ది. జోన్-బిలో ఆరు మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో టైటాన్స్ 8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.


క్వార్టర్స్‌లో ప్రణయ్, సిరిల్

ఆక్లాండ్: నాలుగో సీడ్ హెచ్ఎస్ ప్రణయ్, ఏడోసీడ్ సౌరవ్ వర్మ న్యూజిలాండ్ గ్రాండ్ ప్రీ గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ప్రణయ్ 21-18, 21-19 స్కోరుతో పదో సీడ్ వీ నాన్ (హాంకాంగ్)పై విజయం సాధించాడు. తదుపరి రౌండ్‌లో ప్రణయ్..11వ సీడ్ లిన్ యూ సీన్ (చైనీస్‌తైపీ)ని ఎదుర్కొంటాడు. హోరాహోరీగా జరిగిన మరో ప్రీక్వార్టర్ ఫైనల్లో జాతీయ మాజీ చాంపియన్ సౌరవ్ వర్మ 21-18, 13-21, 21-16 స్కోరుతో సహచరుడు పారుపల్లి కశ్యప్‌పై గెలుపొందాడు. సిరిల్ వర్మ కూడా 13-21, 14-21 స్కోరుతో చియా హుంగ్ లూ (చైనీస్‌తైపీ) చేతిలో ప్రీక్వార్టర్స్‌లో ఓడిపోయాడు.

పాక్, ఇంగ్లండ్‌ల్లో విజయాలు మరిచావా ?



న్యూఢిల్లీ: కోహ్లీ సారథ్యంలోని టీమిండియాకు గతంలోని ఏ భారత జట్టూ సాటిరావన్న కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యను మాజీ కెప్టెన్ గంగూలీ తనదైన శైలిలో తిప్పికొట్టాడు. పాకిస్థాన్, ఇంగ్లండ్‌ల్లో భారత్ విజయాలను మరిచిపోయావా.. అని ప్రశ్నించాడు. '15 ఏళ్లలో తొలిసారి పాకిస్థాన్‌ను వారిదేశంలో, అలాగే 2002లో ఇంగ్లండ్‌లో ఆ జట్టును ఓడించిన విషయాన్ని మరిచినట్టున్నావు. అయితే నేను జట్లను పోల్చిచూసే విషయాల్లోకి వెళ్లదలుచుకోలేదు' అని చెప్పాడు '2019 వరకూ శాస్త్రికి బాధ్యతలు అప్పజెప్పాం. ప్రపంచకప్‌ను తిరిగి తీసుకురాగలిగితే ఆ పదవికి అతడు న్యాయం చేసినట్టేన'ని గంగూలీ అన్నాడు.



విభిన్న భాషలు మన సంపద

"దేశంలో అద్భుతమైన భాషాపరమైన వైవిధ్యాలు ఉన్నా.. భారతీయులు ఆ దిశగా పరిశోధనల్లో వెనుకబడి ఉండటం బాధాకరం. సీజర్, చామ్‌స్కీ గురించి బాగా తెలిసిన విద్యావేత్తలు.. అదేస్థాయి మేధోసంపత్తి కలిగిన పాణిని, బర్తృహరి, ఆనందవర్ధన్, అభినవ గుప్త సిద్ధాంతాలను పట్టించుకోవడం లేదు. భాషాసిద్ధాంతాల రూపంలో అంతులేని సంపద ఉన్నా.. వలసదేశాలకు సంబంధించిన పరిమితమైన విషయాల చుట్టూ పరుగులు పెడుతున్నారు. దేశంలోని భాషాపరమైన భిన్నత్వాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకున్నప్పుడే భారీస్థాయిలో ఉపాధి, వ్యాపార అవకాశాలు సిద్ధిస్తాయి"

-మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (భారత ప్రజల భాషాపరమైన సర్వే (పీఎల్ఎస్ఐ) కార్యక్రమంలో మాట్లాడుతూ)

50 ఏళ్లలో 400 భాషలు కనుమరుగు

- భారత్‌లో వేగంగా అంతరిస్తున్న గిరిజన భాషలు

న్యూఢిల్లీ, ఆగస్టు 3: మన దేశంలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు మాట్లాడుతున్న భాషలు వేగంగా కనుమరుగవుతున్నాయి. ఇప్పుడు మాట్లాడుతున్న భాషల్లో సగానికి పైగా 50 ఏళ్లలో కనుమరుగయ్యే ప్రమాదముంది. భారత ప్రజల భాషలపై జరిపిన సర్వే(పీఎస్ఎల్ఐ)లో ఈ విషయం వెల్లడైంది. సర్వేకు నేతృత్వం వహించిన జీఎన్ దేవి చెప్పిన వివరాల ప్రకారం.. '130 కోట్ల మంది భారతీయులు 780 భాషలు మాట్లాడుతున్నారు. అందులో 400 భాషలు 50 ఏళ్లలో కనుమరుగవుతాయి. ఇప్పటికే గత 50 ఏళ్లలో 250 భాషలు కనుమరుగయ్యాయి. ఒక్కో భాష కనుమరుగయ్యే కొద్దీ సంబంధిత సంస్కృతి కూడా అంతమవుతుంది.' అన్నారు. బిహార్‌లోని తూర్పు ప్రాంతంలో గిరిజనులు మాట్లాడుతున్న మైథిలి అనే భాషకు వెయ్యి ఏళ్ల చరిత్ర ఉంది. ఇలాంటి మరెన్నో గిరిజన భాషలు దేశంలోని ఏదో ఓ మూల మాట్లాడుతూనే ఉన్నారు. వీటిని క్రోడీకరించి దేశ సంస్కృతి, వైవిధ్యాన్ని కాపాడేందుకు మేధావులు, ఉపాధ్యాయులు నడుం బిగించారు. 6 వేల భాషలపై 2025 నాటికి ఓ డాక్యుమెంట్‌ను రూపొందిస్తామని దేవి తెలిపారు.



నియంతృత్వ పాలనతోనే పాక్‌కు మేలు

దేశంలో ప్రజా ప్రభుత్వాల పాలన గాడితప్పిన ప్రతిసారి నియంతలు, మిలటరీ పాలకులు దాన్ని పట్టాలెక్కించారు. దేశంలో మిలటరీ పాలన నెలకొన్నప్పుడల్లా పాకిస్థాన్ అభివృద్ధి పథంలో దూసుకెళ్లింది ప్రజలు కూడా తమ సమృద్ధి, దేశాభివృద్ధినే కోరుకుంటారు తప్ప.. దేశంలో నడుస్తోంది రాచరికమా.. మిలటరీ పాలననా.. నియంతృత్వ ప్రభుత్వమా.. అనేవి పట్టించుకోరు. 1999లో కూడా ప్రజల అభీష్టం మేరకే నేను తిరుగుబాటుతో అధికారాన్ని చేజిక్కించుకున్నా"

-పర్వేజ్ ముషారఫ్ పాక్ మాజీ నియంత

చంపేసే వడగాలి

2100 నాటికి దక్షిణాసియాలో 150 కోట్ల మందిపై ప్రభావం

- మనుగడ సాగించలేనంత ఉష్ణోగ్రతలు
- ఎంఐటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి
- 2050కి 5.3 కోట్ల మందిలో ప్రొటీన్ లోపం

వాషింగ్టన్, ఆగస్టు 3: పర్యావరణ మార్పుల వల్ల పెరుగుతున్న భూతాపంతో భారతదేశానికి పెనుముప్పు ముంచుకొస్తోంది! రాగల కొన్ని దశాబ్దాల్లో ప్రాణాంతక వడగాలులు దక్షిణాసియాలోని దాదాపు 150 కోట్ల మంది ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాల ప్రజలు.. ఈ శతాబ్దాంతానికి అంటే 2100 నాటికి భరించలేనంత, మనుగడ సైతం సాగించలేనంత తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలను, ఆహార సంక్షోభాన్ని ఎదుర్కోనున్నారు. మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా) పరిశోధకుల అధ్యయనంలో ఈ ఆందోళనకర విషయాలు వెల్లడయ్యాయి. అయితే.. ఇప్పటికీ సమయం మించిపోలేదని, భూతాపాన్ని తగ్గించడానికి అవసరమైన చర్యలను చేపడితే ఆ పెనుముప్పు నుంచి తప్పించుకోవచ్చని ఎంఐటీ పరిశోధకులు పేర్కొన్నారు. కర్బన ఉద్గారాలను వీలైనంత తక్కువస్థాయికి తగ్గించుకోలేకపోతే కొన్ని దశాబ్దాల వ్యవధిలోనే వేడిగాలులు గంగ, సింధు రివర్ బేసిన్లపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరిస్తున్నారు. మరీ ముఖ్యంగా.. ఈ వేడిగాలుల ప్రభావం ఉత్తర భారతదేశం, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దక్షిణ భాగంపై ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. రానున్న కొన్ని దశాబ్దాల్లో వేడిగాలుల ముప్పును ఎదుర్కొనే ప్రాంతంగా ఉత్తరభారతదేశం రెండోస్థానంలో ఉండగా, పర్షియన్ గల్ఫ్ మొదటిస్థానంలో, తూర్పు చైనా మూడోస్థానంలో ఉన్నట్టు అధ్యయన నివేదికలో పేరొన్నారు.



ఎందుకంత ఆందోళన..

వడగాలులు మనకేం కొత్త కాదు. కానీ, తట్టుకోలేనంత.. మనుగడ సాగించలేనంత వడగాలులంటే ఎలా ఉంటాయి? దీన్ని ఎంఐటీ శాస్త్రజ్ఞులు ఎలా నిర్ధారించారు? ఏ అంచనాతో ఈ నిర్ణయానికి వచ్చారు? అంటే.. 'వెట్-బల్బ్ టెంపరేచర్' విధానంలో వారు ఈ అంచనాలు రూపొందించారు. థర్మామీటర్‌తో సాధారణంగా ఉష్ణోగ్రతను కొలిస్తే దాన్ని డ్రై-బల్బ్ టెంపరేచర్ అంటారు. అదే థర్మామీటర్ పైభాగంలో ఉండే బల్బుకు తడివస్త్రాన్ని చుట్టి ఉష్ణోగ్రతను కొలిస్తే దాన్ని వెట్‌బల్బ్ టెంపరేచర్ అంటారు. డ్రై-బల్బ్ ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు చేరినా మనకు ప్రమాదం ఉండదుగానీ.. వెట్-బల్బ్ టెంపరేచర్ 35 డిగ్రీలకు చేరితే మాత్రం ప్రాణాలకు ముప్పే. ఆ వేడిలో మనిషి 6 గంటలు కూడా బతకలేడు. గతంలో నిర్వహించిన అధ్యయనాల్లో భూగోళం మొత్తమ్మీదా.. వెట్-బల్బ్ టెంపరేచర్ 31 డిగ్రీలకు మించిన సందర్భాలు అరుదు. కానీ, 2015లో నిర్వహించిన అధ్యయనంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో వెట్-బల్బ్ ఉష్ణోగ్రత దాదాపు 35 డిగ్రీలకు చేరింది. 2015 వేసవిలో దక్షిణాసియా చరిత్రలోనే అత్యంత ప్రాణాంతక వేడిగాలులు వీచాయి. వాటితో పాక్, భారత్‌లో 3500 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

2100 నాటికి భారత్, చైనాలో వెట్-బల్బ్ ఉష్ణోగ్రత సగటు 31 నుంచి 34.02 డిగ్రీలకు పెరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికే భారత్‌లో కొన్ని ప్రాంతాల ప్రజలు 32 డిగ్రీల వెట్-బల్బ్ ఉష్ణోగ్రతలకు గురవుతున్నట్టు తెలిపారు. 2100 నాటికి ఇది మరింత పెరిగి 70 శాతం మంది ప్రజలు ఆ స్థాయి ఉష్ణోగ్రతలకు.. 2 శాతం ప్రజలు 35 డిగ్రీల (వెట్-బల్బ్) వేడికి గురవుతారని, ఈ వేడిగాలుల వల్ల వ్యవసాయ ఉత్పత్తి కూడా తగ్గి ఆహార సంక్షోభం వస్తుందని హెచ్చరించారు. మరోవైపు.. భూతాపం వల్ల 2050 నాటికి 5.3 కోట్ల మంది భారతీయులు ప్రొటీన్ లోపంతో బాధపడతారని మరో అధ్యయనంలో తేలింది.



నిరశనలో మురుగన్

మితాహారం.. సాధువు వేషం.. ప్రాణ పరిత్యాగ యత్నం

చెన్నై, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న మురుగన్.. ప్రాణ పరిత్యాగానికి సన్నద్ధం అవుతున్నాడు. రోజులో ఒక్కపూట మాత్రమే పండ్లు తీసుకుంటూ శరీరాన్ని శుష్కింప చేసుకుంటున్నాడు. ఏడాదికాలంగా గెడ్డం పెంచి, కాషాయ దుస్తులు ధరించి సాధువులా కనిపిస్తున్నాడు. కాగా, తమను చెన్నైలోని పుళల్ జైలుకు తరలించాలని నళిని, మురుగన్ దంపతులు పెట్టుకొన్న దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. దీంతో తన కుమార్తె వివాహం జరిపేందుకు ఆరు నెలలపాటు పెరోల్ కావాలని నళిని కోరారు. మురుగన్ మాత్రం తనను జైలు నుంచి విడుదల చేయాలని, లేనిపక్షంలో సజీవ సమాధికి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాడు. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తూ ఆగస్టు 18 వరకు రోజుకు ఒక్కపూట మాత్రమే పండ్లు తీసుకుంటానని, ఆ తర్వాత జైల్లోనే సజీవ సమాధి అవుతానని ప్రకటించాడు.

ఆర్మీ అధికారులపై అమ్మాయిల వల

- మన రక్షణ రహస్యాల కోసం పాక్, చైనా నిఘా సంస్థల ఎత్తు

న్యూఢిల్లీ, ఆగస్టు 3: మృదువుగా గొంతు, నదురుగా అమ్మాయి! నచ్చి ముందుకెళితే ఉచ్చులో పడిపోయినట్టే! దేశ రక్షణ రహస్యాలు చేజారిపోయినట్టే! మన సైనిక అధికారులకు వలలు వేయడానికి పాకిస్థాన్, చైనా నిఘా సంస్థలు వేస్తున్న ఎత్తులివి! ఉర్దూ, ఇంగ్లిష్ బాగా మాట్లాడగలిగిన అమ్మాయిలు.. వాట్సప్, ఫేస్‌బుక్‌ల ద్వారా భారత ఆర్మీ అధికారులతో మొదట పరిచయం పెట్టుకొంటారు. ఉర్దూ గజల్స్, హిందీ గీతాలు, ఇంగ్లిష్ కవితలను పోస్టు చేయడంద్వారా మానసికంగా దగ్గర అవుతారు. కొద్దిరోజుల తరువాత 'కలుద్దాం వస్తావా' అంటూ హోటల్‌కు పిలుస్తారు. చొరవతో పక్కన కూర్చొని, లైంగికంగా రెచ్చగొడతారు. ఆ దృశ్యాలను రికార్డు చేస్తారు. ఇలా చాలాసార్లు జరిగాక, వాటిని చూపించి బెదిరింపులకు దిగుతారు. చిన్నగా దేశ రక్షణ రహస్యాలను రాబట్టడం మొదలుపెడతారని రక్షణ శాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

రైలును హైజాక్ చేసిన నక్సల్స్

పాట్నా, ఆగస్టు 3: ప్రయాణికులతో వెళ్తున్న దనాపూర్-దుర్గ్ ఎక్స్‌ప్రెస్ రైలును మావోయిస్టులు హైజాక్ చేశారు. విధుల్లో ఉన్న గార్డును అపహరించారు. లఖిసరాయ్ జిల్లాలోని భలూయి స్టేషన్‌కు సమీపంలో గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా షాహిద్ జితేంద్ర స్టాప్ వద్ద సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 207 కోబ్రా బెటాలియన్, నక్సల్స్ మధ్య కొద్దిసేపు కాల్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో వారు గార్డును అక్కడే వదిలేసి సమీపంలోని అడవుల్లోకి పారిపోయినట్లు అధికారులు వెల్లడించారు.

ఏపీ నుంచీ దిగ్విజయ్ ఔట్


- ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా



న్యూఢిల్లీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గోవా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌చార్జిగా ఉద్వాసనకు గురైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్‌కు.. ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి పదవీ దూరమైంది. తనకు మాటైనా చెప్పకుండా ఆయా రాష్ట్రాల బాధ్యతల నుంచి తొలగించడంతో మనస్తాపానికి గురైన ఆయన.. ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు తెలిసింది. దీంతో మిగిలి ఉన్న ఏపీ బాధ్యతలను కూడా వదులుకున్నట్లయింది. తన స్థానంలో కొత్త వారిని నియమించాలని పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి ఆయన రాజీనామా లేఖ రాసినట్లు సమాచారం. దిగ్విజయ్ స్థానంలో రాష్ట్ర కొత్త ఇన్‌చార్జిగా కర్ణాటకకు చెందిన సీనియర్ నేత బీకే హరిప్రసాద్‌ను నియమించే అవకాశాలున్నాయని పార్టీ కీలక నేతలు వెల్లడించారు. గోవా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్ద పార్టీగా అవతరించినా.. ప్రభుత్వ ఏర్పాటుకు ఇతర పక్షాల మద్దతు కూడగట్టడంలో జాప్యం కారణంగా బీజేపీ అక్కడ సర్కారును ఏర్పాటు చేసింది. దీంతో అధిష్ఠానం ఆగ్రహించి దిగ్విజయ్‌ను గోవా బాధ్యతల నుంచి తొలగించింది. వచ్చే ఏడాది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆయన ఆ రాష్ట్ర ఇన్‌చార్జిగా వద్దని స్థానిక నేతలు ఒత్తిడి తేవడంతో అక్కడి నుంచీ ఆయన్ను తప్పించారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వంపై అనవసర ట్వీట్‌లతో వివాదాలు రేగడంతో ఆ రాష్ట్ర ఇన్‌చార్జిగానూ దిగ్విజయ్‌ను తప్పించారు. ఏపీ కాంగ్రెస్‌కు త్వరలో కొత్త ఇన్‌చార్జిని పంపడంతో పాటు ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డిని కూడా మార్చుతారని సీనియర్ నేతలు అంటున్నారు.

ఇంగ్లిష్ వస్తేనే అమెరికాకు

- పాయింట్ల ఆధారంగా గ్రీన్‌కార్డు
- అమెరికాలో కొత్త వలస బిల్లు
- పూర్తిగా సమర్థించిన ట్రంప్



వాషింగ్టన్, ఆగస్టు 3: అమెరికాలో వలస విధానం మారబోతోంది! విదేశాల నుంచి ఇక్కడకు వలస వచ్చేవారికి తప్పనిసరిగా ఇంగ్లిష్ భాష తెలిసి ఉండాలని తీరాలని ప్రతిపాదిస్తూ ప్రతిభ ఆధారిత వలస బిల్లు సిద్ధమైంది. దీనిని కాంగ్రెస్ ఉభయసభలు ఆమోదిస్తే.. ఆంగ్ల భాషా ప్రావీణ్యం, ఉన్నత విద్య, అధిక వేతన ఉపాధి అవకాశాలు, వయసు ప్రాతిపదికలుగా పాయింట్ల ఆధారంగా గ్రీన్‌కార్డులు మంజూరవుతాయి. ఈ బిల్లుకు 'పటిష్ఠ ఉపాధికి అమెరికా వలస విధానం సంస్కరణ చట్టం-రెయిజ్ యాక్ట్)'గా పేరుపెట్టారు. దీనివల్ల చట్టబద్ధంగా దేశంలోకి వచ్చే వలసదారుల సంఖ్య సగానికి తగ్గిపోతుందని ఈ బిల్లు రూపకర్తలైన సెనేటర్లు టామ్ కాటన్, డేవిడ్ పెర్డూ బుధవారం వెల్లడించారు. దీనిని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పూర్తిగా సమర్థించారు. 'ఇతర దేశాలకు చెందినవారికి అమెరికన్ గ్రీన్‌కార్డులు మంజూరు చేసే ప్రక్రియ మారిపోతుంది. ఈ గ్రీన్‌కార్డులు శాశ్వత నివాసం, అధికారిక ఉపాధి కల్పించడమే గాక.. శాశ్వత పౌరసత్వాన్ని అందిస్తాయి' అని తెలిపారు. అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్ కూడా ఈ బిల్లును గట్టిగా సమర్థించారు. కాగా, జాతీయ భద్రతా మండలిలో నిఘా డైరెక్టర్‌గా ఉన్న ఎజ్రా కొహెన్-వాత్నిక్‌ను ట్రంప్ తొలగించారు.

2వేల కోట్ల అక్రమాస్తులు!

- కర్ణాటక మంత్రిపై బిగుస్తున్న ఉచ్చు
- రెండో రోజు 60 చోట్ల ఐటీ సోదాలు
- ఈడీ కేసుతో కొత్త చిక్కులు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల కోసం క్యాంప్ నిర్వహిస్తున్న కర్ణాటక మంత్రి డి.కె.శివకుమార్ మరిన్ని ఇబ్బందుల్లో కూరుకుపోయారు. రెండ్రోజులుగా ఐటీ సోదాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝుళిపించింది. ఆయనపై గురువారం ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. శివకుమార్ దాదాపు 2వేల కోట్ల మేర అక్రమాస్తులు పోగేసుకున్నట్లు ఈడీ గుర్తించినట్లు తెలిసింది. ఇంకోవైపు.. గురువారం మంత్రి, ఆయన సోదరి, మామ, బంధుమిత్రులు, అనుచరుల నివాసాల్లో కనీసం 60 చోట్ల ఐటీ సోదాలు జరిగాయి. హసన్ జిల్లాలో శివకుమార్ ముఖ్య అనుచరుడు సచిన్ నారాయణ నివాసాల నుంచి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కొన్ని లాకర్లను తెరవడంతో అక్రమాస్తుల డాక్యుమెంట్లు బయటపడినట్లు సమాచారం. పాత నోట్లు కూడా పెద్ద సంఖ్యలో పట్టుబడడంతో మంత్రి, ఆయన అనుచరులకు రద్దయిన నోట్ల మార్పిడితో సంబంధం ఉందని ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. ఇదిలాఉండగా.. ఐటీ అధికారులు నిబంధనలు పాటించకుండా దాడులు జరిపారని ఆ రాష్ట్ర సీఎస్ కేంద్రంకు లేఖ రాశారు. రాష్ట్ర పోలీసులను కాదని, సీఆర్‌పీఎఫ్ భద్రత తీసుకోవడం ద్వారా పోలీసులను అవమానించారని నిరసన తెలిపారు. మరోవైపు... 'దెబ్బకు దెబ్బ' అన్నట్లుగా కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. 17 మంది బీజేపీ నేతలపై ఉన్న పాత కేసులను తిరగదోడుతున్నట్లు సమాచారం. సీఎం సిద్ధరామయ్య తన తన అధికార నివాసంలో దాదాపు 2 గంటల పాటు ఏసీబీ అధికారులతో రహస్య సమాలోచనలు జరిపారు.



బెంగళూరు శివారులోని ఈగిల్టన్ రిసార్టులో గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

తిరుమల చూపరా?

- కొడగు కొండల్లో తిప్పరా?.. గుజరాత్ ఎమ్మెల్యేల గుర్రు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వారు గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. మొత్తం 43 మంది.. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు ఓటేయకుండా బీజేపీ తన్నుకుపోతుందన్న భయంతో పార్టీ అధిష్ఠానం వీరిని బెంగళూరు శివారులోని ఈగిల్టన్ రిసార్టులో ఉంచింది. తిరుమల శ్రీవారి దర్శనానికి తీసుకెళ్తామని, కర్ణాటకలోని కొడగు కొండలు కూడా చూపిస్తామని వారికి హామీ ఇచ్చింది. కానీ మాట నిలబెట్టుకోలేదు. దీంతో ఆ ఎమ్మెల్యేలు క్యాంప్ నిర్వాహకులపై గుర్రుమంటున్నారు. 'తిరుమలకు ఎప్పుడు తీసుకెళతారు? బాలాజీ దర్శనం చేసుకోకుంటే ఎలా?' అని ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక మంత్రి శివకుమార్‌పై ఐటీ దాడుల నేపథ్యంలో కొందరిలో దడ మొదలై స్వరాష్ట్రం వెళ్లిపోతామని మారాం చేస్తున్నారు.



జబల్‌పూర్‌లోని స్కూలు విద్యార్థులు జవాన్లకు రాఖీలు కడుతున్న దృశ్యం

చైనా రాఖీలు కొనొద్దు!.. ఆరెస్సెస్ ప్రచారం

న్యూఢిల్లీ, ఆగస్టు 3: "రాఖీ పండగ వచ్చేస్తోంది! పదపద రాఖీలు కొందాం! అని బయలుదేరారా? మీరు కొన్న రాఖీ ఎక్కడ తయారైందో చూడండి! మేడిన్ చైనా రాఖీలు అస్సలు కొనకండి" అంటూ వాట్సాప్, ఫేస్‌బుక్‌లో ఆరెస్సెస్ స్వయంగా ప్రచారం మొదలుపెట్టింది. "సోదరీమణులారా... దయచేసి చైనా రాఖీలు కొనవద్దు. దీని బదులు మీ సోదరుడికి ప్రేమతో ఓ ఎర్ర దారం కట్టండి. ఆశీర్వాదం పొందండి" అని ఆరెస్సెస్ సూచిస్తోంది. దీనికి మంచి స్పందన కూడా లభిస్తోంది.

ఆఫీసులో రాఖీలు కట్టండి!

న్యూఢిల్లీ : 'ఈనెల 7న రాఖీ పండుగను అన్ని కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాలి. ఆ రోజు మహిళా ఉద్యోగులంతా తమ ఆఫీసులోని పురుష సహోద్యోగులకు రాఖీలు కట్టాలి' ఇది డామన్-డయ్యూ సిబ్బంది వ్యవహారాల కార్యదర్శి గురుప్రీత్‌సింగ్ జారీ చేసిన సర్క్యులర్! ఆరోజు అందరూ ఆఫీసుకు రావాలని, రాని వారి జాబితాను తమకు పంపించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వివాదం కావడంతో వెనక్కి తగ్గారు.

బీఎస్ఎన్ఎల్ రాఖీ కానుక

న్యూఢిల్లీ, ఆగస్టు 3: 'రాఖీపే సౌగాత్' (రాఖీ కానుక) పేరిట బీఎస్ఎన్ఎల్ ప్రీపెయిడ్ కస్టమర్లకు కొత్త రీచార్జ్ ప్లాన్ అందుబాటులోకి తెచ్చింది. రూ.74తో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ఫోన్లకు అపరిమిత కాల్స్ చేసుకోవచ్చు. 1జీబీ డేటా, రూ.74 టాక్‌టైమ్ కూడా. రీచార్జ్ చేయించుకున్న 5 రోజులు వ్యాలిడిటీ. గురువారం నుంచి ఈనెల 12 వరకు ప్లాన్ అందుబాటులో ఉంటుంది. అలాగే 'కాంబో ప్లాన్'లు కూడా ప్రవేశపెట్టింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.